సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 286 | బుధవారం | 16 -09-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




వచ్చే నెల 15 నుండి

## యుపిఐ చెల్లింపు ఛార్జీలు

● రూ.2 వేలు లోపు చెల్లింపులకు ఉచిత లావాదేవీలు ● లక్ష రూపాయలు లోపు చెల్లింపులకు రూ.300లు ● ఓటిటి చెల్లింపులు రూ.2 వేలు దాటితే రూ.400




**న్యూఢిల్లీ:** యుపిఐ ద్వారా చెల్లింపులకు ఆరేళ్ళపాటు ఇచ్చిన ఉచిత సౌకర్యానికి తెర పడింది. వ్యాపారులకు చెల్లించే లావాదేవీలపై వినియోగదారులకు ఎలాంటి భారం ఉండదు. చిరు వ్యాపారులకు మినహాయింపు ఇచ్చారు. రూ.2000లు దాటిన యుపిఐ లావాదేవీకు 0.4 శాతం చార్జీలు వర్తిస్తాయి. మర్చంట్ డిస్కౌంట్ రేటు(ఎండిఆర్)ను గరిష్టంగా రూ.300గా నిర్దేశించారు. ఐతే ఓటిటి వేదికలకు చెల్లింపులు చేయాల్సివస్తే ఆ చెల్లింపులు రూ.2000 దాటితే ఎండిఆర్ వర్తించదు. రూ.400లు ఇవ్వాల్సిందే. అదేవిధంగా ప్రభుత్వ వినియోగ బిల్లులు అంటే విద్యుత్ ఛార్జిలు,వాటర్ బిల్లులు,స్కూలు ఫీజులు వంటివి తరువాయి 8లో

22ఎ నిషేధిత భూములపై అసెంబ్లీలో

## సమగ్ర వివరణ

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని ప్రభుత్వం నిర్ణయం

అందుబాటులో ఉన్న మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర 22ఎ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న రాష్ట్ర మంత్రులతో అత్యవసరంగా సమావేశమయ్యారు. సమావేశంలో ప్రధానంగా ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వ వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడంపై చర్చించారు. ముఖ్యంగా 22ఎ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఉత్తమ్ కుమార్, జి.వివేక్ వెంకటస్వామితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో 22ఎ భూముల అంశంపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సుదీర్ఘంగా వివరించారు. 22ఎ కు సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో పూర్తి సమాచారాన్ని ముఖ్యమంత్రికి మంత్రి అందజేశారు.

సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రిని

## పునరుద్ధరించండి



● విద్య, టూరిజం, వైద్య రంగాల్లో కలిసి పనిచేద్దాం
● 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు రండి
● ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని, ఈ రంగాల్లో ప్రభుత్వానికి సహకరించాలని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5ను కోరారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సలహాదారు రామకృష్ణా రావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5 తండ్రి కీ.శే.ఆగా ఖాన్–4 మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు వివరించారు.హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయని ఆయన తెలిపారు. మరోవైపు, ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని ఆమె కోరారు. తెలంగాణలో ఫౌండేషన్ తరపున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు సిఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సిఎం ప్రస్తావించారు.

**ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్––5 ఆసక్తి**

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి తరువాయి 8లో

## ట్రంప్‌ను సంతృప్తి పరిచేందుకేనా?

యుపిఐ చెల్లింపులకు చార్జీలు వసూలుపై కాంగ్రెస్ విమర్శ

యుపిఐపై రుసుములు విధించేందుకు మోదీ ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** యుపిఐ లావాదేవీలపై రుసుములు విధించేందుకు మోదీ ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాజీపడ్డ మన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా ఒత్తిడికి మరోసారి లొంగిపోతున్నారరన్నారు. యుపిఐ లావాదేవీలపై ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తింది. ఇలాంటి లావాదేవీలకు ప్రజలు రుసుము చెల్లించేందుకు స్పష్టంగా రంగం సిద్ధమవుతోందని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంతృప్తి పరచడం కోసం అమెరికన్ సంస్థలకు డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తీసుకురావడానికే ఇలా చేస్తున్నారా అని ప్రశ్నించింది. యుపిఐపై రుసుములు తరువాయి 8లో

'రాజీవ్ యువ వికాసం'

నవంబర్ 19 నుంచి

## తొలి విడత సాయం

● విద్యాభివృద్ధికి ఖర్చుకు వెనుకాడబోం
● ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే లక్ష్యం
● డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టీకరణ
● గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేసిందని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికే కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యారంగ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడబోమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. నవంబర్ 19 నుంచి తరువాయి 8లో

## ఐక్యతకు ఎప్పుడూ సిద్ధమే

● ప్రజాసమస్యలపై కమ్యూనిస్టుల ఐక్య కార్యాచరణతో పాటు ఏకం కావాలని జాతీయ మహాసభలోనే నిర్ణయం తీసుకున్నాం
● సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు స్పష్టీకరణ ● సిపిఐ నాయకత్వంతో వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాసమస్యలపై కమ్యూనిస్టుల ఐక్య కార్యచరణతో పాటు ఏకం కావాలని జాతీయ మహాసభలోనే సిపిఐ నిర్ణయం తీసుకుందని, ఇందుకు ఇప్పుడు ఎప్పుడు కట్టుబడే ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టత ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీలన్ని ఐక్యం కావాలని, ఇందుకు సిపిఐ ప్రత్యేక చొరవ తీసుకోవాలని వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక సిపిఐ రాష్ట్ర న్యాయత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో తరువాయి 8లో

అంతరిక్షం నుంచీ

## యుద్ధం చేయగలం

ఆయుధాన్ని అభివృద్ధి చేసినట్లు అమెరికా ప్రకటన

స్పేస్‌ను యుద్ధభూమిగా మార్చొద్దు : చైనా హెచ్చరిక



**వాషింగ్టన్ :** అంతరిక్షం నుండి యుద్ధం చేయడానికి వీలుగా ఒక ఆయుధాన్ని అమెరికా అభివృద్ధి చేసింది. తమ వద్ద అంతరిక్ష ఆయుధాలు ఉన్నట్లు మొదటిసారి అమెరికా అంగీకరించింది. భూమిక క్ష్యలో ఒక అంతరిక్ష ఆయుధాన్ని మోహరించినట్లు అమెరికా అంగీకరించడం ఇదే మొదటిసారి. శత్రువుల నుండి అమెరికా సైన్యాలను కాపాడుకోవడానికి భూకక్ష్యలో ఒక ఆయుధం ఉండాల్సిన అవసరం ఉందని అమెరికా వైమానిక దళ కార్యదర్శి ట్రాయ్ మీంక్ అన్నారు. ఎయిర్–స్పేస్–సైబర్ అనే అంశంపై మంగళవారం జరిగిన ఒక సదస్సులో మీంక్ మాట్లాడుతూ, యుద్ధ సాంకేతికతలో తీవ్రమైన మార్పులు తరువాయి 12లో

'పిఎంఎవై' కింద తెలంగాణకు

## 2 లక్షల ఇళ్లు

ఆంధ్రప్రదేశ్‌కు మూడు లక్షల ఇళ్లు మంజూరు

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి



**ఢిల్లీ/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' (పిఎంఎవై) పథకం కింద తెలుగు రాష్ట్రాలకు భారీ సంఖ్యలో ఇళ్లను మంజూరు చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పేదల కోసం ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్లు మంజూరు కావడం చరిత్రలోనే ఇదే మొదటిసారని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల పేదల కలను సాకారం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోదీకి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన కృతజ్ఞతలు తరువాయి 12లో

మరుగునపడ్డ వీర నారీమణుల

## చరిత్ర వెలికితీయాలి

● తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వారి పాత్రను పాఠ్యాంశాల్లో పొందుపరచాలి ● ప్రముఖ రచయిత్రి డాక్టర్ శ్రీదేవి ఉద్ఘాటన



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలాది మంది మహిళలు ప్రాణాలకు తెగించి పోరాడిన వీర నారీమణుల చరిత్రను పాఠ్యాంశాల్లో పొందపర్చి భవిష్యత్ తరాలకు అందించాలని ప్రముఖ రచయిత డాక్టర్ శ్రీదేవి అన్నారు. చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం పేర్లు మాత్రమే విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని, అజ్ఞాతంగా మిగిలిపోయిన వందలాది తరువాయి 12లో




# 'యాప్' వెనుక అలసిన మనిషి బలహీన స్వరం

స్మార్ట్ ఫోన్‌లో ఒక యాప్ తెరుచుకుంటుంది. ఆర్డర్ వస్తుంది. కొన్ని నిమిషాల్లో ఆహారం, మందులు, కిరాణా సామగ్రి ఇంటి గుమ్మానికి చేరతాయి. మరో 'యాప్' వాహనం బుక్ చేస్తే డ్రైవర్ ప్రత్యక్షమవుతాడు. నగర జీవితం వేగంగా సాగేందుకు గిగ్ ఆర్థిక వ్యవస్థ కీలకంగా మారింది. కానీ ఈ వేగం వెనుక పరుగులు తీస్తున్న మనిషి జీవితం ఎలా ఉంది? అతని ఆరోగ్యం, భద్రత, పని గంటలు, విశ్రాంతి, సామాజిక భద్రత గురించి మనం ఎంతగా ఆలోచిస్తున్నాం? జనపహల్, గిగ్ వర్కర్స్ అసోసియేషన్ నిర్వహించిన తాజా అధ్యయనం ఈ ప్రశ్నలకు ఆందోళన కలిగించే సమాధానం ఇస్తోంది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ సహా పది నగరాల్లో వివిధ ప్లాట్‌ఫామ్స్ ఆధారిత గిగ్ కార్మికులపై అధ్యయనం చేసిన తర్వాత విడుదల చేసిన నివేదిక ప్రకారం 57 శాతానికి పైగా కార్మికులు వారానికి కనీసం 49 గంటలు పనిచేస్తున్నారు. 23.4 శాతం మంది వారానికి 70 గంటలకు మించి పనిచేస్తున్నారు. అంటే గిగ్ పని ఇక అదనపు ఆదాయం కోసం చేసే తాత్కాలిక పని కాదు. అనేక కుటుంబాలకు అదే ప్రధాన జీవనాధారం. అయితే పూర్తి స్థాయి ఉద్యోగానికి సమానంగా పని చేస్తున్నా, పూర్తి స్థాయి ఉద్యోగికి లభించే హక్కులు, భద్రత మాత్రం వారికి అందడం లేదు. ప్లాట్‌ఫామ్ సంస్థలు గిగ్ కార్మికుడికి స్వేచ్ఛ ఉందని చెబుతాయి. తనకు నచ్చినప్పుడు పని చేయవచ్చని, నచ్చనప్పుడు ఆపివేయవచ్చని అంటాయి. కానీ వాస్తవ జీవితంలో ఆదాయం కోసం ఎక్కువ ఆర్డర్లు తీసుకోవాల్సి ఉంటుంది. సమయానికి డెలివరీ చేయాలి. రేటింగ్ కాపాడుకోవాలి. ప్రోత్సాహకాలు కోల్పోకూడదు. అల్గారిథమ్ నిర్ణయించే పనితీరు ప్రమాణాలను అందుకోవాలి. ఈ ఒత్తిళ్ల మధ్య 'స్వేచ్ఛా కార్మికుడు' అనే నిర్వచనం ఎంతవరకు వాస్తవమో ప్రశ్నించాలి. ఆరోగ్య గణాంకాలు ఈ పరిస్థితిని మరింత స్పష్టం చేస్తున్నాయి. 64.5 శాతం మంది అలసట, నిద్రకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటున్నారు. 47.42 శాతం మంది కండరాలు, ఎముకలకు సంబంధించిన నొప్పులతో బాధపడుతున్నారు. 41.08 శాతం మందికి ఒత్తిడి, ఆందోళన ఉన్నాయి. 30 శాతం మందికి కళ్ల సమస్యలు, 26.45 శాతం మందికి శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నాయి. గంటల తరబడి బైక్ నడపడం, వాహనాలపై కూర్చోవడం, సరుకులు మోయడం, ట్రాఫిక్‌లో ప్రయాణించడం, ఎండలో పనిచేయడం శరీరంపై నిరంతర ఒత్తిడిని పెంచుతున్నాయి. విశ్రాంతి, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక అవసరాల పరిస్థితి కూడా తీవ్రంగా ఉంది. 53.8 శాతం మంది పని సమయంలో తాగునీటిని సొంత డబ్బుతో కొనుక్కుంటున్నారు. 43.9 శాతం మంది డబ్బులు చెల్లించి టాయిలెట్లను ఉపయోగిస్తున్నారు. 74.6 శాతం మందికి విశ్రాంతి తీసుకునే స్థలం అసలు లేదు. 66.2 శాతం మంది పని సమయంలో అరుదుగా లేదా అసలు విరామం తీసుకోలేకపోతున్నారు. ఈ గణాంకాలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడతాయి. ఒక నగరం తనకు సేవలందించే కార్మికుడికి తాగునీరు, టాయిలెట్, కొన్ని నిమిషాల విశ్రాంతి కూడా ఇవ్వలేకపోతే ఆ నగర అభివృద్ధిని ఏ ప్రమాణంతో కొలవాలి? వాతావరణ మార్పు ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. మండుతున్న ఎండలో, ఉక్కపోతలో, భారీ వర్షంలో కూడా డెలివరీ కార్మికుడు రోడ్డుపైనే ఉండాలి. ఇతర రంగాల్లోని ఉద్యోగులకు కార్యాలయ రక్షణ లేదా పని విధానాల్లో మార్పులు సాధ్యమవుతాయి. గిగ్ కార్మికుడికి మాత్రం వాతావరణం అనుకూలించకపోయినా పని ఆపితే ఆదాయం ఆగిపోతుంది. వేడి కారణంగా డీహైడ్రేషన్, అధిక ఉష్ణోగ్రత ప్రభావం, చర్మ సమస్యలు వంటి ఆరోగ్య ఇబ్బందులు ఎదురవుతున్నా వాటిని వ్యక్తిగత సమస్యలుగా చూడటం ప్రమాదకరం. ఇది వృత్తిపరమైన భద్రతకు సంబంధించిన అంశం. రోడ్డు ప్రమాదాల గణాంకాలు కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. 66.4 శాతం మంది ద్విచక్ర వాహనాలను పని కోసం ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. 62.2 శాతం మంది ఏదో ఒక రకమైన ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. సుమారు 38 శాతం మంది రహదారి పరిస్థితుల వల్ల గాయపడ్డారు. 27 శాతం మంది ట్రాఫిక్ సంబంధిత ప్రమాదాలను ఎదుర్కొన్నారు. సమయానికి ఆర్డర్ ఇవ్వాలనే ఒత్తిడి, ట్రాఫిక్ రద్దీ, రహదారుల దుస్థితి, రోడ్డు భద్రతా నిబంధనల బలహీన అమలు కలిస్తే ప్రమాదం వ్యక్తిగత తప్పిదంగా మిగలదు. అది వ్యవస్థ వైఫల్యంగా మారుతుంది. ఇక, 59 శాతం మంది కార్మికులకు ఎలాంటి భద్రతా శిక్షణ అందలేదు. బీమా పరిస్థితి మరింత దారుణం. 62 శాతానికి పైగా కార్మికులకు ఆరోగ్య బీమా లేదు. 44.2 శాతం మందికి ప్రమాద బీమా లేదు. ప్రమాదంలో గాయపడిన కార్మికుడు ఆసుపత్రి ఖర్చును భరించలేకపోతే, అతని 'స్వతంత్ర ఉపాధి' ఎంతటి భరోసాను ఇస్తుంది? చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడాల్సి వస్తోందని పలువురు కార్మికులు చెప్పడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. గిగ్ వర్కర్ల విధానాన్ని 'కొత్త తరహా ఉపాధి'గా ప్రభుత్వాలు ముద్రవేసి, ఘనంగా ప్రకటించుకోవడం సిగ్గుచేటు. గిగ్ కార్మికులకు స్పష్టమైన చట్టపరమైన గుర్తింపు, కనీస భద్రతా ప్రమాణాలు, ఆరోగ్య, ప్రమాద బీమా, భద్రతా శిక్షణ, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ, పని సమయంలో విశ్రాంతి, తాగునీరు, పారిశుధ్యం వంటి హక్కులను నిర్ధారించాలి. తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో పని గంటలు, డెలివరీ సమయాలపై మానవీయ నిబంధనలు తీసుకురావాలి. ప్రజా స్థలాలను కూడా పని ప్రదేశాలుగా గుర్తించి పట్టణ ప్రణాళికలో గిగ్ కార్మికుల అవసరాలను చేర్చాలి. గిగ్ వర్కర్లకు పనులను పురమాయించే వివిధ ప్లాట్‌ఫామ్ సంస్థలపైన కూడా కీలక బాధ్యత ఉంది. 'టెక్నాలజీ కంపెనీలు' ముద్ర వేసుకొని, శ్రమ బాధ్యత నుంచి తప్పించుకోవడం దుర్మార్గం. కార్మికుడి పనితీరును ఒక సంస్థ అల్గారిథమ్‌తో కొలుస్తున్నప్పుడు, ఆ అల్గారిథమ్ సృష్టించే ఒత్తిళ్లకు కూడా సదరు సంస్థే బాధ్యత వహించాలి. వేగం కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రమాదం జరిగినప్పుడు కార్మికుడిని ఒంటరిగా వదిలేయకూడదు. ఈ మొత్తం అధ్యాయంలో వినియోగదారుడి పాత్రను కూడా విస్మరించలేం. కొన్ని నిమిషాల్లో డెలివరీ రావాలని కోరుకోవడం సులభం. కానీ ఆ కొన్ని నిమిషాల వెనుక ఒక మనిషి మండే ఎండలో, ప్రమాదకరమైన రహదారిపై ప్రయాణిస్తున్నాడనే విషయం గుర్తుండాలి. ఆలస్యానికి దురుసుగా స్పందించడం, తక్కువ రేటింగ్ ఇవ్వడం, ప్రమాదకర పరిస్థితుల్లో కూడా సమయపాలన కోరడం వంటి ప్రవర్తనలు కార్మికుడిపై ఒత్తిడిని పెంచుతాయి. ఇక్కడ, గిగ్ ఆర్థిక వ్యవస్థను అడ్డుకోవడం పరిష్కారం కాదు. సాంకేతికతను వెనక్కి తిప్పడం కూడా సాధ్యం కాదు. కావాల్సిందల్లా బాధ్యతాయుతమైన ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థ మాత్రమే. వినియోగదారుడికి సౌకర్యం పెరిగే కొద్దీ కార్మికుడికి భద్రత పెరగాలి. యాప్ వేగంగా పనిచేసే కొద్దీ కార్మిక హక్కుల అమలు కూడా వేగంగా జరగాలి. గిగ్ కార్మికుడికి దానం అవసరం లేదు. హక్కులు కావాలి. సానుభూతి మాత్రమే కాదు, చట్టపరమైన రక్షణ కావాలి. స్మార్ట్ నగరాలు నిర్మించడం ఎంత ముఖ్యమో, ఆ నగరాలను నడిపించే కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించడం కూడా అంతే ముఖ్యం. ●



## మా పథకాలు ట్రంప్ కాపీ

**కర్నాటకలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందాయి. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు. నవంబర్‌లో జరిగే మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు ప్రతినిధుల సభ, సెనెట్‌పై ఆధిపత్యాన్ని కొనసాగిస్తే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' అందిస్తామని ట్రంప్ ప్రతిపాదించారు.**

– ముఖ్యమంత్రి డికె శివకుమార్




## శీతల భూగోళం దిశగా మానవాళి అడుగులు

జీవకోటి ఆరోగ్యకర మనుగడకు అనువైన వాతావరణం భూగ్రహంపైన మాత్రమే ఉన్నది. సూర్యరశ్మి లేకుండా జీవి మనుగడ సాగించలేదు. భూమాత గృహంలో సకల ప్రాణికోటి మనుగడకు సంబంధించిన ఉష్ణోగ్రతలు, వాతావరణం, పరిశుద్ధ గాలి, స్వచ్ఛమైన నీరు, పవిత్రమైన మట్టి అందుబాటులో ఉన్నాయి. ప్రాణులకు హాని కలిగించే అంశాలకు ప్రకృతి మాత్రమే అడ్డుకట్ట వేస్తున్నది. సూర్యుడి నుంచి భూమిపైకి చేరుతున్న సూర్యరశ్మిలో అతి ప్రమాదకర అతినీలలోహిత లేదా అల్ట్రావాయిలెట్ (యూవీ) కిరణాలు కూడా ఉంటాయి. ఈ కిరణాలు నేలపైకి చేరితే జీవకోటి ఉనికికి అతి ప్రమాదకరంగా మారుతుంది. ఇలాంటి అత్యంత ప్రమాదరమైన, హానికారక యువి కిరణాలను నేలపైకి రాకుండా 10–30 కిమీ దూరంలోని స్ట్రాటోస్పియర్‌లో ఓజోన్ అనబడే పొర అడ్డుకొని, శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మి నేలపైకి చేరడానికి దోహదపడుతుంది. ఇలాంటి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఓజోన్ పొర జీవులకు ఒక రక్షణ గొడుగుగా పనిచేస్తున్నది.

**ఓజోన్ పొర ప్రాధాన్యం:** రసాయనపరంగా త్రిపరమాణుక ఆక్సీజన్ అణువు ($O_3$)ని ఓజోన్ అని పిలుస్తాం. ఈ అణువు యువి కిరణాలను శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మిని భూమిపైకి చేర్చుతుంది. ఓజోన్ పొర పలుచడినపుడు లేదా పొరకు రంధ్రాలు ఏర్పడినపుడు సూర్యరశ్మితో పాటు యువి కిరణాలు నేలపైకి చేరి మానవాళికి, జంతువులకు, వృక్ష సంపదకు హానిని కలిగిస్తాయి. ఓజోన్ పొర తరుగుదలను అడ్డుకోవడానికి స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు నిర్దిష్ట చర్యలు తీసుకోవడం నిరంతరం జరగాలి. రేపటి తరానికి ఆరోగ్యంగా జీవించడానికి అనువైన వాతావరణాలను బహూకరించడానికి కృషి చేద్దాం. నేటి యువతలో ఓజోన్ పరిరక్షణ అవగాహన పెంచుదాం.

*(16 సెప్టెంబర్ ప్రపంచ ఓజోన్ దినం సందర్భంగా)*

# లేదు.. లేదంటూనే యుపిఐపై రుసుము!

సామాన్యుడు భయపడాల్సింది ఏమీ లేదని, డిజిటల్ చెల్లింపులపై రుసుము ఆలోచన వారిపై ఎలాంటి ప్రభావం చూపదని చెప్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం, 'వినాయక చవితి' పర్వదినాన (సెప్టెంబర్ 14)న వెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం ఆశ్చర్యకర పరిణామం. పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007లోని సవరించిన 'సెక్షన్ 10 ఎ' కింద ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో రూ.2,000 వరకు యుపిఐ లావాదేవీలకు, రుపే డెబిట్ కార్డు చెల్లింపులకు బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ ఎలాంటి రుసుము వసూలు చేయరాదని పేర్కొన్నారు. అయితే, అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతోంది. ఇంత కాలం యుపిఐ లావాదేవీలపై మొత్తంతో సంబంధం లేకుండా ఎలాంటి రుసుము లేకపోతే, ఇప్పుడు చట్టపరమైన రక్షణను రూ.2,000 వరకు మాత్ర మే ఎందుకు పరిమితం చేశారు? రూ.2,000 దాటిన లావాదేవీల విషయంలో భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించే అవకాశం ఉందా? ఉంటే ఎంత? ఎవరిపై? ఏ లావాదేవీలకు? వినియోగదారుడిపై ప్రత్యక్ష ప్రభావం ఉండదని ప్రభుత్వం చెబుతున్నప్పుడు, వ్యాపారి చెల్లించే రుసుము చివరికి వస్తువు ధరలో కలిసిపోయే అవకాశాన్ని ఎలా నిరోధిస్తా రు? ఇవే ప్రజల ముందున్న వాస్తవ ప్రశ్నలు. ప్రస్తుతం రూ.2,000కు మించిన యుపిఐ చెల్లింపులపై ఎలాంటి ఎండిఆర్ అమలులోకి రాలేదు. ప్రభుత్వం కూడా రేటును ఇంకా నిర్ణయించలేదని చెబుతోంది. యుపిఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకునే ప్రక్రియ ఉంటుంది. కాబట్టి ఇప్పటి నుంచే యుపిఐకి రుసుము మొదలైంది అని చెప్పడం వాస్తవానికి మించి వెళ్లడం అవుతుంది. అదే సమయంలో యుపిఐ ఎప్పటికీ పూర్తిగా ఉచితంగానే ఉంటుంది అని చెప్పడానికి కూడా తాజా చట్టపరమైన మార్పు తర్వాత ఆధారం లేదు. ఈ రెండింటి మధ్య ఉన్న ఖాళీనే ఇప్పుడు ప్రభుత్వం స్పష్టంగా పూరించాలి. ఇదే అంశంపై కాంగ్రెస్ నాయకత్వం చేసిన విమర్శ రాజకీయ వాదనను ముందుకు తెచ్చింది. జైరాం రమేశ్ ప్రశ్నించినట్టు, రూ.2,000 వరకు మాత్రమే చార్జీల నుంచి చట్టపరమైన రక్షణ కల్పించడం భవిష్యత్తులో పెద్ద లావాదేవీలపై రుసుము విధించడానికి తలుపు తెరిచినట్టేనా అన్న సందేహం సహజమే. అమెరికన్ కంపెనీలకు మార్కెట్ తెరవడానికి, అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌ను సంతృప్తిపరచడానికి ఈ మార్పు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. యుపిఐని నిర్వహించడం ఉచితం కాదన్నది నిజం. లావాదేవీల పరిమాణం విపరీతంగా పెరిగినకొద్దీ సర్వర్లు, డేటా సెంటర్లు, సైబర్ భద్రత, మోసాల నివారణ, వ్యవస్థ నిర్వహణ, సాంకేతిక నవీకరణలపై ఖర్చు పెరుగుతుందనేది కూడా నిజమే. జులై 2026లోనే యుపిఐ 23.6 బిలియన్ లావాదేవీలను, సుమారు రూ.29.9 లక్షల కోట్ల విలువను నిర్వహించింది. ఇంత భారీ మౌలిక వ్యవస్థను నిరంతరం నిర్వహించడానికి స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని చెల్లింపు పరిశ్రమ చాలా కాలంగా చెబుతోంది. అయితే ఖర్చు ఉందనే వాదనతోనే రుసుము విధానానికి సమర్థన కూడదు. యుపిఐ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి దాని సరళత, చౌకదనం. చిన్న వ్యాపారి నుంచి సాధారణ ఉద్యోగి వరకు అందరికీ ఒకే డిజిటల్ మౌలిక సదుపాయాన్ని అందించడం దాని బలం. అందులో రుసుము ప్రవేశిస్తే, అది ఎంత చిన్నదైనా, ఆ వ్యవస్థపై ప్రజల మానసిక నమ్మకాన్ని ప్రభావితం చేయవచ్చు. ప్రత్యేకించి నగదు నుంచి డిజిటల్ చెల్లింపుల వైపు ప్రజలను మళ్లించినప్పుడు డిజిటల్ చెల్లింపు ఉచితం అనే భావన కూడా ఒక విధాన ప్రోత్సాహకంగా పని చేసింది. ఇక్కడ ప్రభుత్వం చెప్పే మరో అంశాన్ని కూడా విస్మరించలేం. ప్రస్తుతం యుపిఐ వ్యవస్థకు ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ఆర్థిక మద్దతులు అవసరమవుతున్నాయి. లావాదేవీలు పెరి గే కొద్దీ ప్రతి లావాదేవీపై ప్రభుత్వమే వ్యయం భరించడం దీర్ఘకాలంలో ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న ఉంది. మరిన్ని కంపెనీలు ఈ రంగంలోకి రావాలంటే వాటికి స్థిరమైన వ్యాపార నమూనా అవసరం. సైబర్ భద్రతపై పెట్టుబడులు పెంచాలి. మోసాల నియంత్రణకు ఆధునిక సాంకేతికత అవసరం. ఇవన్నీ వాస్తవ సమస్యలే. కానీ అదే సమయంలో, మరో ప్రమాదం కూడా ఉంది. ప్రభుత్వం వ్యాపారులపై ఎండిఆర్ విధించినా, వ్యాపారి ఆ వ్యయాన్ని వినియోగదారుడిపై మళ్లించే అవకాశం పూర్తిగా లేకపోలేదు. చట్టపరంగా చార్జీ వినియోగదారుడిపై కాదు అని చెప్పడం ఒక విషయం; వస్తువు లేదా సేవ ధరలో ఆ వ్యయం ప్రతిబింబించకుండా చూడటం మరో విషయం. ఒక రెస్టారెంట్, ఆసుపత్రి, ఆన్‌లైన్ సేవ, పెద్ద రిటైల్ సంస్థ లేదా ఇతర వ్యాపారి తన మొత్తం చెల్లింపు వ్యయాన్ని ధరల నిర్మాణంలో కలిపితే, వినియోగదారుడు పరోక్షంగా భారం మోయాల్సి వస్తుంది. అందుకే ఎండిఆర్ రూపకల్పనలో రేటు కంటే పారదర్శకత, పోటీ, వినియోగదారుడి రక్షణ ముఖ్యమైనవి. ఇంకో ముఖ్యమైన అంశం చిన్న వ్యాపారులది. యుపిఐని అత్యంత వేగంగా స్వీకరించిన వర్గాల్లో చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారు లు, స్వయం ఉపాధి పొందేవారు ఉన్నారు. వారికి ప్రతి లావాదేవీపై అదనపు ఖర్చు కూడా గణనీయమే. పెద్ద సంస్థలకు అది ఖర్చులలో ఒక చిన్న భాగం కావచ్చు. చిన్న వ్యాపారికి మాత్రం అది లాభంలో నేరుగా కోత కావచ్చు. అందుకే రూ.2,000 పరిమితి కేవలం వినియోగదారుడిని రక్షించే గీత కాదు. చిన్న వ్యాపార వ్యవస్థను కాపాడే విధాన పరికరంగా కూడా చూడాలి. వినియోగదారుల నుంచి నేరుగా యుపిఐ చార్జీ వసూలు చేయడం లక్ష్యం కాదని, భవిష్యత్తులో ఎండిఆర్ ఉంటే అది వ్యాపారులపై వర్తిస్తుందని స్పష్టం చేయడం ఇప్పటివరకు ప్రభుత్వం చెప్పిన అత్యంత ముఖ్యమైన విషయం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఎండిఆర్ వినియోగదారులపై కాకుండా వ్యాపారులపై వర్తిస్తుందని, బ్యాంకులు, ఫిన్టెక్ సంస్థలు మౌలిక సదుపాయాలు, భద్రత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టడానికి అది తోడ్పడుతుందని పేర్కొన్నారు. పార్లమెంటులోనూ యుపిఐపై వినియోగదారుల నుంచి పన్ను లేదా ప్రత్యక్ష చార్జీ విధించే ఉద్దేశం లేదని ప్రభుత్వం వివరించింది. అయితే మాటలకంటే చట్టంలోని స్పష్టతే ప్రజలకు ముఖ్యం. నిన్నటి వరకు చార్జీ రక్షణ విస్తృతంగా ఉండి, ఇప్పుడు రూ.2,000 వరకు మాత్రమే స్పష్టంగా పేర్కొంటే, సహజంగానే అనుమానం కలుగుతుంది. ప్రభు త్వం ఆ అనుమానాన్ని రాజకీయ ప్రతివాదంతో కాదు, స్పష్టమైన విధాన పత్రంతో తొలగించాలి. రూ.2,000 పరిమితి ఎందుకు ఎంచుకున్నారో చెప్పాలి. పెద్ద లావాదేవీలకు ఎండిఆర్ ఉంటే దాని గరిష్ఠ పరిమితి ఏమిటో వెల్లడించాలి. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే లావాదేవీలపై ఎలాంటి రుసుము ఉండదని స్పష్టమైన నిబంధన ఇవ్వాలి. వ్యాపారులు వినియోగదారుల నుంచి ఆ రుసుము ను ప్రత్యేకంగా వసూలు చేయకుండా ఏ రక్షణలు ఉంటాయో వివరించాలి.

యుపిఐ భారతదేశపు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు చెందిన ప్రజా మౌలిక సదుపాయంగా మారింది. దాని యాజమాన్యం, నిర్వహణ, సాంకేతిక భాగస్వామ్యం గురించి చర్చలు ఉండవచ్చు. విదేశీ సంస్థలు ఈ వ్యవస్థలో పనిచేయవచ్చు. దేశీయ ఫిన్టెక్ సంస్థలు పోటీ పడవచ్చు. కానీ అంతిమంగా వ్యవస్థ ప్రజలకు ఎంత అందుబాటులో ఉంది, ఎంత సురక్షితంగా ఉంది, ఎంత పారదర్శకంగా ఉంది అన్నదే దాని విజయానికి కొలమానం. ప్రభుత్వం కూడా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. యుపిఐని ప్రపంచానికి భారత డిజిటల్ విజయగాథగా చూపించినప్పుడు, దాని ఉచితాన్ని కూడా ఆ విజయగాథలో భాగంగానే చూపించింది. ఇప్పుడు ఆ నమూనాలో మార్పు చేయాలనుకుంటే, ప్రజలకు ముందుగానే పూర్తి వివరాలు చెప్పాలి. పార్లమెంటులో చట్టం ఆమోదం పొందడం మాత్రమే ప్రజా విశ్వాసానికి సరిపోదు. చట్టం తర్వాత వచ్చే ప్రతి నోటిఫికేషన్ కూడా అదే స్థాయి పారదర్శకతను కలిగి ఉండాలి. ప్రతిపక్షం కూడా ఈ అంశాన్ని భయాందోళనల రాజకీయంగా కాకుండా విధాన చర్చగా నడిపితేనే ప్రజలకు ప్రయోజనం. రేపు అందరిపై చార్జీ పడొచ్చు అనే సందేహం లేవనెత్తడం సమంజసమే. కానీ అది వాస్తవం కావాలంటే ఆధారం కావాలి. అదే సమయంలో ప్రభుత్వం వినియోగదారుడిపై ఎలాంటి భారం లేదు అని చెప్పడమే కాకుండా, ఆ హామీకి చట్టపరమైన, నియంత్రణపరమైన భరోసా ఇవ్వాలి. యుపిఐకి ఇప్పుడు ఎదురవుతున్న అసలు సవాలు ఉచితం వర్సెస్ రుసుము అనే సరళమైన ద్వంద్వం కాదు. ప్రజలకు అందుబాటులో ఉండే, వ్యాపారులకు భరించగలిగే, బ్యాంకులు ఫిన్టెక్ సంస్థలకు పెట్టుబడి పెట్టేంత ఆదాయాన్ని అందించే, అంతర్జాతీయ స్థాయిలో సురక్షితంగా ఉండే చెల్లింపు వ్యవస్థను ఎలా నిర్మించాలన్నదే అసలు ప్రశ్న. ఆ సమతుల్యత సాధించడంలో విఫలమైతే ఉచిత యుపిఐ కూడా నిలవదు; నియంత్రణలేని రుసుములు ప్రవేశిస్తే దాని ప్రజాదరణ కూడా దెబ్బతింటుంది. అందువల్ల సెప్టెంబరు 14వ తేదీ నాటి నోటిఫికేషన్‌ను తుది నిర్ణయంగా కాకుండా ఒక కొత్త దశకు ఆరంభంగా చూడాలి. ఈ దశలో అత్యవసరమైనది రాజకీయ ఆరోపణ కాదు, విధాన స్పష్టత. యుపిఐని నిర్మించడానికి ప్రజలు తమ అలవాట్లు మార్చుకున్నారు. ఇప్పుడు ఆ వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించే వారు కూడా ప్రజల నమ్మకాన్ని కేంద్రంగా ఉంచాలి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు నిలకడ అవసరమే. కానీ ఆ నిలకడకు తొలి పెట్టుబడి ప్రజల విశ్వాసమే. దానిపై ఎలాంటి రుసుము విధించకూడదు.

**కె.శ్రీనివాస్**




# దారి తప్పుతున్న కలాలు, శృతి తప్పుతున్న దళాలు

తెలంగాణ జన జీవితంలో పాట అంతర్భాగమైంది. కష్టమొచ్చినా, సంతోషమొచ్చినా, పండగైనా, పబ్బమైనా, పుట్టుకైనా, చావైనా పాట ఉండాల్సిందే. ప్రజల జీవన విధానం, ఆలోచనలు, ఆచారాలకు అనుగుణంగా కవులు అనేక పాటలు జనంలోకి తీసుకు వచ్చారు. గాయకులు పాటలను మధురంగా అలపిస్తూ ప్రజలకు చేరువ చేసేవారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ఇటీవల తెలంగాణ సాధన వరకు తెలంగాణ ప్రజలను పాట తట్టి లేపింది. ఆలోచింపజేసింది. రౌద్రం నింపింది. ముందుకు నడిపించింది. దశాబ్దకాలంగా తెలంగాణ కవుల కలాలు దారి తప్పుతున్నాయి. లేని గొప్పతనాన్ని కొందరికీ అపాదించడానికి, జరగని విషయాలను జరిగినట్లు, ఉన్నట్లుగా భ్రమింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జన సమస్యలు, ఆచర వ్యవహారాల నడుమ మధ్య పుట్టిన తెలంగాణ పాట ఇప్పుడు ఆర్థిక అవసరాలను నెరవేర్చుకునేందుకు ప్రజలను వంచించే పనిలో పడ్డది. గళాలు చైతన్యాన్ని రగిల్చిన గొంతులు ఇప్పుడు రాజకీయ నేతల సేవలో తృప్తి పొందుతున్నాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పిలుపు ముందు తెలంగాణ సమాజ పరిస్థితి దయనీయంగా ఉండేది. బడుగు, బలహీన వర్గాల జీవితాలను శాసించే రోజుల్లో దేవునికి దండం పెట్టుకోవాలన్నా భయపడే పరిస్థితి నుంచి ప్రశ్నించే స్థాయికి ఎదగడంలో తెలంగాణ కవులు, గాయకుల కృషి దాగి ఉంది. తెలంగాణ సాహిత్యం అనేక ప్రజా ఉద్యమాలకు పురుడుపోసి నడిపించింది. వందల పాటలు సందర్భానుసారంగా పుట్టుకొచ్చాయి. స్థానిక పరిస్థితులను బట్టి ఎక్కడికక్కడ పాటలు కైకొట్టి పాడారు. చదువురాని బండి యాదగిరి అలపించిన

బండెనుక బండి కట్టి
పదహారు బండ్లు కట్టి
ఏ బండ్లో వస్తావ్ కొడకో
నైజాం సర్కారోడా
నాజీలను మించినవురో అంటూ సాగిన పాట

తెలంగాణ ప్రజలకు గొప్ప ధైర్యాన్ని ఇచ్చింది.

చిన్న చిన్న పోరగాళ్లు
సీతయ్య జీతగాళ్లు
గొడ్లళ్లు నూరినారు,
భుజాన పెట్టినారు

అంటూ భూస్వామి సీతారామిరెడ్డికి వ్యతిరేకంగా పుట్టిన గేయం. అనేకమంది సామాన్యులను సాయుధులను చేసింది. సొంత కరెన్సీ, రైల్వేలు, రవాణా వ్యవస్థ , లక్షలాది ఎకరాలు, ప్రపంచంలో బలవంతుడైన రాజుగా పేరొందిన నిజాంకు వ్యతిరేకంగా 'ముసలి నక్కకు రాచరికం దక్కునే' అంటూ దశరథి గర్జించాడు.

ఒక్క రోజు కూడా
ఒక్క నిమిషం సేపు,
దుక్కి దున్నని నీకు
దిక్కు తెలియని భూములెక్కడివి

అంటూ సుద్దాల హన్మంతు ప్రశ్నించాడు. అనేక మంది కవు లు నిజాం నవాబుకు వ్యతిరేకంగా గొప్ప సాహిత్యాన్ని ప్రజలకు అందించారు. మలిదశలో తెలంగాణ ఉద్యమంలో అంతకు తెలంగాణ కవులు గొప్ప విప్లవ సాహిత్యాన్ని తీసుకువచ్చి ప్రజలకు అందించారు. అనేక పాటలు ప్రజల నాలుకలపై నిలిచిపోయాయి. చెరబండ రాజు పాటలు పదును కత్తులై మెరిశాయి. గద్దర్, గూడ అంజయ్య, జయరాజు, అందెశ్రీతో పాటు అనేక మంది తెలంగాణ కవుల పాటలు గతాన్ని తెలియజేస్తూ వర్తమానాన్ని చూపుతూ భవిష్యత్తును ఆవిష్కరింపజేశాడు.

తాడేసి, తనుకేసి
పట్టణంలో కొడుకును
పై చదువు చదివిస్తే
కొలువులు దొరకకపోయేరా
కొడుకు బరువైపోయేరా

అంటూ భవిష్యత్తు నిరుద్యోగ సమస్యను 1980 దశకంలోనే గూడ అంజయ్య ఆవిష్కరింపజేశారు. ఇప్పుడు ప్రశ్నిస్తే వచ్చే నిర్బంధాలను తెలంగాణ కవులే దశాబ్దాల క్రితమే పాటల రూపంలో ప్రజల ముందు ఉంచారు. మలిదశ తెలంగాణ పోరాటం లో వందలాది పాటలు ప్రజల మదిలో గూడుకట్టుకున్నాయి. ప్రకృతిని, ప్రజలను సమాంతరంగా చూపుతూ తెలంగాణ పాటలు ఎక్కువగా వచ్చాయి. తెలంగాణ పాట కీర్తించింది, ప్రశ్నించింది.

రాతి బొమ్మలలోనా / కొలువైన శివుడా
రక్తబంధం విలువ
నీకు తెలియదురా
తెలిసి ఉంటే చెట్టంత నా
కొడుకును తెచ్చివ్వగలవాని మహిమలు

అంటూ మిట్టపల్లి సురేందర్ రాసిన పాట తెలంగాణ అంతట మారుమ్రోగింది.

ఇప్పుడు ఏమైంది తెలంగాణ పాటకు బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ తెలంగాణ కళాకారులను, కవులను వేతనాలు ఇచ్చి బందీలుగా చేశాడు. అప్పుడే దారితప్పిన కలలు మండు వేసవిలో మత్తడి తొక్కిన చెరువులంటూ అసంబద్ధ గీతాలను రచిస్తే, అరువు గళాలు అలపించాయి. ఏ పాట తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచిం దో, ఏ పాట తెలంగాణ రాష్ట్ర సాధనకు దోహదపడిందో ఆ పాటను తనకు అనుకూలంగా మార్చుకోవాలని అనుకున్నప్పుడు

దొర కోసమే పాడాలి
దొర గురించి పాడాలా అంటూ
కొన్ని గొంతులు వినిపించాయి. కానీ తర్వాత

ఏ పాట రాజ్యాధికారానికి దగ్గర చేసేందుకు దోహదపడిందో ఆ పాటను తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నం చేశాయి రాజకీయ పార్టీలు. ఆర్థిక ఇబ్బందుల్లో కవులు, కళాకారులకు డబ్బును ఎరగా చూపాయి.

బాల రసాల సాల
నవ పల్లవ కోమల కావ్య కన్యకన్
ఊడల కిచ్చి అప్పుడగు
కూడు భుజించటం కన్నా సత్ కవులు,
హరికులు అయితేనేమి ...

అంటూ చెప్పడానికి ఇప్పటి కవులు, కళాకారులు బమ్మెర పోతనలు కాదు. కాబట్టి ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రశ్నించే పాట జన జీవితాలను, వారి సమస్యలను, అవసరాలను ఆవిష్కరించిన పాట ఇప్పుడు శృతించడం మొదలుపెట్టింది. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను, మతోన్మాదాన్ని చూస్తూ గడిపేస్తుంది. గొంతుకలు శృతించడానికి తప్ప మరెందుకు పనికిరాని పరిస్థితికి దిగజారాయి. పాట పుట్టిన నాటి నుండి నేటి వరకు ప్రజల పక్షాన నిలిచిన పాట అందుకు కారకులైన వారు చిరస్మరణీయులు. వారి మధ్య లేకపోవచ్చు కానీ పాట సజీవం. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల వేళ ప్రజల పక్షాన నిలిచిన కలాలకు, గళాలకు ఉద్యమాభివందనాలు. దారి తప్పిన కలాలు, గళాలు ప్రజలకోసం నిలవాలని ఆకాంక్షిద్దాం.

**ఏవిఆర్**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా



## ఉపరాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈనెల 17న హైదరాబాద్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పర్యటనకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న విమోచన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, వైద్య సేవలు, రహదారులు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈనెల 17న ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిఎస్ సంజయ్ జాజు సంబంధిత శాఖల కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర సాంస్కృతిక శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.సమావేశంలో జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డిజిపి సి.వి. ఆనంద్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ విమోచన దినోత్సవ' ఉత్సవాలు కేంద్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది

కేంద్ర బొగ్గగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ప్రభుత్వాలు ముందుకు రాకపోవడంతోనే కేంద్ర ప్రభుత్వమే 'తెలంగాణ విమోచన దినోత్సవ' ఉత్సవాలను నిరంతరాయంగా నిర్వహిస్తోందని కేంద్ర బొగ్గగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల్లో కేంద్ర సాయుధ దళాల విన్యాసాలు, ప్రత్యేకంగా వేలాది మంది తెలంగాణ కళాకారులతో కూడిన ఆకర్షణీయమైన నాట్య ప్రదర్శనలు, సంప్రదాయ డప్పుల విన్యాసాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హాజరుకానున్నట్టు తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ ఏర్పాట్లను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కేంద్ర సాయుధ బలగాల కవాతు (పరేడ్) రిహార్సల్స్, సాంస్కృతిక ప్రదర్శనల సన్నాహాలను ఆయన వీక్షించారు. అనంతరం భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, విఐపి ప్రొటోకాల్ తదితర అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇది ఏ ఒక్కరికో సంబంధించిన కార్యక్రమం కాదని, ఆనాడు నిజాం పెట్టిన బాధలను భరించి, తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులను స్మరించుకోవడం కోసమే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 'హైదరాబాద్ ముక్తి దివస్'ను ప్రారంభించిందన్నారు. గతంలో బిఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి భయపడి ఉత్సవాలను నిర్వహిచండం లేదని ఆరోపించారు.

## '22ఎ'పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టండి : మాధవరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రం '22ఎ' అంశంపెన సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిఆర్‌ఎస్ ఎమ్మె ల్యే మాదవరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి విప్ కె.పి.వివేకానందతో కలిసి మాదవరావు మాట్లాడుతూ తనపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి, అసెంబ్లీ సమావేశాలకు అనుమతినిస్తే 22ఎకు సంబంధించిన ఆధారాలతో మాట్లాడుతానని, తాను చెప్పేవి అబ్బద్ధాలైతే, తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని స్ప ష్టం చేశారు. కె.పి. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ 'క్యూర్' బిల్లుపై ఒక్కరోజే చర్చ, బిల్లు ఆమోదం జరిగిందని, 465పేజీలతో కూడిన 'క్యూర్ బిల్లు'పైన కేవలం అర గంటలో చదివి చర్చించడం సాధ్యమా అని ప్రశ్నించారు. 1955 మున్సిపల్ చట్టాన్ని సవరించి, కొత్త బిల్లును ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తాము మొదటి నుంచి చెబుతున్నామని తెలిపారు.







## 'నేడు' తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల ఛాయాచిత్ర ప్రదర్శన

### ముస్తాబైన సిపిఐ రాష్ట్ర కార్యాలయం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల్లో భాగంగా ఈ నేలపై విప్లవాగ్నిని రగిలించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల ఘట్టాలతో పాటు వీరయోధుల పోరాట చరిత్రతో కూడిన చాయ చిత్ర ప్రదర్శనకు సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ముస్తాబైంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన కమ్యూనిస్టు యోధులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌తోపాటు కమ్యూనిస్టు దిగ్గజం చండ్ర రాజేశ్వరరావు, సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, బొమ్మగాని ధర్మబిక్షం, రాజ్ బహదూర్ గౌర్, షేక్ బందగీ, కె.ఎల్. మహేంద్ర, సుద్దాల హనుమంత్, నల్ల నరసింహులు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, చాకలి ఐలమ్మతో అమరవీరుల పోరాట చాయాచిత్రాలతో ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో ఏలాంటి సంబంధం లేని బిజెపి నాయకులు విమోచనం పేరుతో ఉత్సవాలను నిర్వహించే అర్హతే లేదన్నారు. ప్రపంచ చరిత్రలోనే మహోన్నతమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందేదుకు బిజెపి పప్రయత్నం చేస్తోందని ఆ కుట్రలను సాగనీయబోమని ఆయన స్పష్టం చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీరోచిత పోరాటంలో ప్రాణాలర్పించిన యోధుల ఛాయాచిత్రాల ప్రదర్శను బుధవారం ఉదయం సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

# సాయుధ పోరాట వారోత్సవాలు అధికారికంగా నిర్వహించాలి

- గ్రామపంచాయతీలలో జాతీయ జెండాలు ఎగురవేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- అమరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్నీ అధికారికంగా నిర్వహిస్తూ అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండాలు ఎగురవేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అమరవీరుల స్ఫూర్తినింపేలా స్మృతీ వనం ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్‌లోని కూరగాయల మార్కెట్ వద్ద గల సాయుధ పోరాటంలో ఎన్‌కౌంటర్‌కు గురైన అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం రజాకార్ల ఆగడాలను ఎదిరించడానికి 1947 సెప్టెంబరు 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల అగ్రనేతలు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మకూం మొహియుద్దీన్ లు పిలుపునిచ్చారని, ఆ పిలుపునందుకొని తెలంగాణ ప్రాంతంలో నిజాంకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం జరిగిందని, ఆ పోరాట మూలంగా 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు దక్కిందని, 4,500 మంది అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, కమ్యూనిస్టుల పోరాటం మూలంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో 1948 సెప్టెంబర్ 17న విలీనం కాబడిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సాయిధ పోరాట స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని, ఆ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై పెట్టాలని, నాటి పోరాటమే లేకుంటే నేటి తెలంగాణ ప్రాంతమే లేనందున ఆ ఘట్టాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగురవేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన కరీంనగర్ నడిబొడ్డున ఉన్నటువంటి అనభేరి ప్రభాకర్ రావు విగ్రహం చుట్టూ, కోతి రాంపూర్ బైపాస్ రోడ్డులోని కరీంనగర్ మొట్టమొదటి పార్లమెంట్ సభ్యుడు బద్దం ఎల్లారెడ్డి విగ్రహం చుట్టూ సుందరీకరణ చేయాల్సిన బాధ్యత అటు ప్రభుత్వంపై ఇటు నగర పాలక సంస్థపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమళ్ళ సమ్మయ్య, బోయిని తిరుపతి,న్యాలపట్ల రాజు,జిల్లా కౌన్సిల్ సభ్యులు బండ రాజిరెడ్డి,పైడిపెల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి,బీర్ల పద్మ,ప్రజా నాట్య మండలి కళాకారులు కె.స్వామి,లక్ష్మీ నారాయణ,రాజయ్య,నాయకులు చెంచల మురళి,కాల్వ శ్రీనివాస్,మల్లయ్య,శ్రీనివాస్, రాజు, కొమురయ్య,బాపురెడ్డి,బీర్ల స్వాతి,విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలను మించిపోయిన పోలీసు శాఖ

బిఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ శాఖ కాంగ్రెస్ కార్యకర్తల కంటే మించి ఎక్కువగా పని చేస్తోందని బిఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. తన పిఆర్ఒ, పిఎపైన పోలీస్ స్టేషన్‌లో దాడికి పాల్పడింది ఎవరో తేలాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ ఇంటిమీద దాడి జరిగిందని, గుండాలు పోలీస్ స్టేషన్‌లో దాడులకు తెగబడిన వారిపైన ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని తెలిపారు. ఈ అంశంపైన తాము కోర్టును ఆశ్రయిస్తామన్నారు.


## దాడులకు పాల్పడితే.. ప్రతిదాడులు తప్పవు

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రేవంత్ రెడ్డి పాలన ప్రతిపక్షాలను వేధించడం పరాకాష్టకు చేరిందని బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి ఆరోపించారు. కెసిఆర్ కుటుంబంపై కుట్రలకు పాల్పడితే తెలంగాణ అగ్ని గుండం అవుతుందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ దాడులకు ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం స్వయంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడికి ఉసి గొల్పారని ఆరోపించారు. రాష్ట్రంలో హింసాత్మక రౌడీ పాలన సాగుతోందని, 30 వేల మంది బూత్ ఏజెంట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని , ముసుగులు వేసుకుని పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్‌న నాయకులు బాలరాజు యాదవ్ ,బొమ్మెర రామమూర్తి ,కిషన్ రావు పాల్గొన్నారు.

# ఇంజనీర్ల కృషితోనే అభివృద్ధి సాధ్యం

- దేశ నిర్మాణంలో ఇంజనీర్లదే కీలక పాత్ర..
- సాంకేతికతను ప్రజా సంక్షేమంతో మేళవించాలి: మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రహదారులు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, పట్టణాభివృద్ధి నుంచి ఆధునిక సాంకేతిక రంగాల వరకు ప్రతి అభివృద్ధి అడుగులోనూ ఇంజనీర్ల కృషి కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్ల ప్రతిభ, కృషి లేకుండా రాష్ట్రం గానీ, దేశం గానీ అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా రాష్ట్రంలోని ఇంజనీర్లందరికీ మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం గర్వించదగిన తొలి తరం ఇంజనీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆర్అండ్‌బి శాఖ ఇఎన్‌సి లింగారెడ్డి, చీఫ్ ఇంజనీర్లు బి.వి.రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, నర్సింగ్‌రావు, వనజతో పాటు పలువురు ఇంజనీర్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అసాధారణ ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టి నేటి తరానికి, ముఖ్యంగా ఇంజనీర్లకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. విశ్వేశ్వరయ్య తన జీవితాన్ని దేశ నిర్మాణానికి అంకితం చేశారని, ఆయన చూపిన మార్గంలో నేటి తరం ఇంజనీర్లు పనిచేయాలని సూచించా రు. దేశ నిర్మాణానికి ఇంజనీర్లు వెన్నెముక. ర హదారులు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, పట్టణాభివృద్ధి, ఆధునిక సాంకేతిక రంగం.. ఇలా ప్రతి రంగంలోనూ ఇంజనీర్ల పాత్ర అనివార్యం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమంతో మేళవించి ప్రజల జీ వితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలి అని మంత్రి అన్నారు.తెలంగాణలో బలమైన మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాణ్యమైన రహదారులు, ఆధునిక భవనాలు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఇంజనీర్లు అంకితభావంతో పని చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు.

## 'ఎంబిబిఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా' తొలి, రెండవ ఫేస్ సీట్లు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంబిబిఎస్ 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన 'ఎంబిబిఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా' సెకండ్ ఫేజ్ సీట్లతో పాటు మేనేజ్‌మెంట్ మొదటి ఫేస్ సీట్లను కూడా కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కెఎన్‌ఆర్‌యుహెచ్‌ఎస్) మంగళవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 19 సాయం త్రం 4 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కళాశాలల్లో చేరాలని, ఇందు కు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించింది. అలాగే మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబిబిఎస్/బిడిఎస్ సీట్ల ఫస్ట్ ఫేజ్ కేటాయింపులను కూడా యూనివర్సిటీ విడుదల చేసిం ది. ఈ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కళాశాలలో చేరాలని, అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర పత్రాలను సమర్పించి, అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. కళాశాలల వారీగా సీట్ల కేటాయిం పు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులోఉంచింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్, బిడిఎస్ అకడమిక్ సెషన్ మంగళవారం నుంచి ప్రారంభమైందని యూనివర్సిటీ తెలిపింది. విద్యార్థులు నిర్ణీత గడువులో తమ అడ్మిషన్లను పూర్తి చేసుకోవాలని సూచించింది.

# కల్తీ కల్లు దందాపై ఎక్సైజ్ ఉక్కుపాదం

- రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఆపరేషన్..
- సిద్ధిపేటలో 5 కిలోలు, సైబరాబాద్‌లో 1.931 కిలోలు పట్టివేత
- మహారాష్ట్ర, ముంబయి, గుజరాత్ నుంచి తెలంగాణకు అక్రమ సరఫరా..
- తయారీ కేంద్రాలపైనా నిఘా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈత, తాటి చెట్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీంతో కల్లుకు ఉన్న డిమాండ్‌ను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. సహజసిద్ధమైన కల్లు అందుబాటులో లేకపోవడంతో కృత్రిమంగా కల్లు తయారు చేసి మార్కెట్‌లోకి పంపేందుకు ప్రమాదకర రసాయనమైన ఆల్ప్రేజోలంను వినియోగిస్తున్న ముఠాలు రాష్ట్రంలో విస్తరిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ గుర్తించింది. దీంతో ఆల్ప్రేజోలం అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ యుద్ధ ప్రాతిపదికన నిఘా ముమ్మరం చేసింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆదేశాలతో స్టేట్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా ఎక్సైజ్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో రంగంలోకి దిగాయి. సిద్దిపేటలో టాస్క్‌ఫోర్స్ బృందం రూ.50 లక్షల విలువైన 5 కిలోల ఆల్ప్రేజోలం, కారును స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను పట్టుకుంది. సైబరాబాద్‌లో మరో ఆపరేషన్‌లో రూ.24 లక్షల విలువైన 1.931 కిలోల ఆల్ప్రేజోలం పట్టుబడింది. గత ఏడాది రాష్ట్రంలో 28.67 కిలోల ఆల్ప్రేజోలం ఎక్సైజ్ బృందాలకు చిక్కగా.. ఈ ఏడాది కూడా అక్రమ సరఫరా కొనసాగుతున్నట్లు తాజా పట్టివేతలు స్పష్టం చేస్తున్నాయి. ముంబయి, మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల నుంచి తెలంగాణకు ఈ రసాయనం తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కేవలం రవాణాదారులపైనే కాకుం డా ఆల్ప్రేజోలం తయారు చేస్తున్న ముఠాలు, సరఫరా నెట్‌వర్క్, కృత్రి మ కల్లు తయారీ కేంద్రాలపై కూడా అధికారు లు దృష్టి సారించారు. హై దరాబాద్ పరిసరాలతోపాటు ఘట్‌కేసర్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుం డా రసాయనాలను తయారు చేస్తు న్న యూ నిట్లను గుర్తించి గతంలో ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. నివాస గృహాలు, కోళ్ల ఫారాలను సైతం అక్రమ తయారీ కేంద్రాలుగా మా ర్చుకున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహబూబ్‌నగర్‌లో ఆల్ప్రేజోలం వినియోగించి తయారు చేసిన కృత్రిమ కల్లును ఎక్సైజ్ బృందా లు ధ్వంసం చేశాయి. కల్లులో కల్తీకి అడ్డుకట్ట వే యడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఆల్ప్రేజోలం ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరికి సరఫరా అవుతోంది? కృత్రిమ కల్లు తయారీ వెనుక ఉన్న అసలు ముఠా ఎవరు? అనే కోణాల్లో ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగు లు, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయం లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో సిఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని తెలంణ రక్ష ణ సేన (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పారదర్శకమైన పాలన అందించడంలో ప్రభుత్వ ఉద్యోగులదే కీలక పాత్ర అని,అందుకే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18 లోపు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే హైదరాబాద్ ను దిగ్బంధించేందుకు ఉద్యోగ సంఘాలు పిలుపునివ్వాలని కవిత కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై (టిఆర్‌ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన సదస్సులో కవిత మాట్లాడారు. ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ పని కూడా అయిపోయిందన్నారు. ఉద్యోగులకు చెందిన డిఎలు, పిఆర్‌సి,పెన్షన్లు, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను అడిగే విషయంలో ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. 2003 లో రిక్రూట్ అయిన టీచర్లకు ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, టిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్రీనివాస్, కనిష్క మహేందర్ రెడ్డి, విద్యావేత్త ధరణిరాణి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం.**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం. 08743-232428
ఆర్.సి నం. ఇ1/625/2026 — ఈ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన — తేదీ: 13.09.2026
ఈ దేవస్థానంనకు సంబంధించిన వివిధ పనులు చేయుటకుగాను రిజిష్టర్డ్ సంస్థల నుండి ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేదీ:** 16.09.2026 ఉదయం గం.11.00ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేదీ:** 22.09.2026 ఉదయం గం.11.00 వరకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేదీ:** 22.09.2026 ఉదయం గం.11.30 ని.లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.
సం/- కె. దామోదర్ రావు
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 9941-PP/CL/ADVT/2026-27, Date: 15-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.**
NIT No.21 : NIT No. 25/E.E.30/GHMC/2026-27 — తేదీ: 15.09.2026
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, కెజెడ్, డివిజన్-30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, **అంచనా విలువ:** రూ.7.10లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 15.09.2026 మ.03.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 16.09.2026 మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 9971-PP/CL/ADVT/2026-27, Date: 15-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 15/EE/ Circle-34/GZ/ GHMC/2026-27, తేదీ: 11.09.2026 | 6 పనుల కొరకు, సిసి రోడ్ల నిర్మాణం, షెడ్ ఏర్పాటు, మైదానాల నిర్వహణ మరియు వీధి దీపాల స్తంభాల ఏర్పాటు. | రూ. 100.00 లక్షలు | ప్రారంభ తేదీ: 15.09.2026 సా.4.00గం.ల నుండి / ఆఖరి తేదీ: 22.09.2026 ఉ.11.30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-34, జి.జెడ్, జిహెచ్‌ఎంసి, అబిడ్స్. ఫోన్ నెం. 7993360287 |
| మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://tender.telangana.gov.in లో చూడవచ్చు. | | | | కమిషనర్, జిహెచ్‌ఎంసి |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-34, (జిజెడ్) జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 9959-PP/CL/ADVT/2026-27, Date: 15-09-2026



## కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

### బుడ్డోనితండాలో విషాదం.... కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం బుడ్డోని తండా గ్రామంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై యువ రైతు నేనావత్ దస్రుమృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుడ్డోనితండాకు చెందిన నేనావత్ దస్రు తన వ్యవసాయ పొలంలో విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో పక్కనే ఉన్న విద్యుత్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయి అక్కడికక్కడే దస్రు మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృత దేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై చందంపేట ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన దస్రు కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను, ప్రభుత్వాన్ని స్థానిక సర్పంచ్ లాల్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. యువరైతు దస్రు మృతితో బుడ్డోని తండా గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబ రోదనలు కంటతడిని పెట్టించాయి.

## బావిలో పడి వివాహిత మృతి...



**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలం కొత్త తండా(మూలతండా) గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో వారి వ్యవసాయ భూమిలోని బావిలో పడి నాగమణి(21) మృతి చెందింది. మృతురాలు నాగమణికు 18 నెలల క్రితం టేకితం ఆంజనేయులుతో ప్రేమ వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 5లక్షల నగదు, 6 తులాల బంగారం ఇచ్చినట్లు, గత రెండు నెలలుగా నాగమణికి ఆమె భర్త ఆంజనేయులు, అత్త యాదమ్మ, మామ వెంకటయ్య, నాయనమ్మ లక్ష్మమ్మలు అదనపు కట్నం కోసం వేధించినట్లుగా, అదనంగా ఒక ఎకరం వ్యవసాయ భూమి, 15 తులాల బంగారం, ఒక ప్లాట్, రూ.5లక్షల నగదు తీసుకురావాలని ఇటీవల నాగమణిని వేధించిన విషయమై పెద్దల సమక్షంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. అనంతరం నాగమణిని భర్త ఆంజనేయులు ఇంటికి తీసుకువెళ్లగా తర్వాత నాగమణి మనస్తాపం చెందిన మంగళవారం బావిలో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె తండ్రి, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని వరకట్న వేధింపుల వల్లనే నాగమణి బావిలోకి దూకి మరణించినట్లు మృతురాలి తండ్రి అనిమోని వెంకటయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతురాలిని పోస్ట్‌మార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించగా దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్‌రావు, సిఐ బీసన్న, తహాశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌లు మార్చురిలో మృతదేహాన్ని పరిశీలించారు.

## నరేంద్రమోదీ పాలనలో సంక్షేమానికి ఆటంకం : శ్రీనివాస్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నరేంద్రమోదీ పాలనలో దేశ సంక్షేమానికి తూట్లు పడుతుందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశం గోవిందాపురంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్రానికి పూర్వమే సాధించుకున్న కార్మిక హక్కులను హరించే ప్రయత్నంలో భాగమే నరేంద్రమోదీ విధాలు ఉన్నాయని, ఆ విధానాలను వ్యతిరేకించాలని, దేశ జనాభాలో సగానికి పైగా కార్మికవర్గం ఉన్నదని, ఆ కార్మిక వర్గానికి చేయాల్సింది చేయకపోగా ఉన్న హక్కులను తీసివేస్తూ కార్పోరేట్ పెట్టుబడిదారి శక్తులకు నరేంద్రమోడి కొమ్ముకాస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని వ్యవసాయ ఉత్తత్తుల కనీస మద్దతు ధర ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరాలని ఇప్పుడు ఉన్న ప్రమాదబీమా 10 లక్షలు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు ఇందిరాల వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జెట్టి ప్రసాద్, ముడుసు పాపారావు, తాటికొండ జయరాజు, ఎల్. అనిల్, బొప్పన రాజు, బండి భాస్కర్, ఇట్టిమల్ల మట్టయ్య, రెంటాల రమేష్, మరుసకట్ల దాసు, రెంటాల నర్సింహారావు, తెలగమళ్ల మధు, తోకల ప్రభాకర్, దూళిపాళ నారి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజ మనుగడకు తోడ్పడాలి

**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** ఉపాధ్యాయులు సమాజ మనుగడకు తోడ్పడటంతో పాటు విద్యార్థుల భావి భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేయాలని గౌరవ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం అన్నారు.ఉపాధ్యాయుల సేవలు సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌టీయూటీఎస్ 80 వసంతాల వైభవోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సేవలను,విద్యారంగ అభివృద్ధికి అవి చేస్తున్న కృషిని అభినందించారు.విద్యార్థులలో విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఇండ్ల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి కల్లూరి రమేష్,రాష్ట్ర కార్యదర్శి బకనగారి జంగయ్య,ఏఐఎస్‌టీఎఫ్ కౌన్సిల్ మెంబర్ బొమ్మగాని నాగభూషణం, ఎస్‌టీయూ నాయకులు నరసింహ,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# గ్రామీణ నిరుద్యోగానికి పరిశ్రమలు,యువత అనుసంధానమే పరిష్కారం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు, ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు మధ్య బలమైన, నిరంతర అనుసంధానం ఏర్పడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్రామీణ యువతలో ప్రతిభకు కొదవ లేకపోయినా, సంఘటిత రంగంలోని ఉద్యోగావకాశాలను అందుకునేందుకు సరైన వేదిక లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ అంతరాన్ని తొలగించేందుకు ప్రభుత్వం వ్యవస్థీకృత కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. సెప్టెంబర్ 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొనే కంపెనీల ప్రతినిధులు, వందకు పైగా విద్యా సంస్థల ప్రతినిధులు, స్థానిక అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యావంతులైన యువతలో నిరుద్యోగం సమాజాన్ని వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువత పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు చదివించేందుకు తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతకు మించి ఖర్చు చేస్తున్నప్పటికి, చదువు పూర్తయిన తరువాత పిల్లలకు తగిన ఉద్యోగాలు లభించక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎంపిగా, మంత్రిగా, టిపిసిసి అధ్యక్షుడిగా తన సుదీర్ఘ ప్రజాజీవితంలో ఇటువంటి తల్లిదండ్రులను అనేక మందిని కలిశానని చెప్పారు. మునగాల వంటి గ్రామంలో చదివిన ఇంజనీరింగ్ లేదా వృత్తి విద్యా పట్టభద్రుడికి హైదరాబాద్‌లో నివసించే యువకుడితో సమానంగా ప్రముఖ కంపెనీలను సంప్రదించే అవకాశం ఉండదన్నారు. ఉద్యోగ ఖాళీల వివరాలు తెలుసుకోవడం, పేరొందిన సంస్థలను సంప్రదించడం, పదే పదే హైదరాబాద్‌కు ప్రయాణించడం, ఇంటర్వ్యూలకు హాజరుకావడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. గ్రామీణ యువత ప్రముఖ కంపెనీల వద్దకు సులభంగా చేరుకోలేకపోతే, ఆ కంపెనీలనే గ్రామీణ యువత ముంగిటకు తీసుకురావాలనేదే కోదాడ మెగా జాబ్‌మేళా ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా, ఈసారి కోదాడ జాబ్‌మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు వెల్లడించారు. జాబ్‌మేళా ద్వారా 3500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు సాధ్యమైనంత వరకు జాబ్‌మేళా ప్రాంగణంలోనే ఆఫర్ లెటర్లు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేస్తారని వెల్లడించారు. జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్, పార్కింగ్‌కు సంబంధించి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు రవాణా, వసతి, భోజన సదుపాయాల సమన్వయ బాధ్యతలను కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట ఆర్‌డిఓలకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె. నరసింహతోపాటు వివిధ శాఖల అధికారులు, విద్యాసంస్థలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలన

### దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/కోదాడ:** 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై మంగళవారం కోదాడలోని సిసిరెడ్డి కాన్వెంట్‌లో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందిగా చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అభ్యర్థులు రిజిస్టేషన్ కంపెనీల ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, తాగునీరు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున శాఖల వారిగా కేటాయించి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందేలా జాబ్‌మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బెల్టు షాపుల్లో మైనర్లకు మద్యం విక్రయించకుండా చర్యలు

### యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అవగాహన

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలు, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ జిల్లా స్థాయి కమిటీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు,మద్యం,సిగరెట్లు ఎక్కువగా వినియోగించే ప్రాంతాలను గుర్తించి కౌన్సిలర్ల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. స్వయం సహాయక సంఘాల నెలవారీ గ్రామ సమాఖ్య సంఘ సమావేశాల్లో మాదక ద్రవ్యాల అంశాన్ని చర్చించి అవగాహన కల్పించాలని,అవసరమైన ప్రచార సామగ్రిని రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ఇటీవల నల్లగొండ,నకిరేకల్,మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో డ్రగ్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని,ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన డిఅడిక్షన్ సెంటర్‌ను వెంటనే ప్రారంభించాలని, అన్ని పీహెచ్‌సీలు,ఏరియా ఆసుపత్రులు,జీజీహెచ్‌లో డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని వైద్యాధికారులను ఆదేశించారు. బెల్టు షాపుల్లో మైనర్లకు మద్యం విక్రయించకుండా చర్యలు కట్టుదిట్టం చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు,కళాశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నిరంతరం కృషి చేస్తున్నా మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతోందని, చిన్న వయస్కులు మత్తుకు బానిసవుతున్నారని, ఈ ఏడాది 130 నేర కేసుల్లో మైనర్ల ప్రమేయం ఉందని తెలిపారు. అన్ని పీహెచ్‌సీల్లో డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఏర్పాటు చేయాలని,ప్రతి జిల్లా అధికారికి రెండు మూడు సంస్థల్లో అవగాహన కల్పించే బాధ్యత అప్పగించాలని సూచించారు.సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి,డిఆర్‌ఓ దశరథ్,డీఎఫ్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

## తెలంగాణకు పట్టిన పీడ కాంగ్రెస్ దయ్యమే

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి విమర్శ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణకు పట్టిన పీడ కాంగ్రెస్ దయ్యమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. రైతులపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతూ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రేవంత్ అనే భూతం ఈ రాష్ట్రాన్ని నాశనం చేస్తుందని మండిపడ్డారు. అందుకే తెలంగాణలో నీళ్లు, అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజలు ఏమడిగినా ఎన్నో సాకుతో కాంగ్రెస్ నాయకులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కన్నెపల్లి పంపు హౌజ్ ఇవ్వాళ ప్రారంభించిన నీళ్లు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. సాగర్ ఎడుమ కాలువ ద్వారా 11వేల క్యూసెక్కుల నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉన్నా కేవలం 7వేల క్యూసెక్కులు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. రైతులు పంటలు వేసుకోవాలా వద్దా అని స్పష్టంగా చెప్పమంటే సమాధానమే లేదన్నారు. మన నీళ్ళను దోచుకుపోతుంటే కెఆర్‌ఎంబికి ఉత్తరం రాయాలన్న సోయికూడా ఈ ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు. కెసిఆర్ హయాంలో ఇంతకన్నా తక్కువ నీళ్లున్న సమయంలోనే పంటలు బ్రహ్మండంగా పండించుకున్నామని గుర్తు చేశారు. ఆనాడే వాళ్ల బాసులైనా చంద్రబాబు మెడలు వంచి తెలంగాణను సస్యశ్యామలం చేసుకున్నామని చెప్పారు. కృష్ణా, గోదావరి నీళ్లు పుష్కలంగా వచ్చినా పంటలు ఎండబెడుతుండ్రుని ఆవేదన వ్యక్తం చేశారు.

## బిఆర్ఎఒయులో చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

### మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు

### సెప్టెంబర్ 30 వరకు ప్రవేశాలు: డాక్టర్ బి. ధర్మ నాయక్



**ప్రజాపక్షం/నలగొండ :** విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను,ఉద్యోగ,స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బిఆర్ఎఒయు) ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి.ధర్మ నాయక్ తెలిపారు. మంగళవారం నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యయన కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ధర్మ నాయక్ మాట్లాడారు.2026 విద్యా సంవత్సరానికి యూజీ,పీజీ,డిప్లొమా,సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని,అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో,సొంత వేగంతో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు.విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫసర్ గంటా చక్రపాణి ఆధ్వర్యంలో మారుతున్న కాలానికి,ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.మహిళా విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించి, వారిని భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బిఆర్ఏఓయూడబ్ల్యూ ఈ హబ్ సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే టీసీఎస్,ఐకాన్,రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్, రాశి,విహబ్ వంటి సంస్థలతో ఉద్యోగ,ఉపాధి అవకాశాల కల్పనకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గుర్తుచేశారు. ప్రతి విద్యా సంవత్సరంలో నల్లగొండ జిల్లా నుంచి యూజీ, పీజీ ప్రవేశాలు అత్యధికంగా ఉంటాయని, ఈ ఏడాది కూడా అడ్మిషన్లలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ కే.శ్రీనివాసరాజు,రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ బొజ్జ,కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ భూక్యా వీరన్న, డాక్టర్ సుంకరి రాజారామ్,అధ్యయన కేంద్రం కౌన్సిలర్లు,నరేంద్ర, పద్మ, శంకర్,ఉస్మాన్ పాషా,నగేష్ బద్దం మహేష్,బద్దం శంకర్ పాల్గొన్నారు.

## దేశంలో అన్ని పోరాటాలకూ మార్గదర్శి తెలంగాణ రైతాంగ పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల ఆనాటి త్యాగాలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలల్లో భాగంగా అమరుల స్తూపాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో రైతు బిడ్డల ధైర్యం కమ్యూనిస్టు నాయకుల నాయకత్వంలో పోరాటం దేశానికి మంచి చరిత్రను ఇచ్చిందన్నారు. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా దేశంలో జరిగిన తొలి సాయుధ పోరాటంగా రైతాంగ పోరాటం నిలిచిందన్నారు. జమీందారి విధానం, బానిసత్వం, వెట్టిచాకిరి లేకుండా చేసింది కమ్యూనిస్టుల పోరాటమే అన్నారు. రజాకార్ల దురగాతలను అడ్డుకునిదున్నేవాడికే భూమిపై హక్కును కల్పించింది, అణగారిన వర్గాలకు హక్కులు కల్పించి సమానత్వం వైపు మార్గాలు వేసింది. ఆనాటి సాయుధ పోరాట యోధుల త్యాగాలతో కూడిన జీవితమేనన్న విషయం మరువరాదన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, సిపిఐ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పశ్య శ్రీనివాసరెడ్డి, కంబాల శ్రీనివాస్, నారాయణ, జడ శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరీ, దొంతగాని సత్యనారాయణ, రమేష్, చెనగాని సైదులు, జక్కుల రమేష్, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, ఉమా, సోమగాని కృష్ణ, చక్రాల స్టాలిన్ పాల్గొన్నారు.



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డి ఇటీవల అకాల మరణం చెందగా మంగళవారం వారి స్వగ్రామం పడమటిపల్లిలో సుధీర్‌రెడ్డికి జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబసభ్యులను పరామర్శించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమావత్ అంజయ్యనాయక్.

## అప్పాజీపేటలో 2 వేల ఏళ్ల నాటి టెర్రకోట డాబర్ లభ్యం



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** జిల్లాలో మరో అపురూప పురావస్తువు వెలుగు చూసింది. నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామ శివారులో 2 వేల ఏళ్ల నాటి టెర్రకోట డాబర్ లభించింది.గత పదేళ్లుగా చరిత్రపూర్వయుగం ఆనవాళ్లు, కాకతీయ ద్వికూటాలయం, శాసనం వెలుగుచూసిన అప్పాజీపేటలో మంగళవారం కొత్త తెలంగాణ చరిత్రబృందం సభ్యులు,సీనియర్ జర్నలిస్ట్ చిక్కుల యాదగిరి,మేక అశోక్ రెడ్డిలకు ఈ పురావస్తువు లభించింది. ఊరి చివర వడ్లవారిపాడులో దోమలపల్లి వెళ్లే రహదారి సమీపంలోని చెలకలో గుర్తించారు.దీనిపై కొత్త తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ వివరిస్తూ.. కుండలు చేసేటప్పుడు లోపలివైపు పెట్టుకుని పైనుంచి చెక్కబద్దతో కొట్టి కుండకు ఆకారం ఇచ్చేందుకు ఈ కాల్చిన మట్టి డాబర్‌ను ఉపయోగిస్తారని,ఇది శాతవాహనుల పూర్వకాలానికి చెందినదని తెలిపారు.ఇటువంటి టెర్రకోట డాబర్లు ఇండోర్ ఖేరాలో లభించాయని,అవి క్రీ.పూ. 200 నుంచి క్రీ.శ.600 వరకు కాలానికి చెందినవని పేర్కొన్నారు.ఈ ప్రాంతంలో శాస్త్రీయ తవ్వకాలు జరిపితే మరిన్ని చారిత్రక ఆధారాలు లభించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

## అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సాయుధ పోరాటానికి అసలైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద పార్టీ ఆధ్వర్యంలో వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నాడు తెలంగాణ రైతాంగం జరిపిన వీరోచిత సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోయిందని పేర్కొన్నారు. కొందరు స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను తీవ్రంగా వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, పోలేపల్లి ఉదయకుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి డి.లింగా నాయక్, మండల సమితి సభ్యులు గువ్వల మట్టయ్య, ఎస్కే షమీమ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ: డిఇఒ రమేష్‌కుమార్



ప్రజాపక్షం/కల్వకుర్తి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలే పాఠశాలలో విద్యా ప్రమాణాలకు కొలమానమని డిఇఒ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి మండలంలోని వేపూర్, జెక్కిర, తోటపల్లి పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసనా స్థాయిని స్లాట్ అసెస్‌మెంట్ ద్వారా పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని సూచించారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. తోటపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణితాన్ని స్వయంగా బోధించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని డిఇఒ సూచించారు.

## అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/అమరచింత: అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని మత్స్య పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. సోమవారం కల్యాణ పారిశ్రామిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ నేత మేరకు పురపాలక చైర్ పర్సన్ జింక నుదర్ల రవికుమార్ యాదవ్, వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులతో మక్తల్ క్యాంపు ఆఫీసులో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ని కలిసి పట్టణాభివృద్ధికి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి స్పందించి అమరచింత పట్టణానికి మహబూబ్‌నగర్, నారాయణపేట్, గద్వాల, ఆర్టీసీ డీపోల నుంచి బస్సులను వేయుటకు ఆర్టీసీ డీపో మేనేజర్ తో ఫోనులో మాట్లాడి తప్పకుండా అమరచింతకు బస్సులు వచ్చేటట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అమరచింతకు ఇంటిగ్రేటెడ్ స్కూలు ఏర్పాటు కోసం కృషి జరుగుచున్నదని అఖిలపక్షం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపిడిఒ, పోలీస్ స్టేషన్, పురపాలక భవన నిర్మాణాలకు త్వరలోనే పనులను ప్రారంభించుటకు కృషి జరుగుతున్నదని మంత్రి తెలిపారు. పట్టణంలో డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలను కల్పించుటకు కృషి జరుగుతున్నదని, తప్పకుండా హాస్పిటల్ ను పిహెచ్‌సిగా మార్చి వైద్యులను నియమించుటకు కృషి జరుగుతున్నదని తెలిపారు. అలాగే పునర్విభజనలో భాగంగా అమరచింతను నియోజకవర్గం చేయుటకు తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణాభివృద్ధికి, మండల అభివృద్ధికి అన్ని వర్గాల రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు టి.రవికాంత్, మార్కెట్ డైరెక్టర్ కమలాకర్ గౌడ్, కో అప్షన్ సభ్యులు, తౌఫిక్, మణెమ్మ డేవిడ్, అఖిలపక్షం, నాయకులు నరసింహులు గౌడ్, జగనాథం, జిఎస్, గోపి, అజయ్, రవి, కె.రాజన్న, రవీందర్, అశోక్, సత్యేందర్, రఘు పాల్గొన్నారు.

## 17న ప్రజాపాలన దినోత్సవం

అదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవసహాయం



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్‌లో 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య దేవసహాయం అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో 17న జరుపబోయే ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్ల గురించి జిల్లా అధికారులకు తమ శాఖలకు సంబంధించిన పనులను అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.చెన్నయ్య అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరణ, సభా వేదిక, షామియానాలు, కుర్చీలు, బ్యారికేడ్లు, తాగునీరు, ప్రొటోకాల్ ప్రకారం వీఐపీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆహ్వాన పత్రికల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ పాండు, కలెక్టరేట్ ఎఒ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'సెట్విన్' ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత పిలుపు




ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన సెట్విన్ సాంకేతిక శిక్షణా సంస్థను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి డా.వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత సూచించారు. మంగళవారం సెట్విన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె, కేంద్రంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన కంప్యూటర్ ట్రైనింగ్ లలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులను అడిగి శిక్షణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. అ సందర్భంగా వాకిటి లలిత మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి, స్పోర్ట్స్ యూత్ సర్వీసెస్ శాఖ మంత్రిగా ఉన్న వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తన శాఖలోని అనుబంధంగా ఉన్న సెట్విన్ కేంద్రాన్ని మక్తల్‌కు తీసుకువచ్చారని తెలిపారు. మక్తల్ ప్రాంత మహిళలు స్వయం ఉపాధితో తమకాళ్లపై తాము నిలబడాలని, నారాయణపేట, గద్వాల,వనపర్తి లాంటి జిల్లా కేంద్రాల్లో సైతం లేని సెట్విన్ ను మక్తల్‌లో ఏర్పాటు చేశారంటే ఈ ప్రాంతం పై మంత్రి వాకిటి శ్రీహరికి ఉన్న ప్రత్యేక అభిమానమని అన్నారు. త్వరలోనే సెట్విన్ కింద మరిన్ని విభాగాలకు సైతం శిక్షణను విస్తరించే యోచనలో మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, స్థానిక వార్డు కౌన్సిలర్ కలాల్, శ్రీవిద్యనీల గౌడ్, వార్డు కౌన్సిలర్ రహీం పటేల్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్కూరి రవికుమార్, నాయకులు చంద్రకాంత్ గౌడ్, అమర్, గోవిందరావు, నీలప్ప ముదిరాజ్, సెట్విన్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, ట్రైనర్లు తిమ్మప్ప, స్వప్న, వీరమ్మ, ఫర్హానా, సిబ్బంది, ప్రవీణ్, లక్ష్మి , విద్యార్థినిలు పాల్గొన్నారు.

## లింక్ కెనాల్‌ను ఆర్‌డిఎస్ 12ఎ కు కలపాలి

కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/అయిజ: అయిజ మండలంలోని సింధనూర్ , కుట్కనూర్ గ్రామాల రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, మాజీ ఎంపిటిసి సుధారాణి రవిరెడ్డి, రైతులు విజయ్ కుమార్, దేవేందర్, జనార్ధన్ గౌడ్ లు మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాని కోరారు. గట్టు మండలం, చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్‌డిఎస్‌కు ఏర్పాటు చేసి లింక్ కెనాల్ ద్వారా 12ఎ కెనాల్ కు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. 12ఎ, డిస్ట్రిబ్యూటర్ కింద దాదాపు వెయ్యి ఎకరాలు సాగు భూమి ఉందని వారు కలెక్టర్ కు వివరించారు. ప్రస్తుతం ప్రజల అవసరాలు తీర్చేందుకు తాగునీరు విడుదల చేయించడంతో పాటు యాసంగి పంటకు సాగునీరు విడుదల చేయించాలని కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ రైతుల ప్రయోజనాలు కాపాడాలని ఆర్‌డిఎస్ చీఫ్ (సిఇ) ఇంజనీర్ ను ఫోన్‌లో ఆదేశించారు.

## పేద కుటుంబాలకు అండగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి: ఎమ్మెల్యే విజయుడు



ప్రజాపక్షం/ అలంపూర్: పేద కుటుంబాలకు అండగా వైద్య ఖర్చులకు భరోసాగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు పంపిణీ చేశారు. అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, ఇటిక్యాల, లీగాల, రాజోలి, వాడేపల్లి తదితర మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 120 మంది లబ్ధిదారులకు మంజూరైన మొత్తం రూ.39 లక్షల 43 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే తన చేతుల మీదుగా అందజేశారు ప్రమాదవశాత్తు అనారోగ్యానికి గురై కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్స పొంది, లక్షల రూపాయల అప్పులపాలైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా అందుతున్న ఈ ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. చాలా మంది లబ్ధిదారులు గుండె , కిడ్నీ, క్యాన్సర్ , రోడ్డు ప్రమాదాలు, ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారే ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే ప్రజా ప్రతినిధిగా నా ప్రధాన బాధ్యత సిఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి సహాయం అందేలా నేను ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నాను. ఎవరూ అధైర్యపడవద్దు, ప్రభుత్వం మీకు అండగా ఉంది అని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావిస్తూ, ప్రతి కుటుంబానికి భరోసాగా నిలుస్తున్న ఎమ్మెల్యే విజయుడు లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకరవర్గంలోని వివిధ మండలాల బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పామపూర్‌లో ఆర్‌పిఎల్ శిక్షణ



ప్రజాపక్షం/కొత్తకోట: కొత్తకోట మండలంలోని పామపూర్ గ్రామ పంచాయతీలో మంగళవారం ఆర్‌పిఎల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు సమగ్ర సస్య రక్షణ, నేల ఆరోగ్య యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి రైతులకు వరిలో సమగ్ర సస్యారక్షణ చర్యలు చేపట్టడంతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. యూరియా ఎక్కువగా ఉపయోగించడం వలన దోమ పోటు పెరుగుతుందని తెలిపారు. పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించడం, నేల సారాన్ని కాపాడుకోవడం, ఎరువుల సమర్థ వినియోగం తదితర అంశాలను వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఎరువుల వినియోగాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె ప్రధాన శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జాస్మిన్, సిడిసి చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి మానస, కెవికె సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## భూములు కబ్జా చేశామని చెప్పకోవడం సిగ్గు చేటు

మాజీ మంత్రి లక్ష్మారెడి



ప్రజాపక్షం/జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కి ఎక్కడ ఏం మాట్లాడాలో తెలియదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. టిఆర్‌ఎస్ పార్టీ నాయకులు భూములు కబ్జా చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటని పందుల గురించి అసెంబ్లీలో చర్చించడం జడ్చర్ల ఎమ్మెల్యే అవివేకానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. మంగళవారం నాడు జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జడ్చర్ల పరువు తీస్తున్న ఎమ్మెల్యే కి ఎక్కడ ఏం మాట్లాడాలో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు భూములు కబ్జా చేసినట్లు ఎక్కడపడితే అక్కడ ఆరోపిస్తున్నారని ఒకటైన రుజువు చేస్తే ఛాలెంజ్ చేస్తానని ఆయన సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిపి లక్ష్మి , శంకర్ నాయక్, పిట్టల మురళి, రఘుపతిరెడ్డి, రామ్మోహన్, నందకిషోర్ గౌడ్, ప్రవీణ్ చందర్, మచ్చల శ్రీను, శ్రీనివాస్ యాదవ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీకి మైక్ సెట్ వితరణ

ప్రజాపక్షం/పానుగల్: పానుగల్ మండల పరిధిలోని బండపల్లి గ్రామ పంచాయతీకి రూ.30వేల విలువ గల మైక్ సెట్‌ను గ్రామ వసూలు దాతలు మాజీ ఉపసర్పంచ్ కొమారి రఘుపతి నాయుడు, జ్ఞానమూర్తి, సూర్యనారాయణ, వీరాంజనేయులు, శివకుమార రాముడు కలిసి వితరణ చెయ్యడం జరిగింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం జరిగిన, అలాగే గ్రామంలో పండుగల సందర్భంగా ప్రజలకు భక్తి భావాలు పెంపొందించుటకు ఇట్టి మైకులు ఉపయోగించుకోవాలని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉసేనమ్మ, లక్ష్మయ్య నాయుడు, నాగరాజు, వార్డు మెంబర్, తిరుపతయ్య, నరసింహ, శివకృష్ణ, బలరాం, సుధాకర బాల గణేష్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి

ఎమ్మెల్యే విజయుడికి రైతుల వినతి

ఉండవెల్లి మండల చివరి ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన



ప్రజాలపక్షం/అలంపూర్: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఉండవెల్లి మండల రైతులు అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే విజయుడుని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఉండవెల్లి మండలంలోని చివరి ఆయకట్టు భూములకు గత కొన్నేళ్లుగా సకాలంలో సాగునీరు అందడం లేదని దీంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మిర్చి, పత్తి, కంది మొక్క జొన్న వంటి పంటలు సాగు చేసే రైతులు నీటి కొరతతో అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మారమునగాల లేదా ప్రాగటూరు గ్రామాల సమీపంలో ఒక లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ఏర్పాటు చేయాలని రైతులు ప్రతిపాదించారు. అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసి 32ఎ కాలువకు అనుసంధానం చేస్తే చివరి ఆయకట్టు వరకు నీరు సులభంగా చేరుతుందని వివరించారు. ఈ ఒక్క లిఫ్ట్ పథకం ఏర్పాటు చేస్తే ఉండవెల్లి మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని సుమారు 25వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, దీనివల్ల 500లకు పైగా రైతు కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందని రైతులు పేర్కొన్నారు. రైతుల వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే విజయుడు సానుకూలంగా స్పందించారు. రైతుల సమస్య న్యాయమైనదని, చివరి ఆయకట్టు వరకు నీరు అందించడం తనబాధ్యత అని అన్నారు. ఈ ప్రతిపాదనను వెంటనే ప్రభుత్వం దృష్టికి, నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉండవెల్లి మండలానికి చెందిన ఆయా గ్రామాల రైతులు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సఖి సెంటర్ ఆకస్మిక తనిఖీ

బాధితులకు సత్వర సేవలు అందించాలి

కలెక్టర్ ప్రియాంక



ప్రజాపక్షం/నారాయణపేట: నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న సఖి (వన్ స్టాప్) సెంటర్ ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించి కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్‌లోని షెల్టర్ గది, కౌన్సిలింగ్ గది, మీటింగ్ హాల్‌తో పాటు పై అంతస్తులో నిర్వహిస్తున్న షీ టీం విభాగాన్ని ఆమె పరిశీలించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్ తో కలిసి సఖి సెంటర్ సిబ్బందితో మాట్లాడి బాధితులకు అందుతున్న సేవలు, కేంద్రం నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సఖి సెంటర్‌లోని హాజరు రిజిస్టర్ తో పాటు వివిధ రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మంది బాధితులకు సేవలు అందించారో, గత నెల రోజులుగా ఎంత మంది బాధితులు కేంద్రాన్ని ఆశ్రయించారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సఖి సెంటర్ కు ఎక్కువగా ఎలాంటి కేసులు వస్తున్నాయని, బాల్య వివాహాలకు సంబంధించిన కేసులు ఎన్ని నమోదయ్యాయని కలెక్టర్ ప్రశ్నించగా, వివాహాల సీజన్‌లో బాల్య వివాహాలకు సంబంధించిన కేసులు ఎక్కువగా వస్తుంటాయని సెంటర్ బాధ్యురాలు క్రాంతిరేఖ వివరించారు. మహబూబ్‌నగర్ సఖి సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి కోస్గి ప్రాంతానికి చెందిన బాధితులకు అక్కడే అవసరమైన ఆశ్రయం, ఇతర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిడబ్ల్యుఒను ఆదేశించారు. సఖి సెంటర్ లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డిడబ్ల్యుఒ రాజేందర్ గౌడ్ ను కలెక్టర్ ఆదేశించారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

డిజెలకు అనుమతి లేదు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎస్‌పి డా.జి.వీనిత్



ప్రజాపక్షం/నారాయణపేట్: జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్‌పి డా.జి.వీనిత్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిమజ్జన శోభాయాత్రల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గణేష్ నిమజ్జన శోభాయాత్రల ఏర్పాట్లపై పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,509 గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ప్రతిష్ఠాపన అనంతరం 3,5,7,9,11 రోజులలో అధిక సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు పూరిత అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. గణేష్ నిమజ్జనాల్లో డీజేలకు ఎట్టి పరస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్‌పి స్పష్టం చేశారు. డీజే నిర్వాహకులకు ముందస్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. ఇతర జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి డిజెలు రాకుండా అవసనమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొండారెడ్డిపల్లి చెరువు, కృష్ణా నది , జూరాల డ్యాం, మక్తల్ ట్యాంక్‌బండ్, కోయిల్‌సాగర్ తదితర నిమజ్జన ప్రాంతాల్లో ముందస్తు భద్రత ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, లైటింగ్, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది, టార్చ్‌లెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. శోభాయాత్ర మార్గాల్లో సీసీ కెమెరాలు, వీడియో గ్రఫీ, ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి సూచించారు.చిన్నపిల్లలు, వృద్ధులు నీటి ప్రాంతాలకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తల తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్‌పి ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి ఎండి.రియాజ్ ఉల్ హక్, డిఎస్‌పిలు మహేష్, లింగయ్య, సిఐలు శివశంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నవ భారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

సిపిఐ నాయకుడు కోళ్ల యేసయ్య



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి: నవభారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, దేశం అభివృద్ధి చెందాలంటే నేటి తరానికి ఉపాధ్యాయులే మార్గదర్శకమని మాజీ ఎంపిటిసి, సిపిఐ నాయకుడు కోళ్ల యేసయ్య అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు ఆది జాంబవ చైతన్య సమితి కల్వకోల్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సాల్వాతో సన్మానించారు. ఉత్తమ్ ఉపాధ్యాయ అవార్డులు నలవల్ల సుదర్శన్, నలవాల ఎల్లయ్య, నలవాల రాజు, కడ్తాల రామలక్ష్మి , అన్వాడ్ మండలం పిఆర్‌టియు అధ్యక్షులుగా రెండోసారి కడ్తాల స్వామి ఎన్నికైన సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆది జాంబవ చైతన్య సమితి సభ్యులు నిరంజన్, నలవాల అర్జున్, చింతలపల్లి కురుమయ్య, రాముడు, కడ్తాల రాంబాబు, ప్రకాష్, నిరంజన్ పాల్గొన్నారు.

## జమ్ము, సిల్ట్‌తో సాగునీటికి అడ్డంకి... రైతులే రంగంలోకి

పంటలను కాపాడుకునేందుకు సొంత డబ్బులతో పూడికతీత పనులు

వరి పొట్ట దశలో నీటి కోసం రైతుల ఆవేదన



ప్రజాపక్షం/వీపనగండ: భీమ కాలువలో జమ్ము, సిల్ట్ పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. శ్రీరంగాపురం రంగసముద్రం నుంచి భీమ కాలువ ద్వారా రావాల్సిన సాగునీరు సక్రమంగా ముందుకు సాగకపోవడంతో వీపనగండ్ల మండలంలోని పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో చివరకు రైతులే స్వచ్ఛందంగా డబ్బులు పోగుచేసుకుని జెసిబిని ఏర్పాటు చేసి కాలువలో పేరుకుపోయిన జమ్ము, సిల్ట్ ను తొలగించే పనులు చేపట్టారు. వీపనగండ్ల గ్రామానికి సమీపంలోని భీమ కాలువ ద్వారా సాగునీరు అందుతుందన్న ఆశతో కొందరు రైతులు వరి పంట సాగు చేశారు. అయితే ఇటీవల వ్యవసాయ బావులు, బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోవడంతో పంటలకు సరిపడా నీరు అందడం లేదు. దీంతో ఇప్పటికే సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమ కాలువ నీటితోనైనా పంటలను కాపాడుకుందామని భావించిన రైతులకు కాలువలో పేరుకుపోయిన జమ్ము, సిల్ట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోవడంతో పంటలు ఎండిపోతున్న పరిస్థితిని గమనించిన రైతులు ఇక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. రైతులంతా కలిసి డబ్బులు సమకూర్చుకుని జేసీబీని ఏర్పాటు చేసి కాలువలో పేరుకుపోయిన జమ్ము, సిల్ట్‌ను తొలగించే పనులు చేపట్టారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన కాలువల పూడికతీత పనులను రైతులే తమ సొంత ఖర్చులతో చేపట్టాల్సిన పరిస్థితి రావడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమ కాలువలో పూడిక పేరుకుపోయి సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్న విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని రైతులు చెబుతున్నారు. కాలువకు పూడికతీత పనులు చేపట్టి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు మండిపడుతున్నారు.

### పొట్ట దశలో పంట... నీటి కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం వరి పంట పొట్ట పోసుకునే కీలక దశలో ఉందని రైతులు చెబుతున్నారు. ఈ సమయంలో తగినంత నీరు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు పెట్టే సాగు చేసిన పంట కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అప్పుల చేసి పంట సాగు చేసిన తమ పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని వాపోతున్నారు. భీమ కాలువను పూర్తిస్థాయిలో పరిశీలించి పేరుకుపోయిన జమ్ము, సిల్ట్‌ను తొలగించడంతో పాటు కాలువలో నీటి ప్రవాహం సజావుగా సాగేలా శాశ్వత చర్యలు చేపట్టాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పంటలను కాపాడేందుకు అత్యవసరంగా సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులే డబ్బులు సమకూర్చుకుని కాలువ పూడికతీత పనులు చేపట్టాల్సిన పరిస్థితిపై ప్రభుత్వం స్పందించి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా కాలువల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతులు డిమాండు చేస్తున్నారు.

## వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: చెరువులు, కుంటల వద్ద వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప వివరించారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని బొబ్బిలిచెరువు, చటాన్‌పల్లిలను చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, పోలీస్ శాఖ, విద్యుత్ ఎఇ వినోద్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## మెరుగైన వసతులతో కళాశాల భవన నిర్మాణం అభినందనీయం




ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామీణ పేద విద్యార్థుల అభ్యున్నతికి మెరుగైన వసతులతో కూడిన ప్రభుత్వ కళాశాలను నిర్మించడం అభినందనీయమని హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మనవడు బూర్గుల విజయకుమార్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన సొంత ఖర్చులు, దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వావిలాల సుజీవన్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, బాదేపల్లి సిద్దార్థ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించాలి



ప్రజాపక్షం/కేశంపేట: స్మశాన వాటి భూమి అక్రమనకు గురవుతుందని, అక్కడ నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో సర్వే నంబర్ 216లో ఉన్న స్మశాన వాటిక అక్రమణకు గురవుతుందని సర్పంచ్ బిసా కవిత కరుణాకర్‌రెడ్డితోపాటు గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు.

## మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు



ప్రజాపక్షం/కేశంపేట: ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షుడు జర్పుల రాజునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం కేశంపేట మండల తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ వార్డు సభ్యుడు జంగా శేఖర్, వార్డు సభ్యుడు పట్నం కుమార్, రాజు యాదవ్, పట్నం రాజు, కాసారం శ్రీశైలం, పెద్దని ప్రభాకర్ యాదవ్, అంజి యాదవ్, వేముల శివానంద్‌లు ఉన్నారు.

## రాజకీయంగా..ఆర్థికంగా రాణిద్దాం



ప్రజాపక్షం/షాద్‌నగర్: స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌కు అండగా ఉండటంతోపాటు ప్రతి రజకుడు ఆర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు కృషి చేయాలని తాలుకా రజక సంఘం గౌరవ అధ్యక్షుడు, సింగిల్ విండో మాజీ చైర్మెర్ చించోడు ఆనంతం సూచించారు. మంగళవారం పట్టణంలోని వి కన్వేషన్ హాల్‌లో తాలుకా రజక సంఘం అధ్యక్షుడు విర్యాల పెంటయ్య అధ్వర్యంలోనియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రజక సంఘం తాలుకా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల అశోక్, ఉపాధ్యక్షుడు నందిగామ శేఖర్, గౌరవ అధ్యక్షులు చిల్కమర్రి నర్సింలు, నందిగామ రాంచందర్, మార్కెట్ డైరెక్టర్ చాకలి నర్సింహులు, ఎలుక గూడెం రజక సర్పంచ్ బందయ్య, చేగూరు ఉప సర్పంచ్ శివ, కమ్మదనం నవీన్, ఆంజనేయులు, రామస్వామి, పాపిరెడ్డిగూడ యాదయ్య, సత్యం పాల్గొన్నారు

## గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు




ప్రజాపక్షం/షాద్‌నగర్: గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ల అమలు చేసి సెప్టెంబర్ 17 నాటికి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతుందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ వివరించారు. మంగళవారం పట్టణంలోని బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వి.నారాయణరెడ్డి, రాంబల్‌నాయక్, ఈట గణేష్, లక్ష్మ ణ్‌కుమార్, మిట్టునాయక్, రాజునాయక్, గోపాల్‌నాయక్, హన్యానాయక్, అమ్రు నాయక్, రవినాయక్, రాంచరణ్, లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో ఎంబిఎ విద్యార్థి మృతి

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: మహారాష్ట్రకు చెందిన ఆర్య అనే ఎంబిఎ విద్యార్థి శంకర్‌పల్లి మండల పరిధిలోని ఓ కళాశాలలో చదువుతూ, అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ వసతిగృహంలో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వసతిగృహం నుంచి బయటకు వచ్చిన సమయంలో రోడ్డుపక్కన విద్యుత్ వైర్లకు సంబంధించిన మరమ్మతు పనులు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఆర్య అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న మోకిల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# రైలు భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

### అధికారులకు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆదేశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: రైలు కార్యకలాపాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ట్రాక్ నిర్వహణ పనుల సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ఆకతాయి చర్యలకు తావులేకుండా ట్రాక్‌ల వెంబడి భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు, క్షేత్రస్థాయి సిబ్బంది, స్టేషన్ సిబ్బంది మధ్య సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో మంగళవారం జోన్‌వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై ఆయన సవివర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల ప్రధానాధిపతులతో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డిఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ల వారీగా భద్రతా చర్యలు, ట్రాక్ నిర్వహణ పనులు, కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై జీఎం సమీక్షించారు. ట్రాక్ నిర్వహణ పనులను సిబ్బంది, యంత్ర పరికరాలతో చేపట్టే సమయంలో అధికారులు, సూపర్‌వైజర్లు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని జీఎం సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న భద్రతా నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని, పెట్రోల్‌మెన్, ట్రాక్‌మెన్, స్టేషన్ సిబ్బంది మధ్య సమాచార మార్పిడిలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**సిబ్బందికి పునశ్చరణ శిక్షణ..** క్షేత్రస్థాయి సిబ్బంది విధులు నిర్వర్తించే సమయంలో నిర్దేశిత భద్రతా విధానాలను కచ్చితంగా పాటించేలా పర్యవేక్షకులు నిరంతరం సూచనలు ఇవ్వాలని సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అన్నారు. తాజా భద్రతా నియమాలు, నిబంధనలు, కార్యాచరణ విధానాలపై సిబ్బంది అవగాహనను ఎప్పటికప్పుడు నవీకరించుకునేలా క్రమం తప్పకుండా పునశ్చరణ కోర్సులు నిర్వహించాలని, అర్హులైన సిబ్బందిని వాటికి నామినేట్ చేయాలని సూచించారు. రైల్వే ట్రాక్‌ల వెంట చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల పురోగతిని కూడా జీఎం సమీక్షించారు. లోకో పైలట్లకు సిగ్నల్స్ స్పష్టంగా కనిపించేలా చెట్ల కొమ్మల ట్రిమ్మింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులు చేపట్టే సమయంలో కార్యస్థల రక్షణపై నిరంతరం దృష్టి పెట్టాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయం మెరుగ్గా ఉండాలని సూచించారు. జోన్ వ్యాప్తంగా కొనసాగుతున్న వివిధ పనుల పురోగతిని సమీక్షించిన జీఎం.. నిర్ణయించిన లక్ష్య తేదీలలోగా పనులను పూర్తి చేయాలని డివిజన్ల అధికారులను ఆదేశించారు. రైల్వే కార్యకలాపాల్లో భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని, ప్రతి స్థాయిలో అప్రమత్తతతో విధులు నిర్వహించాలని జీఎం సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

## ఆర్.కె.పురం అండర్ బ్రిడ్జి భూసేకరణ వేగవంతం

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్.కె.పురం రోడ్ అండర్ బ్రిడ్జ్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రాజెక్టు పనులు సకాలంలో ముందుకు సాగేందుకు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, తార్నాకలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆర్‌కె పురం ఆర్యూబీ ప్రాజెక్టుకు అవసరమైన భూముల వివరాలు, ఇప్పటి వరకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియ, ప్రస్తుత పరిస్థితులు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో వినయ్ కృష్ణారెడ్డి సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూములను గుర్తించి, సంబంధిత రికార్డులను పరిశీలించి, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసే అంశాలపైన ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక వివరాలు, భూవివరాలు, అవసరమైన ప్రతిపాదనలు తదితర ప్రక్రియలో జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నా. సమీక్ష సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ రావు, ప్రాజెక్ట్స్ హెడ్ ఇఇ రోహిణి, ప్రాజెక్ట్స్ విభాగం డిప్యూటీ ఇంజినీర్, టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీలు, డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ' టవర్స్ దరఖాస్తుల గడువు 20వరకు పెంపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద 4 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 20 వ తేదీ వరకు పొడిగించారు. రెండో శనివారం, ఆదివారం, పండుగలు , ఇతర వరుస సెలవుల కారణంగా దరఖాస్తుల గడువును పొడిగించాలని వివిధ వర్గాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ ,హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్ తెలిపారు. చాంద్రాయణగుట్ట, ఎల్‌బీ నగర్, ముషీరాబాద్, గోషామహల్ పరిధిలో నిర్మించనున్న టవర్లలోని ఇండ్ల కోసం దరఖాస్తుల చేసుకునేవారు ఈ గడువును సద్వినియోగం చేకోవాలని కోరారు. పథకానికి సంబంధించిన అర్హత ప్రమాణాలు ఇతర నిబంధనల్లో ఎటువంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు tghb.telangana.gov.in వెబ్‌సైట్, తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 04024603572ను సందర్శించాల్సిందిగా సూచించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

### డిఎంహెచ్ఓ డాక్టర్ డి.స్వర్ణకుమారి



ప్రజాపక్షం/రంగారెడ్డి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పేషంట్ల గదులలో శుభ్రంగా ఉండేలా చూడాలి. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పిహెచ్‌సిలోని ఒపి సేవలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, ఎన్‌సిడి రిజిస్టర్లు, మందుల నిల్వ, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఊరేగింపులో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరం

### ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి



ప్రజాపక్షం/హైదరాబాద్: గణేష్ నిమజ్జన ఊరేగింపులో అన్నిశాఖల మధ్య సన్నిహిత సమన్వయం ఉండాలని జిహెచ్ఎంసి, హైడ్రా, హైదరాబాద్ పోలీసు శాఖ సంబంధిత విభాగాలను ఆదేశించింది. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, అదనపు పోలీస్ కమిషనర్ (శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ తదితరులు హైదరాబాద్‌లోని బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు 'గణేష్ ఊరేగింపు' మార్గాన్ని మంగళవారం పరిశీలించారు. ఊరేగింపు మార్గం పొడవునా ఏర్పాట్లను వారు సమీక్షించారు. ట్రాఫిక్ నిర్వహణ, జనసమూహ నియంత్రణ, రహదారి పరిస్థితులు, పారిశుధ్యం, లైటింగ్, బారికేడింగ్, తదితర సౌకర్యాలపై ప్రత్యేకదృష్టి సారించారు. సున్నితమైన, రద్దీగా ఉండే ప్రాంతాలను పరిశీలించి, ఊరేగింపు సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధితశాఖలను ఆదేశించారు. ఊరేగింపు. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సమర్థవంతమైన ఏర్పాట్లు జరిగేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.

## 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్

### చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి




ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహించనున్నట్లు చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్ కార్యశాలలో ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ పాల్గొని పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సుదీర్ఘకాలంగా అందిస్తున్న సేవలు, దేశ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు,స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు, అంగన్వాడీ కేంద్రాల్లో సేవా కార్యక్రమాలు, సీనియర్ సిటిజన్లతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు కృతజ్ఞతగా తమ ఇళ్లలో దీపాలు వెలిగించి ప్రధాని నరేంద్ర మోదీని ఆశీర్వదించాలని ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, తోకల శ్రీనివాస్ రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, పాపయ్య గౌడ్, మిద్దె సుదర్శన్ రెడ్డి, శ్రీశైలం,ప్రభాకర్ రెడ్డి, మల్క కొమురయ్య, మల్లారెడ్డి, శంకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, యువ మోర్చా అధ్యక్షుడు అభినయ్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ సాధ మల్లారెడ్డి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి పనిచేస్తా



ప్రజాపక్షం/రంగారెడ్డి: అబ్దుల్లాపూర్ మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికిబింగి దేవదాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించిన లెటర్‌హెడ్‌ను అందుకోవడం ఎసంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన ఇరువురు నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనను అభినందించేందుకు కార్యక్రమానికి విచ్చేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తతో కలిసి అంకితభావంతో పనిచేస్తానని బింగి దేవదాస్ గౌడ్ పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## పండుగ పూలవ్యర్థాలతో ఉత్పత్తులు



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : గణేష్ పండగ ఉత్సవాల సందర్భంగా ఉత్పత్తి అయ్యే పూలవ్యర్థాలను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చుతామని సిఎంసి కమిషనర్ శ్రీజన తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పండుగల సంధర్భంగా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు, అనంతరం మిగిలే పూల వ్యర్థాలను సేకరించి సర్క్యులర్ విధానంలో పక్కా అర్గానిక్స్‌తో ఉపయోగకరమైన ఉత్పత్తులుగా తీర్చి దిద్దడానికి పరిశీలిస్తున్నామని సరస్సుల వద్ద సేకరించిన వ్యర్థాలను కియోస్క్‌లను ఏర్పాటు చేయడానికి యోచిస్తుందన్నారు. సేకరించిన వ్యర్థాలను ఎండబెట్టి వేరు చేసి నూతన ప్రాసెసింగ్ టెక్నాలజీతో సాంకేతిక పరిజ్ఞానంతో సర్క్యులర్ ఎకానమీ విధానాల్లో నైపుణ్యం కలిగిన ఎన్‌జీఓలు, స్టార్టప్‌లు, ఇతర సంస్థలతో కలసి అగరబత్తులు, ధూపాలు, దీపాలు వంటి విలువ గల ఉత్పత్తులుగా చేయాలని ప్రతిపాధించామని తెలిపారు.

## విమోచన దినోత్సవంగా సెప్టెంబర్ 17

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట వీరుల త్యాగాలను స్మరించుకుంటూ శేరిలింగంపల్లి సిపిఐ కార్యలయంలో శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి చందు యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, రామకృష్ణ, సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి చందుయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ భూస్వాములు, జమీందారులు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన సాయుధ పోరాటం దేశ చరిత్రలో గొప్ప ప్రజా ఉద్యమమన్నారు. వేలాది మంది రైతులు, కూలీలు, మహిళలు, యువత పోరాటంలో పాల్గొని తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాలలో చేర్చి, పోరాట వీరుల త్యాగాలను భవిషత్ తరాలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు వెంకటస్వామి, సుధాకర్, ఖాసిం, రాములు, నాయరణ, శివకుమార్, రామస్వామి, కృష్ణ, రఘు భాస్కర్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘ విరామం తర్వాత వాణిజ్యంపై
# భారత్–చైనా చర్చలు ప్రారంభం



**న్యూఢిల్లీ:** చాలా విరామం తర్వాత వాణిజ్యంపై భారత్–చైనా చర్చలు ప్రారంభించాయి. భారత్ వాణిజ్య లోటు విపరీతంగా పెరగడం ఆందోళనకరంగా మారింది. ఈ చర్చల్లో భారత్ ప్రధానంగా దీనిపైనే దృష్టి సారిస్తుంది. చర్చల ప్రక్రియ కొనసాగుతుందని, తదుపరి కొనసాగింపుగా మరిన్ని చర్చలు జరుగుతాయని, రెండు దేశాలు ఈ రంగంలో ఉన్న సమస్యలను మెల్లిగా అర్థం చేసుకుని పరిష్కరించుకుంటాయని కేంద్ర వాణిజ్యశాఖ కార్యాదర్శి రాజేశ్ అగర్వాల్ మంగళవారం చెప్పారు. రెండు దేశాలమధ్యా వాణిజ్యానికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించుకోవడం, ఇరు దేశాలమధ్యా ఉన్న వాణజ్య అసమతౌల్య సమస్యలు పరిష్కరించుకోవడం, సరఫరా గొలుసు వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుకోవడం వంటి అనేక విషయాలను వరుస సమావేశాలలో చర్చిస్తారు. బ్రిక్స్ 18వ సదస్సు సందర్భంగా రెండు దేశాల అగ్రనాయకులు మోదీ–జీ జిన్‌పింగ్ సమావేశంలో ఈ చర్చల ప్రారంభం గురించి కూడా ప్రధాన ప్రస్తావన వచ్చింది. దానికి అనుగుణంగా ఈ చర్చలు మొదలయ్యాయి. బీజింగ్ నుండి ఢిల్లీకి, గ్వాంగ్ జౌ నుండి ఢిల్లీకి ప్రత్యక్ష విమాన సర్వీసులు రాకపోకలు చేస్తూ ఉండటంతో రెండు దేశాలమధ్య ఏడాదికాలంగా సంబంధాలు మెరుగుపడ్డాయని, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయని రాజేశ్ అగర్వాల్ చెప్పారు.

భారతదేశానికి చైనా రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది.ఇరు దేశాలమధ్యా ద్వైపాక్షిక వాణిజ్యం 2025–26 ఆర్థిక సంవత్సరంలో 127.7 బిలియన్ డాలర్లకు చేరింది. అంతకుముందు 2024–25 ఆర్థిక సంవత్సరంలో 118.39 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒక్క ఏడాదిలోనే 7.9 శాతం పెరిగింది. రెండు దేశాల మంత్రులమధ్య ఈనెల 12వ తేదీన బ్రిక్స్ సదస్సు సందర్భంగా జరిగిన సమావేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.రెండు దేశాలూ పరస్పరం వాణిజ్యానికీ,సరఫరా గొలుసు వ్యవస్థలకు సంబంధించిన ప్రశ్నలు లేవదీస్తాయి. వాటిని మెల్లిగా పరిష్కరించుకోవాలి, ఒకరికొకరు సమాధానాలు చెప్పుకోవాలి,అవగాహన పెంచుకోవాలి,బ్రిక్స్ దేశాలమధ్య వాణిజ్య కార్యకలాపాలను ముమ్మరం చేయాలని మొన్న ముగిసిన సదస్సులో ప్రధానంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనికి అనుగుణంగా ఆసియా అగ్రదేశాలు రెండు ముందడుగు వేయాల్సి ఉంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో భారత్ నుండి చైనాకు చేసిన ఎగుమతులు 36.62శాతానికి పెరిగి 19.47 బిలియన్ డాలర్లుగా నమోదుకాగా, ఏడాదిక్రితం ఎగుమతులు 14.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అదేసమయంలో దిగుమతులు కూడా చైనా నుండి 16 శాతం పెరిగి 131.62 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, రెండు దేశాలమధ్య వాణిజ్య లోటు గడచిన ఆర్థిక సంవత్సరంలో 99.19 బిలియన్లకు విస్తరించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ వాణిజ్యలోటు 85 బిలియన్ డాలర్లుగా ఉండేది. ఇది భారతదేశానికి తీవ్ర ఆందోళనకరంగా మారింది.

# లైంగిక వేధింపుల కంటెంట్ ఇస్తాం

## చిన్నరుల లైంగిక వేధింపులపై పూర్తి సమాచారం దర్యాప్తు సంస్థలకు రిపోర్ట్ చేసేందుకు 'మెటా'ఒకే

**న్యూఢిల్లీ :** ఆన్‌లైన్‌లో బాలల లైంగిక వేధింపుల మెటీరియల్, ఇతర హానికరమైన కంటెంట్‌పై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను పటిష్టమైన భద్రతా చర్యలు, అధిక జవాబుదారీతనం కోసం ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్న కారణంగా, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ యజమాని 'మెటా' బాలల భద్రతకు సంబంధించిన విషయాలను నేరుగా ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (I 4C) నిర్వహించే సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నివేదించడానికి అంగీకరించింది. ప్లాట్‌ఫారమ్‌లపై పిల్లలను రక్షించడం కంపెనీకి ప్రాధాన్యత అని 'మెటా' ప్రతినిధి తెలిపారు.ఈ నేరాలను పాల్పడిన వారిని బాధ్యులను చేసేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి మేం కట్టుబడి ఉన్నాం' అని ఆయన అన్నారు.'ఈ హానిని ఎదుర్కోవడానికి, మా ప్రయత్నాలను సమష్టిగా బలోపేతం చేసేందుకు, 'మెటా' ఇకపై పిల్లల భద్రతా విషయాలను నేరుగా I 4C నిర్వహించే సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నివేదిస్తుంది'అని అధికార ప్రతినిధి తెలిపారు.అమెరికాలో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న 'మెటా', భారతీయ చట్ట అమలు సంస్థలకు నేరుగా సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కట్టుబడిన మొట్టమొదటి ప్రధాన టెక్ మధ్యవర్తి సంస్థ. ఇప్పటివరకు, 'మెటా' పిల్లల భద్రతకు సంబంధించిన కేసులను అమెరికాలోని 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ 'కు నివేదిస్తూ వచ్చింది. మంగళవారం పిల్లల భద్రతకు సంబంధించిన విషయాలను సంబంధిత చట్ట అమలు సంస్థలకు వినేదించడానికి 'మెటా' అంగీకరించిందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. భారతదేశంలో పనిచేస్తున్న ఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌కైనా పిల్లల ఆన్‌లైన భద్రత ఒక 'ప్రాథమిక సూత్రం' అని, దానిపై ఎట్టిపరిస్థితుల్లోనూ 'బేరసారాలు' ఉండవని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆన్‌లైన్‌లో పిల్లల భద్రతను నిర్ధారించడానికి చురుకైన చర్యలు తీసుకోని ప్లాట్‌ఫారమ్‌లపై ప్రభుత్వమే చర్యలు తీసుకుంటుందని, హానికరమైన కంటెంట్, కార్యకలాపాల నుంచి మైనర్లను రక్షించడానికి ప్లాట్‌ఫారమ్‌ల బాధ్యతపై తన కఠినవైఖరిని నొక్కిచెబుతూ వర్గాలు తెలిపాయి.అటువంటి కంటెంట్‌ను చురుకుగా గుర్తించి, తొలగించేలా చూసేందుకు ప్రభుత్వం ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లతో కూడా సంప్రదింపులు జరుపుతోందని ఆ వర్గాలు జోడించాయి. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం..పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులను చట్ట అమలు సంస్థలకు నివేదిస్తామని 'మెటా' చేసిన వాగ్దానం ఒక మొదటి అడుగు. పిల్లలకు ప్లాట్‌ఫారమ్‌లను మరింత సురక్షితంగా మార్చడంతో పాటు, ఇంకా ఎన్నో చేయాల్సి ఉంది. హానికరమైన కంటెంట్‌ను అరికట్టడానికి ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.అన్ని ప్లాట్‌ఫారమ్‌లు అటువంటి కంటెంట్‌ను ముందుగానే గుర్తించి, తొలగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. బాలల లైంగిక వేధింపుల మెటీరియల్, డీప్ ఫేక్‌లతో సహా హానికరమైన చట్ట విరుద్ధమైన ఆన్‌లైన్ కంటెంట్‌పై ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిఘాను ముమ్మరం చేసింది. ఇటువంటి కంటెంట్‌లను నిర్వహించడంలో 'మెటా' వ్యవహరించిన తీరుపై ఆ సంస్థకు నోటీసులు జారీచేయడంతో పాటు, ఇటీవల ఆ కంపెనీ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్‌లను భారతదేశానికి పిలిపించింది.హానికరమైన కంటెంట్‌ను వేగంగా తొలగించాలని, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, జవాబుదారీతనం పెంచాలని ప్లాట్‌ఫారమ్‌లపై కేంద్రం ఒత్తిడి తెచ్చింది. భారత చట్టాలను పాటించడంలో విఫలమైతే సహించబోమని హెచ్చరించింది.జులైలో, ఇన్‌స్టాగ్రామ్‌ల చెల్లింపుల ప్రకటనలో బాలల లైంగిక దోపిడీ, దుర్వినియోగ సామగ్రి (సిఎస్‌ఇఎఎం) సంబంధించి ప్రభుత్వం 'మెటా'కు నోటీసు జారీ చేసింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఇఐటివై), సిఎస్‌ఇఎఎంను ప్రోత్సహించే, దాని ప్రాప్యతను సులభతరం చేసే అన్ని ప్రకటనలు, కంటెంట్‌ను నిలిపివేయాలని ఇన్‌స్టాగ్రామ్‌ను ఆదేశించి, వివరణాత్మక వివరణ కోరింది. దీనితర్వాత , మెటా ఉన్నతాధికారులతో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపింది. ఈ చర్చల్లో ఐటి మంత్రిత్వ శాఖ అటువంటి కంటెంట్ ఉల్లంఘన కిందకు వస్తుందని, దానికి సేఫ్ హార్బర్ రక్షణ వర్తించదని స్పష్టం చేసింది.




## గర్భాన్ని కొనసాగించాలని అత్యాచార
# బాధితురాలిని బలవంతం చేయొద్దు

> అది ఆమె గౌరవించే హక్కును దెబ్బతీయడమే
>
> ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** అత్యాచార బాధితురాలు గర్భం దాల్చడంపై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రేప్ కారణంగా గర్భం దాల్చిన బాధితురాలిని ఆ గర్భాన్ని కొనసాగించమని బలవంతం చేయడమనేది ఆమె గౌరవంగా జీవించే హక్కును తీవ్రంగా దెబ్బతీయడమే అవుతుందని అభిప్రాయపడింది. బాధితురాలి ఇష్టానికి వ్యతిరేకంగా మాతృత్వ బాధ్యతను ఆమెపై మోపడం సరికాదని పేర్కొంది. 30 వారాలు దాటిన తన గర్భాన్ని తొలగించుకోవడానికి అనుమతి కోరుతూ 15 ఏళ్ల అత్యాచార బాధితురాలి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధితురాలు తన గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఇదొక దురదృష్టకరమైన, బాధాకరమైన కేసు. బాధితురాలి గర్భం దాల్చిన కాలం చట్టపరమైన పరిమితిని దాటిందన్న వాస్తవాన్ని మాత్రమే విడిగా చూడలేం. అత్యాచారం కారణంగా గర్భం దాల్చిన బాధితురాలిని ఆ గర్భాన్ని కొనసాగించమని బలవంతం చేయడం, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా మాతృత్వ బాధ్యతను మోపడమనేది గౌరవంగా జీవించే ఆమె హక్కుకు తీవ్రమైన భంగం కలిగించడమే అవుతుంది. ఒక మహిళకు తన శరీరంపై ఉన్న హక్కుల్లో తాను తల్లి కావాలనుకుంటుందా? లేదా? అని నిర్ణయించుకునే హక్కు కూడా తప్పనిసరిగా ఉంటుంది. అత్యాచారం కారణంగా గర్భం దాల్చిన బాధితురాలిని ప్రసవించమని బలవంతం చేయడం ఆమెను మరింత దీర్ఘకాలిక శారీరక, మానసిక క్షోభకు గురిచేయవచ్చు' అని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. గర్భం దాల్చి ఎక్కువ వారాలు అయ్యిందనే ఒకే ఒక్క కారణంతో మైనర్ బాలికకు తన శారీరక స్వేచ్ఛ, గౌరవం, పునరుత్పత్తికి సంబంధించిన ఎంపిక హక్కులను నిరాకరించలేమని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అదే సమయంలో ఏ వైద్య ప్రక్రియ అయినా తప్పనిసరిగా అత్యాచార బాధితురాలి శారీరక దృఢత్వం, వైద్యపరమైన సాధ్యత అంచనాకు, అవసరమైన అన్ని రక్షణ చర్యలకు లోబడి ఉండాలని అభిప్రాయపడింది. అత్యాచారం వల్ల గర్భం దాల్చిన ఇటువంటి కేసులు బాధితులకు తీరని వేదనను మిగులుస్తాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. పిటిషనర్ కేవలం 15 ఏళ్ల బాలిక అని, ఆమె ఇప్పటికే ఘోరమైన లైంగిక దాడికి గురై తీవ్ర మానసిక వేదనను అనుభవించిందని నొక్కి చెప్పింది. అంతేకాకుండా బాధితురాలు తన తల్లిదండ్రులిద్దరినీ కోల్పోవడం వల్ల మరింత దుర్భర స్థితిలో ఉందని చెప్పింది.

**బాధితురాలి మానసిన వేదనను ఓ ఉత్తర్వు తొలగించలేదు**

'రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద విచారణ జరిపేటప్పుడు న్యాయస్థానం ఎంటిసి చట్టం కింద ఉన్న శాసనపరమైన నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటూనే, మైనర్ గర్భవతి ప్రయోజనాలకు, సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. తల్లిదండ్రుల సంరక్షణలో క్షేమంగా, గౌరవంగా పెరగాల్సిన వయసులో బాధితురాలు ఎవరూ ఎదుర్కోకూడని పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. చట్టం పరిష్కారాలు, విధానాలను అందించవచ్చు. కానీ ఆ బాలిక అనుభవించిన మానసిక వేదనను ఏ కోర్టు ఉత్తర్వు కూడా తొలగించలేదు. అయితే అత్యంత దుర్భరమైన ఈ సమయంలో బాధితురాలికి సంరక్షణ, గౌరవం, చట్టపరమైన రక్షణ లభించేలా చూడటం మాత్రం కోర్టు చేయగల పని' అని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. మరోవైపు, 30 వారాలు దాటిన తన గర్భాన్ని తొలగించుకోవడానికి 15 ఏళ్ల అత్యాచార బాధితురాలు చేసిన విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు అంగీకరించింది. బాధితురాలి గర్భస్రావ ప్రక్రియను వీలైనంత త్వరగా చేపట్టేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రక్రియకు సంబంధించిన రికార్డును నిర్వహించాలని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్, ఎస్‌కె ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. అత్యాచారానికి సంబంధించి నమోదైన ఈ క్రిమినల్ కేసులో డిఎన్ఎ గుర్తింపు, ఇతర అవసరాల కోసం కణజాలం లేదా పిండ పదార్థాన్ని భద్రపరచాలని వైద్యులకు సూచించింది. బాధితురాలి గర్భస్రావ ప్రక్రియ, మందులు, పరీక్షలు, ఆసుపత్రి ఖర్చులు, ఆహారం, ఇతర అనుబంధ వైద్య అవసరాలు సహా అన్ని ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఆదేశించింది.

## లేడీ బైకర్‌ను ఢీకొన్న కేసులో నిందితుడు అరెస్టు

**న్యూఢిల్లీ :** గురుగ్రామ్‌లో బైక్‌పై వెళ్తున్న ఓ మహిళ రైడర్‌ను.. కారుతో ఓ వ్యక్తి ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఆ కేసులో నిందితుడు, కారు డ్రైవర్ కళ్యాణ్ బైన్స్వాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని దౌసాలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. సిసిటివి దృశ్యాల ఆధారంగా గురుగ్రామ్ పోలీసులు ఈ కేసులో చర్యలు తీసుకున్నారు. నిందిత డ్రైవర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. గురుగ్రామ్‌లో ఆదివారం గోల్ఫ్ కోర్సు రోడ్డులో ఓ తెలుపు రంగు సెడాన్ కారు .. బైక్ నడుపుతున్న రైడర్ సియాను ఢీకొట్టింది. కారు ఢీకొన్న తర్వాత ఆ లేడీ బైకర్ కింద పడిపోయింది. ఏప్రిల్లా ఆర్ఎస్ 457 స్పోర్ట్స్ బైక్‌లో వెళ్తున్న సియాను కారు డ్రైవర్ కళ్యాణ్ వెంబడించి మరీ ఢీకొట్టాడు. కారు, బైక్ ఢీకొన్న సిసిటివి దృశ్యాలు వైరల్ అయ్యాయి. రాజ్‌ఘర్‌లో నిందిత కారు డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు గురుగ్రామ్ సిపి సిబాశ్ కబిరాజ్ తెలిపారు. బిఎన్ఎస్ సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. గోల్ఫ్ కోర్సు రోడ్డుపై మహిళా బైకర్‌ను కారు ఢీకొట్టిన ఘటనను సుమోటోగా స్వీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. సెక్టార్56 పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ చేశారు. లోతైన దర్యాప్తు, సిసిటివి ఫుటేజీ విశ్లేషణ తర్వాత హత్యాయత్నం కేసు బుక్ చేసినట్లు పోలీసులు చెప్పారు. దక్షిణ ఢిల్లీలోని కాల్‌కాజీలో ఉన్న బాధితురాలి ఇంటిని పోలీసు అధికారి మనోజ్ కుమార్ విజిట్ చేశారు. లేడీ బైకర్‌ను ఢీకొట్టిన ఘటనకు చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమయంలో.. సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ పసికట్టినట్లు అధికారి చెప్పారు. కారులో ఉన్న వ్యక్తి తనను వెంబడించాడని, చేతులతో బెదిరింపు సంకేతాలు చేశాడని, పారిపోవడానికి ముందు కారుతో టూవీలర్‌ను ఢీకొట్టినట్లు బాధితురాలు సియా తెలిపింది.

## సహాయక, రక్షణ చర్యలను
# అత్యంత వేగంగా చేపట్టండి

### బిహార్ ప్రభుత్వానికి రాహుల్‌గాంధీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** బిహార్‌లో భారీ వరదలు సంభవించిన నేపథ్యంలో సహాయక, రక్షణ చర్యలను అత్యంత వేగంగా చేపట్టాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం ప్రభుత్వం, యంత్రాంగాన్ని కోరారు. అలాగే బాధితులకు వీలైనంత త్వరగా అత్యవసర సహాయం అందేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు వచ్చి బాధితులకు సాధ్యమైనంత సహాయం అందించాలని కూడా పిలుపునిచ్చారు. బిహార్‌లో సంభవించిన భారీ వరదల వల్ల ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరమని, ఈ విపత్తులో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. ఈ విషాదం బారిన పడిన వారందరికీ సంఘీభావం వ్యక్తం చేస్తున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు.

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇప్పటికే ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్న నదుల నీటిమట్టం మరింత పెరగడంతో, బిహార్‌లోని 15 జిల్లాల్లో దాదాపు 50 లక్షల మంది ప్రజలు వరదల బారిన పడ్డారని అధికారులు సోమవారం తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఇప్పటివరకు రాష్ట్రంలో 112.7 మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది సాధారణం కంటే సుమారు ఆరు శాతం ఎక్కువ అని స్థానిక వాతావరణ శాఖ కార్యాలయం పేర్కొంది. నేపాల్ నుండి బిహార్‌లోకి ప్రవహించే నదుల పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు, భారీ వర్షపాతం కారణంగా అనేక నదులు, వాగులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయని ఒక అధికారి తెలిపారు. విపత్తు నిర్వహణ శాఖ ప్రకారం, 15 జిల్లాల్లో 49.67 లక్షల మంది ప్రజలు వరదల వల్ల ప్రభావితమయ్యారు. వరద ప్రభావిత జిల్లాల్లో పాట్నా, భోజ్‌పూర్, సరన్, వైశాలి, భాగల్‌పూర్, బేగుసరాయ్, బక్సర్, సమస్తిపూర్, ముంగేర్, కతిహార్, లఖీసరాయ్, ఖగారియా, పూర్నియా, మాధేపురా. అరారియా ఉన్నాయి.


## 2047 దార్శనికతకు...
# రక్షణ రంగమే 'మూలస్తంభం'

> కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆశాభావం

**న్యూఢిల్లీ :** భవిష్యత్తు యుద్ధాలలో సాంకేతిక ఆధిక్యతే వ్యూహాత్మక ప్రయోజనాన్ని నిర్ణయిస్తుందని, 'ఈనాటి మన ఊహలే , రేపటి సైనిక సామర్థ్యాలుగా మారతాయి' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం అన్నారు. ఇక్కడ డిఆర్‌డిఓ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, 2047 నాటికి 'వికసిత్ భారత్' దార్శనికత కేవలం ఆర్థికంగా బలమైన భారతదేశాన్ని నిర్మించడం మాత్రమే కాదని, సాంకేతికంగా స్వయం సమృది, సామిజిక సమ్మిళితం, పర్యావరణ సుస్థిరం, వ్యూహాత్మకంగా సురక్షితమైన భారతదేశాన్ని నిర్మించడమేనని ఆయన అన్నారు. ఈ దార్శనికతకు రక్షణ రంగమే 'మూలస్తంభం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. '2047 సంవత్సరం నాటికి కీలక సాంకేతికతలలో మనం స్వావలంభన సాధించాలి. స్వదేశీ పరిజ్ఞానాన్ని గణనీయంగా పెంచుకోవాలి. రక్షణ రంగ ఎగుమతులలో అనేక రెట్లు వృద్ధిని సాధించాలి. అలాగే ప్రపంచ సరఫరా గొలుసులో భారతదేశానికి సంబంధించి బలమైన ఉనికిని నిర్ధారించుకోవాలి' అని ఆయన చెప్పారు. సహకారం లేకుండా ఇవన్నీ సాధించలేమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ రంగంలోని భాగస్వాములందరి మధ్య మరింత భాగస్వామ్యం ఉండాలని రక్షణమంత్రి ఆకాంక్షించారు. డిఆర్‌డిఓ పరిశ్రమల సమన్వయ సమావేశం—'విమర్శ 2026' ఇక్కడ డిఆర్‌డిఓ భవన్‌లో నిర్వహించబడింది. డిఆర్‌డిఓ, పరిశ్రమల మధ్య భాగస్వామ్యం కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా పరిశోధన, అభివృద్ధి పరీక్షలు, ధృవీకరణ, మొత్తం తయారీ విలువ గొలుసు వరకూ విస్తరించాలని సింగ్ అన్నారు. పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లను కూడా విలువ గొలుసులో అంతర్భాగం చేయాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ముఖ్యంగా కృత్రిమ మేధ, డ్రోన్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, సాంకేతిక ఆవిష్కరణలను వేగవంతం చేయాలని ఈ రంగాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. 'ఈ రోజుల్లో 80వ దశకానికి సంబంధించినదిగా కనిపించే చిత్రాన్ని రూపొందించడానికి కృత్రిమ మేధ (ఎఇ)ని ఎలా ఉపయోగించవచ్చో మనం చూస్తున్నాం. 40–50 ఏళ్ల తర్వాత భవిష్యత్తులో ఎలా ఉంటుందో ఒక చిత్రాన్ని ప్రదర్శించగలిగినప్పుడు అది నిజమైన ఆనందం' అని సింగ్ చెప్పారు.

# దొడ్డిదారిన యుసిసి అమలు చేయొద్దు

- బిల్లు ఆమోదానికి సంఖ్యాబలం ఉంటే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి
- కేవలం కొన్ని రాష్ట్రాల ద్వారా అమలుకు యత్నించొద్దు
- జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్ :** యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి) బిల్లును ఆమోదించడానికి అవసరమైన సంఖ్యాబలం ఉంటే బిజెపి దానిని పార్లమెంటులో ప్రవేశపెట్టాలని, కేవలం కొన్ని రాష్ట్రాల ద్వారా అమలు చేయడానికి ప్రయత్నించకూడదని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. మీ దగ్గర సంఖ్యాబలం ఉంటే, దానిని పార్లమెంటుకు తీసుకురండి. వివిధ రాష్ట్రాల ద్వారా ఎందుకు చేస్తున్నారు అని ప్రశ్నించారు. పైగా, వారి సొంత కూటమి (ఎన్‌డిఎ)లో కూడా దీనిపై అందరికీ ఏకాభిప్రాయం లేదన్నారు. బిహార్‌ల జనతాదళ్ (యునైటెడ్) దీనిని వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో అమల చేసేందుకు అనుమతించబోమని స్పష్టం చేసినట్లు వార్తలొస్తున్నాయన్నారు. దొడ్డిదారిన యుసిసిని తీసుకురావద్దని బిజెపిపై అబ్దుల్లా మండిపడ్డారు. సొంత మిత్రపక్షాలే దీనికి అనుకూలంగా లేనప్పుడు, పార్లమెంటులో దీనిని ఆమోదింపజేయగలరని తాను అనుకోనని, బహుశా అందుకే వారు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారేమో అని అబ్దుల్లా పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపి అధికారంలో లేదు కాబట్టి, కేవలం బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రమే యుసిసిని అమలు చేస్తే అది సార్వత్రికం కాదని అబ్దుల్లా అన్నారు. 'దేశమంతా బిజెపి పాలిత ప్రాంతం కాదు. ఆ పార్టీ అధికారంలో లేని అనేక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. కాబట్టి, కేవలం బిజెపి రాష్ట్రాల్లోనే దీనిని అమలు చేస్తే, అది సార్వత్రిక చట్టం అనిపించుకోదు. ఇలాంటి స్వభావం కలిగిన అంశాలపై నిర్ణయం వ్యక్తిగత రాష్ట్రాలు తీసుకోకూడదు; దేశం మొత్తం కలిసి నిర్ణయం తీసుకోవాలి. దేశానికి ప్రాతినిధ్యం వహించే వేదిక రాష్ట్రాలు కాదు, పార్లమెంటు' అని ఆయన అన్నారు. తాము గొప్పగా ప్రచారం చేసుకున్న కొన్ని కీలక చట్టాలను బిజెపి పార్లమెంటులో ప్రవేశపెట్టలేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. 'ఇప్పటివరకు వారు మాట్లాడిన చట్టాలు 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' కావచ్చు లేదా రిజర్వేషన్ల అంశం కావచ్చు, వాటిని వారు పార్లమెంటుకు తీసుకురాలేదు. ఇప్పుడు దీని విషయంలో కూడా, రాష్ట్రాల ద్వారా తీసుకురావాలని మాట్లాడుతున్నారు' అని ఆయన అన్నారు. వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) వెంబడి ఉద్రిక్తతల తగ్గింపు చర్యలపై స్పందిస్తూ, అది స్వాగతించదగిన పరిణామమని అబ్దుల్లా అన్నారు. 'నియంత్రణ రేఖ (ఎల్ఓసి) లేదా వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) వద్ద ఉద్రిక్తతలను తగ్గించే ఏ చర్య అయినా మంచిదే. ముఖ్యంగా ఆ ప్రాంతాలకు దగ్గరగా నివసించే ప్రజలకు ఇది ఎంతో మేలు చేస్తుంది; ఎల్ఓసి లేదా ఎల్ఎసి సమీపంలో నివసించడం ఎంత కష్టమో మనకు తెలుసు. అదేవిధంగా, కాలక్రమేణా నియంత్రణ రేఖ వెంబడి కూడా పరిస్థితులు మెరుగుపడతాయని మేము ఆశిస్తున్నాము' అని ఆయన అన్నారు. భారత విదేశాంగ విధానాన్ని చైనా ప్రశంసించడంపై అబ్దుల్లా స్పందిస్తూ, న్యూఢిల్లీ విదేశాంగ విధానం ఎప్పుడూ స్వతంత్రంగానే ఉందని, ఇతర దేశాల ఆమోదం లేదా ధృవీకరణ కోరాల్సిన అవసరం లేదని అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిని బ్రిక్స్ సదస్సు ఖండించడం భారత విదేశాంగ విధానం సాధించిన విజయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆ సమావేశ గదిలో పాకిస్థాన్ మిత్రదేశాలు ఎన్ని ఉన్నాయో ఒకసారి గమనించండని, పహల్గామ్ పేరును ప్రస్తావించడం కూడా మన విదేశాంగ విధానం సాధించిన విజయమే అని ఆయన అన్నారు.

## చెత్త విక్రయం ద్వారా రూ. 5 వేల కోట్లు ఆదాయం

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా, గత ఐదేళ్లలో పనికి రాని సామాగ్రి (స్క్రాప్) విక్రయం ద్వారా రూ. 5,100 కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని కేంద్రం మంగళవారం తెలిపింది. ఈ కార్యక్రమాలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ 'స్వచ్ఛత'ను ఒక విధానంగా లేదా అలవాటుగా మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 2021 నుండి జరిగిన ఐదు వార్షిక కార్యక్రమాలు, నెలవారీ సచివాలయ సంస్కరణల పర్యవేక్షణ (జులై 2026 వరకు) ద్వారా 24.20 లక్షలకు పైగా ప్రదేశాలను పరిశీలించారు, 180.48 లక్షలకు పైగా ఫైళ్లను తొలగించడం లేదా మూసివేయడం జరిగింది, అలాగే స్క్రాప్ విక్రయం ద్వారా రూ. 5,102.91 కోట్ల ఆదాయం సమకూరింది. కేవలం 'క్యాంపెయిన్ 5'లోనే 11.6 లక్షల ప్రదేశాలను పరిశీలించడం, 29.52 లక్షల ఫైళ్లను తొలగించడం, 233.75 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని ఖాళీ చేయడం, స్క్రాప్ విక్రయం ద్వారా సుమారు రూ. 833.92 కోట్లు ఆర్జించడం జరిగిందని ఆ ప్రకటన పేర్కొంది. అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31 వరకు జరగనున్న 'క్యాంపెయిన్ 6' పురోగతిని పర్యవేక్షించడానికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ఒక ఆన్‌లైన్ పోర్టల్‌ను పారంభించనున్నారు. దీనికి ముందు సెప్టెంబర్ 16 నుండి సెప్టెంబర్ 30 వరకు సన్నాహక దశ ఉంటుంది. ఈ సన్నాహక దశలో, వివిధ మంత్రిత్వ శాఖలు మరియు విభాగాలు ఎంపిక చేసిన విభాగాలలో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించడం, క్షేత్రస్థాయి సిబ్బందిని సమీకరించడం, కార్యక్రమ ప్రదేశాలను ఖరారు చేయడం, రికార్డులను సమీక్షించడం, అలాగే స్థల నిర్వహణ ప్రణాళిక, గుర్తించిన స్క్రాప్ తొలగింపు వంటి చర్యలను చేపడతాయి. డిసెంబర్ 19 నుండి డిసెంబర్ 25 వరకు జరిగే 'సుపరిపాలన వారోత్సవాల' సందర్భంగా ఉత్తమ విధానాలను ప్రదర్శిస్తారు. బుధవారం నాటి కార్యక్రమంలో, కేంద్రంలోని మొత్తం 84 మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన 'క్యాంపెయిన్ 6' నోడల్ అధికారులు, ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారులు, అప్పీలేట్ అధికారుల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎఆర్‌పిజి), తపాలా, బొగ్గు, గనులు, పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగాల కార్యదర్శులు ప్రసంగిస్తారని ఆ ప్రకటన తెలిపింది. 'స్వచ్ఛత'ను సంస్థాగతం చేయడానికి, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌ను తగ్గించడానికి ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రచారాలను సమన్వయం చేయడానికి, నడిపించడానికి డిఎఆర్‌పిజి నోడల్ విభాగంగా పనిచేస్తుంది.

## ధరాపురం నుంచి లక్ష్మణన్
## మదురాంతకం నుంచి పి. సుగంధి

- తమిళనాడు 'ఉప' ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించిన వామపక్షాలు
- 'పంచముఖ పోటీ' తో రసవత్తరం

**చెన్నై :** తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ ఉప ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఆ రాష్ట్రంలో, అక్టోబరు 6న అసెంబ్లీ ఉప ఎన్నికలు జరగబోతున్నాయి. మంగళవారం మదురాంతకం, ధరాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు వామపక్షాలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో అక్టోబరు 6న జరుగనున్న శాసనసభ ఉప ఎన్నికల్లో పంచముఖ పోటీ నెలకొననుంది. వామపక్షాలైన సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీల నిర్ణయం ఉప ఎన్నికల పోరాటాన్ని అత్యంత ఉత్కంఠభరితమైన, ఆసక్తికరంగా గమనించే పోటీగా మార్చేసింది. ఈ పార్టీలు బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ ఒకప్పటి మిత్రపక్షమైన ద్రవిడ మున్నేట్ర కజగం(డిఎంకె), అధికార తమిళగ వెట్రి కజగం (టివికె)తో ఈ పార్టీలు తలపడనున్నాయి. ఆసక్తికరంగా, మే నెలలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే ఏఐడిఎంకె నుంచి ఫిరాయించి టివికెలో చేరిన మాజీ ఎమ్మెల్యే మరకతం కుమారవేల్, పి.సత్యభామల పేర్లను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం ప్రకటించింది. ఎస్‌సిలకు రిజర్వ్ చేయబడిన రెండు నియోజకవర్గాలలో తమ బలాన్ని పరీక్షించుకోవడానికి టివికె, డిఎంకె, ఏఐడిఎంకెలకు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు తమ కూటమి నుంచి విడిపోయి, స్వతంత్రంగా పోటీచేయడం, బ్యాలెట్ కోసం జరిగే పోరాటాన్ని మరింత ఆసక్తికరంగా మారుస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.సాంప్రదాయ ఎన్నికల కూటముల నుంచి విడిపోయి, స్వతంత్ర వామపక్ష కూటమిగా పోటీ చేస్తామని సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు ప్రకటించాయి. రెండు సీట్లలో వామపక్ష పార్టీలు చెరొక స్థానం నుంచి తమ పార్టీ అభ్యర్థులను ఉప ఎన్నికల బరిలోకి దించుతున్నాయి. ధరాపురం (ఎస్‌సి) అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థిగా సిపిఐ తన అభ్యర్థిగా లక్ష్మణన్‌ను నామినేట్ చేయగా, మదురాంతకం (ఎస్‌సి) స్థానం నుంచి సిపిఐ(ఎం) తన అభ్యర్థిని పి.సుగంధి పేరును ప్రకటించింది. మదురాంతకంలో నటుడు–రాజకీయవేత్త సీమాన్ యొక్క నామ్ తమిళర్ కచ్చి (ఎన్‌టికె) అభ్యర్థులు కె.జానకి రామన్ (మదురాంతకం), ఎం.కార్తీకను ధరాపురం నుంచి బరిలోకి దించడంతో ఉప ఎన్నికల పోటీ ఐదుగురు అభ్యర్థుల మధ్య పంచముఖ పోటీగా మారనుంది. తమ ఎన్నికల బలాన్ని ప్రదర్శించుకోవాలనే ఆకాంక్ష నుంచే ఈ ఉప ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీచేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు వామపక్ష నాయకులు తెలిపారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24 2368 | Mohammad Rehana | JOHN DEERE 5310 HARVESTER | 2016 |
| 2 | TS36G 0823 | Raju Satla | JOHN DEERE 5310 HARVESTER | 2020 |
| 3 | TG24A 6727 | Yadamma Reddaboina | EICHER 551 PRIMA G3 | 2025 |
| 4 | TS23F 6985 | Ganesh Kumar Rasamatla | JOHN DEERE W70 COMBINE HARVESTER | 2021 |
| 5 | TS19T 3598 | Srinu Alluri | SONALIKA DI 47 RX | 2018 |
| 6 | TS24T 2282 | Lunavath Padma | SWARAJ 843 XM | 2017 |
| 7 | TG24B 4566 | Raju Kumar Bhukya | SONALIKA DI 35 | 2025 |
| 8 | TS03UB 0208 | Praveen Vajja | TATA ACE MEGA | 2015 |
| 9 | TS21T 0125 | Ande Nagaraju | TATA ZEST DIESEL - P | 2016 |

AUCTION DATE : 19-09-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No:4-61/A/1, 1st floor, Above More Super Market, Beside Jayalaxmi Center Narsampet 506132 Cell : 9000230006 & 9652764787

# ఎఐ భద్రతపై భయాలన్నీ బూటకం

• రాడికల్ లెఫ్ట్ దుష్ప్రచారంగా కొట్టిపారేసిన ట్రంప్ • చైనా ముందజతో అమెరికాలో భయాలు:నిపుణులు

**వాషింగ్టన్:**ఎ.ఐ భద్రతపై ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న భయాలన్నీ 'వట్టి బూటకం''అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొట్టిపారేశారు. ఒక తెలివైన అధ్యక్షుడే ఎఐకి ఒక రక్షణ కవచంగా ఉంటారని తనను తాను ప్రముఖంగా హైలైట్ చేసుకునే ప్రయత్నం చేశారు. ఎఐ విస్తృతిపై పెరుగుతున్న భయాలను ట్రంప్ నవంబరులో అమెరికాలో జరిగే ద్వైవార్షిక ఎన్నికలకు ముడిపెట్టారు.ఈ భయాలన్నీ రాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్లు ప్రచారం చేస్తున్నారని ట్రంప్ విరుచుకుపడ్డారు. రాబోయేకాలంలో అమెరికాలో కమ్యూనిస్టులు,రాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్ల వల్ల పెద్ద ప్రమాదం ముంచుకువస్తుందని ట్రంప్ ఇటీవలికాలలో పలుసార్లు వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రతిపక్షంగా ఉన్న డెమోక్రటిక్‌పార్టీలో కమ్యూనిస్టులు ప్రాబల్యస్థానంలో ఉన్నారని ట్రంప్ విమర్శలు చేస్తున్నారు. ఎఐపై వస్తున్న భయాలను 'గ్లోబల్ వార్మింగ్' స్కామ్‌తో ఆయన పోల్చారు. ఈ స్కామ్‌ను డెమొక్రాట్స్‌లో ఉన్న రాడికల్ లెఫ్ట్ విభాగం ప్రచారం చేస్తోందన్నారు.ఎఐ, డేటా సెంటర్లకు వ్యతిరేకంగా ఒక నీచమైన కుట్ర జరుగుతోందని, ఈ విషయంలో చైనా దేశమే చాలా సంతోషంగా ఉందని ఆరోపించారు.ఐతే దీనిపై చైనా నిపుణులు కూడా తీవ్రంగా స్పందించారు. కృత్రిమ మేధ విషయంలో చైనా ముందంజలో ఉండటంతో అమెరికాలో భయాలు పెరిగాయని విమర్శించారు. ''చైనా ఒక పెద్ద పోటీదారుగా మారిందని వారికి(అమెరికాకు) తెలుసు,ఎఐపై నిబంధనలు కఠినతరం చేసినా,అభివృద్ధిని మందగింపజేసినాగానీ చైనా వారిని అధిగమించగలదని వారికి తెలుసుఅందుకే ఆందోళన చెందుతున్నారు'' అని ఫుడాన్ విశ్వవిద్యాలయంలో అమెరికా వ్యవహారాల అధ్యయన ప్రొఫెసర్ జిన్‌కి యాంగ్ చైనా అధికార పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థను కృత్రిమ మేధ తన అధీనంలోకి తెచ్చుకుంటుందని, దీనివల్ల మానవ వాళి సమీప భవిష్యత్తులోనే అంతరించిపోయే ప్రమాదం ఉందని వస్తున్న భయాలపై ట్రంప్ పైవిధంగా స్పందించారు.ఎఐ రోజు రోజుకూ ఖచ్చితంగా బలపడుతోందని, దీనివల్ల మానవాళి అంతంకాకుండా ''ఒక ఎఐ కిల్ స్విచ్'' ఉండాలని, దీనిని తృతీయపక్షం నిర్వహించాలని ఎఐ దిగ్గజం ''ఆంత్రోపిక్స్'' సహవ్యవస్థాపకుడు జాక్ క్లార్క్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.ఎఐ సాఫ్ట్‌వేర్ ప్రమాదకరంగా మారితే అనేక మార్గాలున్నాయని,దీనికి చట్టసభ సభ్యులు పూనుకోవాలన్నారు. ఆ తర్వాత సర్వత్రా అనేక వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ భయాలకు ముగింపుగా ట్రంప్ స్పందించారు.ఈ ఆధునిక సాంకేతికత మానవాళి అంతానికి దారితీస్తుందని ఎఐ సంస్థలలో పనిచేసే పలువురు అధికారులు,ఉద్యోగులు,పరిశోధకులు హెచ్చరికలు చేసిన తర్వాత జాక్ కిర్క్ ఎఐను అ ంతం చేసేందుకు ''ఒక కిల్ స్విచ్'' ఉండాలని ప్రతిపాదించారు. రాబోయేకాలమంతా ఎఐదే కావడంతో, ఇటీవలికాలంలో ఉద్యోగుల లే ఆఫ్‌లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఎఐ సంస్థల వేగంలో మందగమనం రాబోయేకాలంలో ఉంటుందని పెట్టుబడిదారులు అంచనాలు వేసిన తర్వాత టెక్ సంస్థల షేర్లు అమ్మకాలకు దారితీశాయి.

**భయంతో ఆంత్రోపిక్స్ ఉద్యోగి రాజీనామా**

పరిశోధనల్లో స్పీడును అడ్డుకోకపోతే సమీప భవిష్యత్తులోనే మానవాళి అంతరించిపోయే ప్రమాదం ఉందని ఎ.ఐ సంస్థ పరిశోధకుడు, ''ఆంత్రోపిక్'' సంస్థ మాజీ ఉద్యోగి జాకబ్ కాక్సన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భయంతో ఆంత్రోపిక్స్‌కు రాజీనామా చేశారు. మానవాళి భవిష్యత్తు గురించి ఎఐ ఉద్యోగులు భయపడుతున్నారని అన్నారు. ఎఐ పరిశోధనల్లో హోరాహోరీగా జరుగుతున్న అంతర్జాతీయ పోటీని నిలిపివేయాలన్నారు. ఈ విషయంలో చైనాతో ఒక సమన్వయపూర్వకంగా ఉండాలన్నారు. ''ఆంత్రోపిక్స్ ఉద్యోగులు పూర్తిగా భయపడుతున్నారు,ఎఐ ఫలితాలపట్ల వారు భయాందోళనతో ఉన్నారు,చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారు అని ''సండే విత్ లారా కున్స్‌బెర్గ్'' కార్యక్రమంలో జాకబ్ కాక్సన్ చెప్పారు.ఈ పరిశోధనల సమయంలో భద్రతాపరమైన ఆందోళనలు తీవ్రంగా పెరుగుతున్నాయి.దీంతో ఆయన భయపడి తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆ వార్త వైరల్‌గా మారింది.ఎఐ పరిశోధనలు చేసేటప్పుడు అది చూపిస్తున్నవేగాన్ని చూసి ఉద్యోగులు తీవ్రంగా భయపడుతున్నారన్నది ఒక వాస్తవమని, ఎ.ఐ పరిశోధనలను,వాటి స్పీడును అడ్డుకోకపోతే సమీప భవిష్యత్తులో మానవాళి అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.ఎ.ఐ ఒక సూపర్ కంప్యూటర్‌లాగా పనిచేస్తూ, మానవాళి ప్రమేయం లేకుండానే యావత్ ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థను తన నియంత్రణలోకి తీసుకోగల శక్తిసామర్థ్యాలను చాట్ బాట్ల సమూహం సమకూర్చుకుంటుందని డారియో ఆమోడెయ్ హెచ్చరించారు.

# సుప్రీంకోర్టులో ట్రంప్‌నకు ఎదురు దెబ్బ

**వాషింగ్టన్:**ఆన్‌ఓటింగ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నవంబరు ఎన్నికలకు ముందుగానే మెయిల్ ద్వారా జరిగే ఓటింగ్‌ను పరిమితం చేయాలన్న ట్రంప్ ప్రణాళికను అమెరికా సుప్రీంకోర్టు తిరస్కరించింది.కొత్త నిబంధనలతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందుకు వెళ్లకుండా అమెరికా పోస్టల్ సర్వీసెస్‌ను నిరోధిస్తూ ఫెడరల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వును సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది.ఐతే ఈ విషయంలో ఇదే తుది తీర్పు కాదు. ఈ కేసులో ఒక న్యాయమూర్తి కిందికోర్టు ఉత్తర్వును సమర్థించారు. వివాదం కొనసాగుతోంది.ఈ నిబంధనలు ఎన్నికల మోసాలను అరికడతాయని ట్రంప్ వాదిస్తున్నారు.ఓటర్ల జాబితాలో ఉన్న వారికి మాత్రమే బ్యాలెట్లు అందజేయాలని పోస్టల్ సర్వీసెస్‌ను ఆదేశిస్తూ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వును కోర్టు తిరస్కరించింది. ట్రంప్ ఉత్తర్వు రాష్ట్రాలకు ఉన్న రాజ్యాంగ హక్కును ఉల్లంఘిస్తోందని కోర్టులో సవాలు చేసిన పిటిషనర్లు వాదించారు. ఐతే ట్రంప్‌కు వ్యతిరేకంగా సవాలు చేసినవారి విజయం తాత్కాలికమైనది, పోస్టల్ సర్వీసెస్‌కు విస్తారమైన అధికారాలు ఉన్నాయని సంప్రదాయవాదులైన న్యాయమూర్తులు పేర్కొన్నారు.రెండోసారి వైట్‌హౌస్‌లో అధికారం చేపట్టినప్పటినుండీ ట్రంప్ మెయిల్ ఓటింగ్‌ను నియంత్రించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.విస్తృతమైన ఎన్నికల మోసం కారణంగానే 2020 ఎన్నికల్లో తాను ఓబడిపోయానని గతంలో ట్రంప్ తప్పుడు ఆరోపణలు చేశారు.



# జెన్ జెడ్–జెన్ ఆల్ఫా తరాలు దేశ నాయకత్వ బాధ్యతలు మోయాలి

## ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పిలుపు

**చెన్నై:**జనరేషన్ జెడ్ (యువతరం),జనరేషన్ ఆల్ఫా (బాలల తరం) తరాలే దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అన్నారు.వారే దేశ నాయకత్వాన్ని స్వీకరించి,బాధ్యతలు భుజాన మోయాలని పిలుపు ఇచ్చారు. చెన్నైలో డాక్టర్ ఎంజిఆర్ ఎడ్యుకేషనల్–రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 36వ వార్షికోత్సవంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ,''దేశం మాకు ఏం ఇచ్చిందని ప్రశ్నించడానికి బదులుగా,దేశానికి మనం ఏం చేయగలం'' అని ప్రశ్నించుకోవాలని,యువ గ్రాడ్యుయేట్లు దేశాన్ని ప్రథమస్థానంలో నిలబెట్టే బాధ్యతలు తీసుకోవాలని కోరారు.''మీరు ముందు నిలబడండి,నాయకత్వం వహించండి,బాధ్యతలు తీసుకోండి,దేశాన్ని ప్రథమస్థానంలో నిలబెట్టండి,దేశం సురక్షితంగా,బలంగా ఉంటేనే మనకు ఒక నివాసం,ఒక ఇల్లు ఉంటుంది అని గుర్తుంచుకోవాలి''అన్నారు. అనేక దేశాలలో ప్రజలు తమ తమ భూభాగాల నుండి వెళ్ళిపోయి నిరాశ్రయులవుతున్న తీవ్ర పరిస్థితులను గుర్తుచేశారు. తమిళనాడులో అత్యంత పురాతనమైన ప్రసిద్ధ గ్రంథం ''తిరుక్కురళ్''లో ఉన్న పద్యాలను నిర్మలాసీతారామన్ ఉటంకిస్తూ, విద్య గొప్ప శాశ్వత సంపద అనీ,ప్రణాళికాబద్ధమైన చర్యలు పాటించాలన్నారు. విద్యార్థులు,యువతరం అహకారం విడిచిపెట్టాలని,వినయ విధేయతలతో మెలగాలని,మేం బాధితులం అని భావించకుండా సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కోవాలని హితవు చెప్పారు. ''మిమ్మల్ని జనరేషన్ జెడ్ అని పిలిచినా,జనరేషన్ అల్ఫా అని పిలిచినాగానీ మీరే చెప్పే విషయాలన్నింటిని వినడానికి భారతదేశం సిద్ధంగా ఉంది, ఐతే మీ చుట్టూ ఏం జరుగుతోందనే విషయాన్ని మీరు ప్రతిబింబించాలి,మీ పాత్ర ఏమిటో తెలుసుకోవాలి,మీ ద్వారా దేశం సాధించాల్సింది ఏమిటి అనే విషయాలను మీరు గ్రహించాలి'' అని మంత్రి చెప్పారు. దేశానికి మనం ఏం చేశాం అనే ప్రముఖ నినాదాన్ని ఆమె బాగా అర్థమయ్యేలా చెప్పేందుకు ప్రయత్నించారు.దేశం ఆర్థిక ఒడిదొడుకులను తట్టుకుని నిలబడేస్థాయిలో ఉందని నిర్మలాసీతారామన్ ప్రముఖంగా చెబుతూ, పశ్చిమాసియాలో యుద్ధం,ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు, సరఫరా వ్యవస్థల్లో తీవ్ర ఆటంకాలు ఏర్పడినప్పటికీ,దేశం ఆర్థికంగా స్థిరంగా నిలబడిందని చెప్పారు. దేశం 7.8 శాతం వృద్ధిరేటు సాధించిందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో బలమైన రాజకీయ నాయకత్వం ద్వారా మాత్రమే ఈ స్థిరత్వాన్ని దేశం సాధించగలిగిందని చెప్పారు.

# వచ్చేనెల 27న ఇజ్రాయెల్ ఎన్నికలు



**జెరూసలెం:**వచ్చేనెల 27వ తేదీన ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో 38 పార్టీలు పోటీ చేస్తున్నాయి. ఈ పార్టీలు ఇప్పటికే తమ తమ అభ్యర్థుల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాయి. వామపక్ష డెమొక్రటిక్‌పార్టీ ఎన్నికల సంఘానికి మితవాదుల అరాచకాలపై ఫిర్యాదు చేసింది. మితవాదులు దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్నారని, దేశం ప్రజాస్వామ్య విధానాలు పాటిస్తోందని విస్మరించారని, జాత్యాహంకారాన్ని ప్రోత్సహిస్తున్నారని, వారిని ఎన్నికలకు దూరంగా ఉంచాలని కోరింది.ఇటామర్ బెన్‌గ్విర్‌కు చెందిన పచ్చిమితవాద ఓట్జ్మా ఎహుదిత్ ప్యానెల్‌ను ఎన్నికల బరి నుండి నిషేధించాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా అధికార లికుడ్‌పార్టీ అగ్రశ్రేణి 30 మంది అభ్యర్థులలో కేవలం నలగురు మహిళలను మాత్రమే పోటీకి నిలబెట్టింది. ఈ క్షణంలో ఎన్నికలు జరిగితే నెతన్యాహూ వ్యతిరేక కూటమి అధికారంలోకి వస్తుందని పోల్ సర్వేలు ప్రకటించాయి. 120 స్థానాలున్న పార్లమెంటు కెన్సెట్‌లో 61 సీట్లు గెలుచుకున్న పార్టీ,లేదా కూటమి అధికారం చెలాయిస్తుంది.ఇంతకుముందు 2022 నవంబరు 1వ తేదీన జరిగిన ఎన్నికల్లో నెతన్యాహూ నాయకత్వంలో ఆరు పార్టీల మితవాద కూటమి అధికారపగ్గాలు చేపట్టింది.

# ఉక్రేన్–రష్యా అంగీకారం: ట్రంప్

ఇంధన వనరులపై దాడులు లేకుండా

• వీళ్ళవల్లే చమురు ధరలు పెరిగాయ్



**వాషింగ్టన్:**ఇంధన వనరులపై దాడులు చేసుకోకూడదని రష్యా–ఉక్రేన్ దేశాలు ఒక అంగీకారానికి వచ్చాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరు దేశాలు ఈ మేరకు ఒక అంగీకారానికి వచ్చాయని ఆయన చెప్పినప్పటికీ, ఎప్పటినుండీ ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది? ఎంతకాలం దీనిని ఈ రెండు దేశాలు వర్తింపజేస్తాయి? వంటి వివరాలు మాత్రం ఆయన తెలియజేయలేదు.రష్యా ఇంధన సదుపాయాలపై దాడులు చేయకూడదని ఉక్రేన్ అంగీకరించిందని ఒక సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు.అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల పెరుగుదల ఇరాన్ యుద్ధంవల్ల జరగలేదని, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం కారణంగానే ముడి చమురు ధరలు పెరిగాయని ట్రంప్ నిస్సిగ్గుగా ప్రకటించారు. ముడి చమురు ధరల పెరుగుదలకు ఇరాన్‌లో యుద్ధానికి ఎలాంటి సంబంధం లేదని ట్రంప్ చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. నవంబరులో అమెరికాలో జరిగే ద్వైవార్షిక ఎన్నికలు పూర్తయ్యేవరకూ చమురు ధరలు తగ్గబోవని, ఇదేవిధంగా కొనసాగుతాయని ట్రంప్ ప్రకటించిన మూడు రోజులకే మాటమార్చి ఈ ధరల పెరుగుదలను రష్యా–ఉక్రేన్ యుద్ధానికి ఆపాదించారు. కాగా, తమ ఇంధన మౌలిక సదుపాయాలపై ఉక్రేన్ దాడులు చేయబోదని ట్రంప్ చేసిన ప్రకటనను రష్యా స్వాగతించింది. క్రెమ్లిన్ ప్రతినిధి దిమ్మిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌పై ప్రభావం చూపించగల దేశాలు మరింత సౌలభ్యం కోసం ఆ దేశాన్ని ప్రోత్సహించాలన్నారు.ఉక్రేన్ కీలక మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేయాలని తమ మిత్రదేశాలు రష్యా నుండి హామీ పొందితే తాము కూడా ఇంధన వనరులపై దాడులు నిలిపివేస్తామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తొలుత వ్యాఖ్యానించారు.

**222 డ్రోన్లు ధ్వంసం చేసిన రష్యా**

రష్యాపై రాత్రికిరాత్రే వందల డ్రోన్లతో ఉక్రేన్ దాడులు చేసింది.మంగళవారం తెల్లవారకముందే జరిగిన ఈ దాడులలో 222 డ్రోన్లను రష్యా వైమానిక దళం ధ్వంసం చేసిందని టాస్ వార్తాసంస్థ పేర్కొంది.ఈ దాడులవల్ల సమారా ప్రాంతంలో అనేక నివాసిత భవనాలు,పారిశ్రామిక సముదాయం ధ్వంసమయ్యాయి. దీనికి అదనంగా క్షిపణి దాడుల్లో రోస్టోవ్ ప్రాంతంలోని టాగన్‌రోగ్‌లో ఓజోన్ కంపెనీకి,వ్యవసాయ సంస్థలకు చెందిన గిడ్డంగులతోపాటు నివాసిత భవనాలు,ఒక విద్యాసంస్థ భవనం కూడా దెబ్బతిన్నాయి.తొమ్మిది జిల్లాలలో 30కిపైగా డ్రోన్లు,క్షిపణులను రష్యా దళాలు ధ్వంసం చేశాయని ఆ ప్రాంత గవర్నర్ యూరీ స్లూసర్ చెప్పారు.

# 'చేయూత' దరఖాస్తులకు నేటి సాయంత్రం వరకు గడువు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**'చేయూత నూతన పెన్షన్ల' దరఖాస్తు గడువు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం 5 గంటల వరకు పొడిగించింది. వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చిన నేపథ్యంలో మరో రోజు గడువు పొడగించినట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం వెల్లడించారు.చేయూత పెన్షన్ కోసం ఇప్పటి వరకు 5.78 లక్షల దరఖాస్తులు అందాయి. షెడ్యూల్ ప్రకారం మంగళవారంతో గడువు ముగిసింది. బుధవారం సాయంత్రం వరకు గడువు పెంచినట్టు జిల్లా అధికారులకు ఎస్ ఇఆర్ పి సిఇఒ దివ్య దేవరాజన్ ఆదేశాలు జారీ చేశారు.

# ఎప్పుడూ సిద్ధమే

(మొదటి పేజీ తరువాయి)

వామపక్ష ప్రజాతంత్ర ఐక్య వేదిక నేత జస్టిస్ బి.చంద్రకుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సిపిఐ రాష్ట్ర న్యాయకత్వంతో సమావేశమైంది. సమావేశంలో పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్‌పాషా పాల్గొన్నారు. ఈసందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ వామపక్ష పార్టీల ఐక్య ఉద్యమ కార్యచరణతో పాటు ఎన్నికల్లో ఒకే గుర్తుపై పోటీ చేసే రోజులు రావాలని ఎప్పటి నుంచో సిపిఐ కోరుకుంటున్నదని చెప్పారు. కూనంనేనిసాంబశివ రావు మాట్లాడుతూ ఇప్పటికే అనేక వేదికల ద్వారా కమ్యూనిస్టులంతా ఐక్యం కావాలని, కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమై ఎర్రకోటపై అరుణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపును ఇచ్చామని అన్నారు. కమ్యూనిస్టుల ఐక్య కార్యాచరణతో పాటు ఐక్యమయ్యేందుకు సిపిఐ ఎప్పుడూ సిద్ధమేనని తెలిపారు. వామపక్ష పార్టీలన్ని ఐక్య కార్యాచరణతో ముందుకు సాగుతాయని, ఎన్నికల సమయంలో మాత్రం కలిసి పోటీ చేయలేక పోతున్నాయన్నారు. వామపక్షాలు ఏకం కావాలని వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక లక్ష్యానికి అనుగుణంగా సిపిఐ అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తుందని ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. సమావేశంలో వామపక్ష ప్రజా తంత్ర ఐక్య వేదిక నాయకులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫామ్‌హౌస్ శుద్ధీకరణ ఘటనలో ఏడుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/ సిద్ధిపేట :** ఎర్రవల్లి ఫామ్‌హౌస్ శుద్ధీకరణ పేరిట దళితులను అవమానించిన ఘటనలో వరదరాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఏడు మందిని ఒదితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మహమ్మద్ యూసుఫ్ అలీ తెలిపారు. ఈనెల 8న మర్కూక్ మండలం వరదారాజ్ జంక్షన్ శుద్ధీకరణ పేరుతో పసుపు నీటిని చల్లిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఘటనకు సంబంధించిన సాక్షుల వాంగ్మూలాలు, ఫోటోలు, వీడియో దృశ్యాలు, ఇతర అందుబాటులో ఆధారాలను పరిశీలించిన ఆనంతరం ఘటనలో పాల్గొన్నట్లు గుర్తించిన వరదరాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఏడుగురు నిందితు లు అప్పాల ప్రవీణ్, రెడ్డబోయిన అమరేందర్, శ్రీపతి రాజు, ముచ్చపతి హి మవంత్, అంతని ఐలయ్య, అరికేల రాజు, అంతని మల్లేశ్‌ను ఈనెల 14న సోమవారం తెల్లవారు జామున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో అ దుపులోకి తీసుకొని , ఆనంతరం అరెస్టు చేసి గజ్వేల్ న్యాయస్థానంలో హా జరుపర్చినట్లు తెలిపారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# పునరుద్ధరించాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని సిఎం తెలిపారు. ఇందుకోసం సింగపూర్ కంపెనీ మా స్టర్ ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా ఏ ర్పాటు చేస్తామని, దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సిఎం వెల్లడించారు.

**మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి**

మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురికావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సిఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశ జిడిపిలో తెలంగాణ వాటా ప్రస్తుతం 2.5 శాతం ఉందని, దాన్ని 10 శాతానికి పెంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5కు సిఎం తెలిపారు. సమ్మిట్‌కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–5 సిఎం ఆహ్వానించారు. సమ్మిట్‌లో 100కు పైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటారని, వ్యాపార అవకాశాల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని సిఎం వివరించారు.

# చెల్లింపు ఛార్జీలు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించే సమయంలో కూడా ఇదే విధానం వర్తిస్తుంది. పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ ఛార్జీలను ఖరారు చేసింది. అక్టోబరు 15వ తేదీ నుండి ఈ ఛార్జీలు అమలులోకి వస్తాయని ఎన్.పి.సి.ఐ తెలియజేసింది. వ్యక్తులమధ్య జరిగే సాధారణ బదిలీలకు ఈ ఎండిఆర్ నుండి పూర్తిగా మినహాయింపు ఉంది.అదేవిధంగా రోజువారీ వ్యవస్థలో కోట్లాదిమంది ప్రజలు ఈ యుపిఐని ఉపయోగిస్తూ ఉన్నందువల్ల చాలా జాగ్రత్తగా ఈ విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు పేమెంట్ కార్పొరేషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రూ.2000 లోపు యుపిఐ ద్వారా ఎలాంటి లావాదేవీలు చేసినా చార్జీలు వర్తించవు. రూ.2000 దాటి లావాదేవీలు చేస్తే వ్యాపారులు సంబంధిత బ్యాంకులకు రూ.12లు చెల్లించాలి. రూ.50 వేలు గనుక మర్చంట్‌కు వినియోగదారుల నుండి చెల్లింపులు జరిగితే సదరు బ్యాంకులకు వ్యాపారులు రూ.200లు, రూ.75000 లు లేదా అంతకంటే ఎక్కువ చెల్లిస్తే నికరంగా రూ.300లు వ్యాపారులు ఎండిఆర్ ఇవ్వాలి. చిరువ్యాపారులకు పూర్తిగా మినహాయింపు అమలులో ఉంటుంది. ఎందుకంటే వినియోగదారుల నుండి చిరువ్యాపారులకు సాధారణంగా 95 శాతం చెల్లింపులు రూ.2000 లోపే ఉండటంవల్ల వారికి ఎలాంటి ఎండిఆర్ ఛార్జీలు వర్తించవు.మ్యూచ్యువల్ ఫండ్స్,సెక్యూరిటీస్,స్టాక్ బ్రోకర్లు,డీలర్లకు గరిష్టంగా 0.02 శాతం ఎండిఆర్ వసూలు చేస్తారు. అంటే గరిష్టస్థాయిలో వారు రూ.200లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుం ది. రైల్వే, టెలికాం, బీమా, ఇంధనం,వ్యవసాయ ఉపకరణాలకు సంబంధించిన ఎండిఆర్ రూ.2000లు దాటితే ఐదు రూపాయలు చెల్లించాలి. ప్రభుత్వపరంగా విద్యుత్, నీరు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా బిల్లులకు కూడా పేమెంటు రూ .2000లు దాటితే ఐదు రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

# పరిచేందుకేనా?

(మొదటి పేజీ తరువాయి)

విధించేందుకు మోదీ ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని మంగళవారం ఎక్స్‌లో రాహుల్ గాంధీ పోస్టు చేశారు. 'ఇప్పుడు, రూ. 2,000 పైబడిన మర్చంట్ యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ విధించవచ్చు. ఈ లావాదేవీలు మొత్తం లావాదేవీల పరిమాణంలో కేవలం 5 శాతం ఉన్నప్పటికీ, అవి యుపిఐ మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి' అని రాహుల్ అన్నారు. వినియోగదారుల నుండి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోందని, కానీ దుకాణదారులపై విధించే రుసుములు చివరికి ఎక్కడి నుంచి వస్తాయి? ధరలకు అదనంగా, నేరుగా వినియోగదారుడి జేబులో నుంచి అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. భారతదేశం జీరోఎండిఆర్ విధానాన్ని అమెరికన్ చెల్లింపుల కంపెనీలు చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నాయని రాహుల్‌గాంధీ అన్నారు. ఇప్పుడు, మోదీ ప్రభుత్వం సరిగ్గా అదే దిశలో విధానాన్ని మార్చడానికి మార్గం సుగమం చేసిందని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో మాదిరిగానే, రాజీపడిన ప్రధాని మోదీ మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోతున్నారు అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. ప్రభుత్వం మరోసారి పూర్తి నిజాయితీ, పారదర్శకత లోపాన్ని ప్రదర్శించి, వినియోగదారుల నమ్మకాన్ని దెబ్బ తీసిందని కాంగ్రెస్ ఆరోపించింది. రూ. 2,000 వరకు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) లావాదేవీలపై లేదా రూపే డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులపై ఛార్జీలు విధించవద్దని బ్యాంకులు, చెల్లింపుల వ్యవస్థ ప్రొవైడర్లను ప్రభుత్వం ఆదేశించిన తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే, రూ. 2,000 కంటే ఎక్కువ లావాదేవీలపై ఛార్జీలు వర్తిస్తాయా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయలేదు, ఈ ఛార్జీలను వ్యాపారులే చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు, మొత్తం ఎంత ఉన్నప్పటికీ యుపిఐ లావాదేవీలపై ఎటువంటి ఛార్జీ విధించబడలేదు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందిస్తూ 'ఆగస్టు 6, 2026న మేము హెచ్చరించినట్లే, ఆర్థిక మంత్రి స్వయంగా స్పందించారు, ఇప్పుడు మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేసిన కొత్త చట్టాలను ఉపయోగించి యుపిఐకి ఛార్జీలు విధించే ప్రక్రియను ప్రారంభిస్తోంది. సవరించిన చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం, 2007 కింద ఇప్పుడే ఒక నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఇది బ్యాంకులు, ప్రొవైడర్లు కేవలం రూ. 2000 లోపు యుపిఐ లావాదేవీలకు మాత్రమే ఛార్జీలు విధించకుండా నిషేధిస్తుంది. కానీ ఈ పరిమితికి మించిన ఏ లావాదేవీకి స్పష్టమైన రక్షణ లేదు అని రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. యుపిఐ లావాదేవీలకు మనమందరం రుసుము చెల్లించేలా స్పష్టంగా రంగం సిద్ధం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 14 నాటి గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం, రూ. 2,000 వరకు రూపే డెబిట్ కార్డ్ లేదా యుపిఐ లావాదేవీ ద్వారా చెల్లింపు చేసే లేదా స్వీకరించే వ్యక్తిపై ఏ బ్యాంకు లేదా సిస్టమ్ ప్రొవైడర్ అయినా ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి ఛార్జీ విధించరాదు.

# తొలి విడత సాయం

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం తొలి విడతగా రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, రూ.లక్షలోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతలో యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను కార్యాలయాల్లోనే స్వీకరించాలని, ఎంపిక ప్రక్రియను కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలు, గురుకులాల నిర్వహణ, విద్యా మౌలిక వసతులు, స్వయం ఉపాధి, స్కాలర్‌షిప్‌లు, స్టడీ సర్కిళ్లు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్న ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేసిందని, సంక్షేమ శాఖల కార్పొరేషన్ల ద్వారా యువతకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశ పెట్టే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. అవసరమైతే వివిధ కోర్సులను స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు అందించేలా పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతులపై కూడా సమావేశంలో చర్చించారు.

**గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు**

రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ఎస్‌సి రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిత్యం శుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్‌సి గురుకుల పాఠశాలల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆధునిక వంటశాలల నిర్వహణ, యంత్రాల కొనుగోలు కోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ.25 కోట్లను కేటాయించినట్లు గుర్తు చేశారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ఎస్‌సి రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటు ఏ విధంగా పూర్తి చేస్తారనే దానిపై పక్కా కార్యాచరణ, స్పష్టమైన ప్రణాళికతో తమ ముందుకు రావాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. పాఠశాలల్లో ఆధునిక వంటశాలల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు విద్యార్థుల భోజన వసతికి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అప్పటివరకు విద్యార్థులందరికీ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు వాడుతున్న కేంద్రీకృత యంత్రాల వంటశాలల నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్, రాష్ట్రంలోని వివిధ నివాస, సంక్షేమ విద్యాసంస్థల్లో పదేళ్ల నుండి చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత దశాబ్ద కాలంగా ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న అనంతరం విద్యార్థులు ఉన్నత చదువుల్లో స్థిరపడ్డారా? ప్రతిష్టాత్మక ఉద్యోగాలు సాధించారా? లేక ఆర్థిక, సామాజిక కారణాల వల్ల మధ్యలోనే చదువును ఆపేసి డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారా? ఈ విద్యాసంస్థలు అందించిన విద్య, వసతుల ద్వారా విద్యార్థుల జీవితాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి 'సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్' (సిఈఎస్ఎస్)తో అధ్యయనం చేయించి సమగ్ర నివేదికను తయారు చేయించాలని తెలిపారు. ఎస్‌సి స్టడీ సర్కిళ్లపై చేసిన వ్యయం, ఎంపికైన అభ్యర్థుల సంఖ్య, వారికి అందించిన శిక్షణ, సాధించిన ఫలితాలపై డిప్యూటీ సిఎం ఆరా తీశారు. స్టడీ సర్కిళ్ల ద్వారా వస్తున్న ఫలితాలు, పెట్టుబడికి అనుగుణంగా వస్తున్న ప్రయోజనాలపై వివరణాత్మక అంచనా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. స్టడీ సర్కిళ్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన కోచింగ్ అందించాలని సూచించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి విజయేంద్ర బోయి, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సంతోష్, ఎస్‌సి కార్పోరేషన్ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

# టి20 సిరీస్ టీమిండియా వశం



మూడు టి20ల సిరీస్‌లో జోరు చూపిస్తున్న భారత్.. వరసగా రెండో మ్యాచ్‌లోనూ అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో నితీశ్ రెడ్డి(3–35) బంతితో రాణించగా.. ఆపై ఓపెనర్లు అభిషేక్ శర్మ(39) సంజూ శాంసన్(57)లు దంచేశారు. అర్ధ శతకంతో విరుచుకుపడిన సంజూను రషీద్ ఖాన్ బోల్తా కొట్టించినా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్) సాయంతో ఇషాన్ కిషన్(38 నాటౌట్) లాంఛనం ముగించాడు. ఏడు వికెట్ల విజయంతో సిరీస్‌ను పట్టేసింది టీమిండియా. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్వాష్ నుంచి తేరుకున్న టీమిండియా స్వదేశంలో గర్జించింది. అఫ్గనిస్తాన్‌పై వరసగా రెండు విజయాలతో టీ20ల సిరీస్‌ను గెలుచుకుంది భారత్. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో నెగ్గిన అయ్యర్ సేన.. ఈసారి వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. 160 పరుగుల ఛేదనలో ఓపెనర్లు అభిషేక్ శర్మ(39), సంజూ శాంసన్(57) మెరుపు ఆరంభమిచ్చారు. రెండు ఓవర్లలోనే నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 47 రన్స్ పిండుకుందీ ద్వయం.
అభిషేక్ ఔటైనా.. తనమార్క్ షాట్లతో అలరించిన శాంసన్ అర్ధ శతకం బాదాడు. అయితే.. రషీద్ ఖాన్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించి సంజూ బౌండరీ వద్దనబీ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి రషీద్ ఓవర్లోనే శ్రేయాస్ అయ్యర్(11)ను డైవింగ్ స్లిప్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. ఇషాన్ కిషన్(38 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వలేదు. అప్పటికే విజయం ఖరారు కాగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ(15 నాటౌట్)తో కలిసి లాంఛనం పూర్తి చేశాడు ఇషాన్. 15వ ఓవర్లో బౌండరీతో జట్టును గెలిపించాడీ చిచ్చరపిడుగు. 7 వికెట్లతో జయభేరి మోగించిన మెన్ ఇన్ బ్లూ మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ పట్టేసింది. నామమాత్రమైన మూడో టీ20 సెప్టెంబర్ 17న జరుగనుంది. టాస్ ఓడిన అఫ్గనిస్థాన్‌కు మొదటి ఓవర్లోనే షాకిచ్చాడు అర్ష్‌దీప్ సింగ్. తొలి మ్యాచ్‌లో డకౌటైన ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్(0)ను అతడు సున్నాకే పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత నితీశ్ రెడ్డి(3–35) ఓవర్లో కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్(37)పెద్ద షాట్ ఆడి రవి బిష్ణోయ్ చేతికి చిక్కాడు. ధాటిగా ఆడుతున్న సెడీకుల్లా అటల్(12)ను రవి బిష్ణోయ్ ఔట్ చేయగా.. గుల్బదిన్(10), దార్విష్ రసూలీ(26)లు విఫలమయ్యారు. గత మ్యాచ్‌లో యాభై కొట్టిన అజ్మతుల్లా ఒమర్జాయ్(11)ను అక్షర్ వెనక్కి పంపాడు. అయితే.. మాజీ కెప్టెన్లు మొహమ్మద్ నబీ(20), రషీద్ ఖాన్(28)లు బాధ్యతగా ఆడారు. వీరిద్దరి పోరాటంతో కాబూలీ టీమ్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేయగలిగింది.

## స్పిన్ మ్యాజిక్‌తో 800 పాయింట్లు..

# భారత తొలి బౌలర్‌గా చరణి రికార్డు





మహిళల ఆసియా కప్‌లో వికెట్ల వేటతో రెచ్చిపోయిన శ్రీచరణి మరో ఘనత సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లతో చరిత్ర సృష్టించిందీ స్పిన్ సంచలనం. ఆ మధ్యే నంబర్ 1 టీ20 బౌలర్‌గా అవతరించిన ఈ తెలుగమ్మాయి తాజాగా 800 పాయింట్ల క్లబ్‌లో చేరింది. తద్వారా ఈ మైలురాయిని అందుకున్న టీమిండియా తొలి బౌలర్‌గా చరణి మరో రికార్డు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఆమె 804 రేటింగ్‌తో టాప్‌లో కొనసాగుతుండగా.. భారత్‌కే చెందిన ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 729 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఐసిసి మహిళల టి20 బౌలర్లలో అందరికంటే ముందున్న భారత స్పిన్నర్ శ్రీ చరణి తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇటీవల దుబాయ్లో ముగిసిన మహిళల ఆసియా కప్‌లో 12 వికెట్లతో సత్తా చాటిన ఈ తెలుగమ్మాయి 800 రేటింగ్ పాయింట్లు సాధించింది. ఫైనల్లో నాలుగు వికెట్లతో భారతజట్టు ఎనిమిదోసారి ఆసియా కప్ గెలుపొందడంలో కీలకమైన చరణి 804 పాయింట్లతో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. రెండో ర్యాంకర్ దీప్తి శర్మకు ఆమెకు 75 పాయింట్ల తేడా ఉంది.
ఏడాది క్రితం అంతర్జాతీయ క్రికెట్లో అరంగేట్రం చేసిన శ్రీ చరణి నంబర్ 1 ర్యాంక్ పట్టేసింది. నిలకడగా రాణిస్తున్న ఈ తెలుగమ్మాయి అంతర్జాతీయ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న పొట్టి వరల్డ్ కప్ లో తిప్పేసిన ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. 2025 జూన్ 28న ఇంగ్లంగ్‌తో మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్‌లో అడుగుపెట్టిన చరణి.. తన స్పిన్ మ్యాజిక్‌తో టీమిండియా విజయాల్లో కీలకవుతూనే.. వ్యక్తిగతంగా తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంది. గతేడాది స్వదేశంలో 14 వికెట్లతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలకమైందీ కడప బిడ్డ.

## మహిళ

### మహిళలు, పిల్లల పోషణకు అండగా

# ‘పోషణ్ మా 2026’



దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలు, కిశోరుల పోషణ, ఆరోగ్యం, సంరక్షణపై అవగాహన పెంచేందుకు కేంద్రం ప్రారంభించిన ‘రాష్ట్రీయ పోషణ్ మాహ్ 2026’ (నెలరోజుల పోషణ్) కార్యక్రమం మహిళలకు అనేక విధాలుగా ఉపయోగపడుతున్నది. ప్రయోగాత్మకంగా, సెప్టెంబర్‌లో నెలరోజుల పాటు కొనసాగిన కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాలను పోషణ, ఆరోగ్యం, సంరక్షణ, చిన్నారుల ప్రాథమిక విద్యకు ప్రధాన కేంద్రాలుగా బలోపేతం చేయడంపై దృష్టి సారించడం జరిగింది. ‘హమారీ అంగన్వాడీ, హమారీ జిమ్మేదారీ’ అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో దశలవారీగా కొనసాగుతుంది. ఒక్కో ప్రాంతంలో నెలరోజులు జరిగే ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో స్థానిక సమాజం భాగస్వామ్యాన్ని పెంచుతారు. ప్రతి కేంద్రంలో అంగన్వాడీ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి సేవల నాణ్యతను సమీక్షిస్తారు. తల్లుల కమిటీలు కూడా పిల్లలకు అందించే ఆహారం నాణ్యతను పర్యవేక్షించే అవకాశం లభిస్తుంది. రోజువారీ ఆహార మెనూ, లబ్ధిదారులకు అందాల్సిన పోషకాహార వివరాలను మెనూ బోర్డుల ద్వారా స్పష్టంగా ప్రదర్శిస్తారు. మహిళలకు ఈ కార్యక్రమం ప్రత్యేకంగా ప్రయోజనం చేకూర్చిన అంశాల్లో ప్రధానమైనది గర్భిణులు, బాలింతలకు అందే ప్రభుత్వ సహాయాన్ని విస్తరించడం. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా అర్హులైన గర్భిణులు, బాలింతలందరినీ పథకంలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. వారికి నేరుగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు వేగవంతం చేస్తున్నారు. దీంతో గర్భధారణ, ప్రసవానంతర దశలో మహిళలకు ఆర్థిక భరోసా లభించే అవకాశం పెరిగింది. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారంతో పాటు ప్రారంభదశలోనే అభివృద్ధి అవసరాలను గుర్తించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదల, అభివృద్ధి దశలను నమోదు చేసి, ప్రత్యేక జోక్యం అవసరమైన పిల్లలను త్వరగా వైద్య లేదా ఇతర సేవలకు పంపించే విధానం చేపట్టారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల కోసం తల్లిదండ్రులతో కలిసి విద్యా, ఆటల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లులకు పిల్లల పోషణ, ప్రారంభ విద్య, ఆరోగ్య సంరక్షణపై మరింత అవగాహన కలుగుతున్నది. సమాజం అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై బాధ్యత తీసుకోవడం వల్ల మహిళలు, పిల్లలకు అందే సేవల నాణ్యత మెరుగుపడే అవకాశం ఏర్పడింది. మొత్తం మీద ‘పోషణ్ మాహ్ 2026’ మహిళలను కేవలం పథకాల లబ్ధిదారులుగా చూడకుండా, కుటుంబ పోషణ మరియు బాలల ఆరోగ్య సంరక్షణలో కీలక భాగస్వాములుగా గుర్తించింది. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడం, గర్భిణులు, బాలింతలను ప్రభుత్వ సహాయంతో అనుసంధానించడం, పిల్లల ప్రారంభ అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా మహిళల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, తదుపరి తరాల పోషణకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతున్నది.

## నిర్ణయాల్లో మహిళల పాత్ర పెరగాలి



భారత సమాజంలో మహిళల పాత్ర గతంతో పోలిస్తే గణనీయంగా విస్తరించింది. కుటుంబ బాధ్యతలకే పరిమితమైన దృక్కోణం నుంచి బయటకు వచ్చి మహిళలు ప్రభుత్వ, ప్రైవేటు, సామాజిక, పరిపాలనా, రాజకీయ రంగాల్లో నాయకత్వ బాధ్యతలు చేపడుతున్నారు. దేశ నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. శాసన సభలు, పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కానున్న నేపథ్యంలో భవిష్యత్తులో వారి ప్రాతినిధ్యం ఆ పరిమితిని కూడా దాటే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సంఖ్య పెరగడం కంటే నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మహిళలకు నిజమైన భాగస్వామ్యం లభించడం మరింత ముఖ్యమైన అంశం. మహిళలను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే చూడకుండా, విధానాలను రూపొందించే వ్యక్తులుగా చూడాల్సిన అవసరం ఉంది.
పరిపాలనా రంగంలోనూ మహిళల ప్రాతినిధ్యం పెరుగుతోంది. గతంలో ఐఎఎస్, ఐపిఎస్, అటవీ సేవలు వంటి రంగాల్లో మహిళల నాయకత్వం పరిమితంగా ఉండేది. ఇప్పుడు అనేక కీలక బాధ్యతల్లో మహిళలు ముందుకు వస్తున్నారు. రాబోయే దశాబ్దంలో ప్రభుత్వ సంస్థలు, రాష్ట్రాలు, జాతీయ స్థాయి వ్యవస్థల్లో మహిళల నాయకత్వం మరింత పెరిగే అవకాశం ఉంది. మహిళల పాలనా భాగస్వామ్యం పెరిగితే దాని ప్రభావం కేవలం మహిళలకు సంబంధించిన అంశాలకే పరిమితం కాదు. విద్య, ఆరోగ్యం, ఆర్థికవ్యవస్థ, సాంకేతికత, పర్యావరణం, మౌలిక వసతులు, డిజిటల్ భద్రత, సుపరిపాలన వంటి విస్తృత అంశాలపై మహిళల అనుభవాలు, ఆలోచనలు విధాన నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ప్రజాస్వామ్యంలో చర్చ, అనుభవాల పంచుకోవడం, భిన్న దృక్కోణాలకు స్థానం కల్పించడం ద్వారా మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అందుకే మహిళల రాజకీయ సామర్థ్యాన్ని పెంచే శిక్షణ, విధాన అవగాహన, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరగాలి. మహిళల సాధికారత అంటే వారికి అవకాశాలు కల్పించడం మాత్రమే కాదు. ఆ అవకాశాలను ఉపయోగించుకుని వారు విధానాలను రూపొందించే స్థాయికి చేరడం. రాబోయే కాలంలో మహిళల నాయకత్వం పెరగడం భారత ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా, సమానత్వంతో కూడినదిగా మార్చే కీలక పరిణామంగా నిలుస్తుంది.

# నాటి రైతాంగ సాయుధ పోరాట ఫలితమే నేటి తెలంగాణ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

### ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు



హుస్నాబాద్‌లో...

**ప్రజాపక్షం/హుస్నాబాద్** : నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఆమరుల పోరాట ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రం అని, వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హుస్నాబాద్ సిపిఐ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్, హన్మకొండ, జిల్లాల కార్యదర్శలు పంజాల శ్రీనివాస్, కర్రె బిక్షపతి, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారాయణ, సిరిసిల్ల కార్యదర్శి మంద సుదర్శన్, నాయకులు ఆందే స్వామి, కోహెడ సృజన్‌కుమార్, బోయిని ఆశోక్, నాగెల్లి లక్ష్మ రెడ్డి, ఆదిరి రమేశ్, ఆందే ఆశోక్, వుల్పుల శ్రీనివాస్, బోనగిరి రూపేశ్, లంక దాసరి కళ్యాన్, న్యాల రాజు, బత్తుల బాబు, గూడ పద్మ, జనగాం రాజ్‌కుమార్, పిట్టల మొగిలి, ప్రసాదు, మౌటం బాలయ్య, సుధాకర్, ఐలేని మల్లారెడ్డి, నర్సింహచారి పాల్గొన్నారు.
**ఖమ్మం అర్బన్** : వీర తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని, బిజెపి చరిత్రను వక్రీకరించాలని చూస్తే ఊరుకునేది లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు తెలిపారు. సెప్టెంబర్ 17న సాయుధ పోరాట దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ రజబ్ అలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు యర్రాబాబు, పగడాల మల్లేష్, బోడా వీరన్న, ప్రొద్దుటూరి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ జులా వెంకటేశ్వర్లు, బానోత్ నాగేశ్వరరావు, నాదెండ్ల పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, గుగులోత్ హరి, గుండ్ల అశోక్, యరగొర్ల మధు, గాడిచర్ల సత్యనారాయణ, వార్డు సభ్యులు ఉల్లేబోయిన విష్ణుమూర్తి, కాళంగి చిన్న పిచ్చయ్య, అల్లు చిన్న వెంకటరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.
**పెద్దపల్లి** : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్ చౌరస్తాలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభ సిపిఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోషిక మోహన్ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ అధ్యక్షతన జరిగిన సభలో తాళ్లపల్లి మల్లయ్య, కార్పొరేటర్ మార్క్కాపూర్ సూర్య, మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, ఆసాల రమ, రేణుకుంట్ల ప్రీతం, ఆసాల నవీన్, పడాల కనక రాజు, బూడిద మల్లేష్, అబ్దుల్ కరీం, శనిగరపు తిరుమల, దుబాసి రేణుక, సుధీర్, గుంపుల కుమారస్వామి, కె.జగన్, జైపాల్‌రెడ్డి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.
**తుంగతుర్తి** : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగం మరువలేనిదని సిపిఐ సూర్యపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెంపటి, అన్నారంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దాయం రాజారెడ్డి, దొంగరి ముత్తిలింగం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాయం రాజిరెడ్డి మనవరాలు దాయం ఝాన్సీ, నాయకులు ఎల్లెంల యాదగిరి, బూర వెంకటేశ్వర్లు, నందూరి కరుణ కుమారి, గుగులోతు రాజారాం, ఎడెల్లి శ్రీకాంత్, వెంపటి సర్పంచ్ తప్పెట్ల ఎల్లయ్య, పాల్వాయి పున్నయ్య, నారాయణ, మల్లేష్, మురళి పాల్గొన్నారు.
**ఖానాపూర్** : తెలంగాణ రైతాంగ మహత్తర సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరించడం ద్రోహమని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని కొమురం భీం విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పిల్లి రమేష్, నాయకులు గంగన్న, గోవింద్ స్వామి, నర్సయ్య, హన్మంత్, తదితరులు పాల్గొన్నారు.
**కల్వకుర్తి** : కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్, నాయకులు పులిజాల పరుశురాములు, గడ్డం శ్రీనివాసులు, ప్రేమ్‌కుమార్, సంతోష్, దేశం సైదులు, అమీర్, శివ, మహేష్, పరుశురాం గౌడ్, వెంకటయ్య, నాగరాజు, అంజినాయక్ పాల్గొన్నారు.
**మందమర్రి** : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మందమర్రి బస్టాండ్ వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్, భీమనాదుని సుదర్శన్, వనం సత్యనారాయణ, కామెర దుర్గా రాజ్, తాళ్లపల్లి వీరయ్య, రొడ్డ నరేష్, ఎగేటి రాజేశ్వరరావు, ఆంతోని దినేష్, సాధనవేణి ప్రభాకర్, రేఖ, మంజుల, రెంటాల శ్యామ్, జూలవేణి మోహన్ తదితరులు పాల్గొన్నారు.
**మునుగోడు** : నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో సాయుధ పోరాట అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, గోసుకొండ లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నర్సింహ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి వెంకటేశ్వర్లు, నాయకులు చాపల శ్రీను, బొమ్మరబోయిన లాలయ్య, సురిగి చలపతి, చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య, మాదగోని సత్తమ్మ, దుబ్బ వెంకన్న, వనం వెంకన్న, ఆనగంటి నర్సింహ, గోస్కొండ మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.
**జనగామ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, పోరాట యోధుడు నల్ల నరసింహులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, నాయకులు ఆదిసాయన్న, ఆకుల శ్రీనివాస్, సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, రావుల సదానందం, మోటె శ్రీశైలం, చామకూర యాకూబ్, భూమల్ల ఐలయ్య, పుప్పాల ఐలయ్య, సుదర్శన్, నగేష్, గుగులోతు సఖి, కందుకూరి మల్లేశం, గుండెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.
**షాద్‌నగర్** : షాద్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సభలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సర్పంచ్ ఎం.శ్రీను నాయక్, నాయకులు టి.నర్సింహ్మారెడ్డి, ఎండి షకిల్, గోవింద్ నాయక్, ఎం.పవన్, ఆకాష్, మహ్మద్ హుస్సేన్, ప్రసాద్, మల్లేష్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో...



ఖమ్మంలో...



పెద్దపల్లిలో...




జనగాంలో...



నల్లగొండ..మునుగోడులో...



రంగారెడ్డిలో...



సూర్యాపేట..తుంగతుర్తిలో...



మంచిర్యాలలో...




నిర్మల్‌లో...

# నగర శివార్లలోనే బస్సుల 'బిగ్ స్టాప్'!

- నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్.. అక్కడి నుంచే సిటీ కనెక్టివిటీ
- 2,200 ఎలక్ట్రిక్ బస్సులతో లాస్ట్‌మైల్ అనుసంధానం..
- ట్రాఫిక్, కాలుష్య నియంత్రణే లక్ష్యం: మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. నగరంలోకి వచ్చే దూరప్రాంత, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోనే నిలిపివేసి.. అక్కడి నుంచి సిటీ బస్సులు, మెట్రో, ఎంఎంటిఎస్ ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గాజులరామారం, శంషాబాద్, ఎల్‌బినగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో టెర్మినల్స్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి నగరంలోకి ప్రవేశించే అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను ఆయా దిశల్లో ఏర్పాటు చేసే టెర్మినల్స్ వరకే పరిమితం చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. దీనివల్ల నగరంలోని ప్రధాన రహదారులపై దూరప్రాంత బస్సుల రాకపోకలు తగ్గి ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు.

### టెర్మినల్స్ నుంచే 'లాస్ట్‌మైల్' కనెక్టివిటీ..

టెర్మినల్స్‌కు చేరుకున్న ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్‌టిసి బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటిఎస్ సేవలను అనుసంధానం చేయనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. టెర్మినల్స్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులో ఉండేలా రూట్లను రూపొందిస్తామన్నారు. నగరంలో ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో రోడ్లపైకి రావడం వల్ల ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత టెర్మినల్స్ నుంచే నిర్వహించే విధానాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అవసరమైన నిబంధనల మేరకు యూజర్ ఛార్జీలు వసూలు చేసి టెర్మినల్స్‌ను వినియోగించే విధానంపై కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు.

### గాజులరామారంలో 100.. శంషాబాద్‌లో 150 ఎకరాలు..


భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బస్ టెర్మినల్స్‌ను విస్తృత స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గాజులరామారం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ వైపు సుమారు 150 ఎకరాల భూమిని టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాలతో ఆధునిక టెర్మినల్స్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. టెర్మినల్స్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు ప్రయాణికులు సులభంగా చేరుకునేలా ఈ బస్సులకు రూట్లు రూపొందించనున్నట్లు చెప్పారు. టెర్మినల్ ఆధారిత రవాణా వ్యవస్థతో నగరంలోకి వచ్చే బస్సుల సంఖ్యను నియంత్రించడంతో పాటు ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రజా రవాణా మార్గాలను అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. హైదరాబాద్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని మంత్రి తెలిపారు. నగర శివార్లలోనే దూరప్రాంత బస్సులను నిలిపి, అక్కడి నుంచి సిటీ బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్ ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం వల్ల ట్రాఫిక్ రద్దీతో పాటు వాహన కాలుష్యం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను మరింత సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

# సిఎం రేవంత్‌రెడ్డితో గ్యాప్ లేదు

**టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు, గొడవలు లేవని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ పత్రికల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. టిపిసిసి అధ్యక్షులుగా రెండేళ్ల సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పార్టీలో అభిప్రాయ భేదాలు సహజమేనని, అభిప్రాయ భేదాలు వచ్చినా అదే రోజు సాయంత్రానికే పరిష్కరించుకున్నామని చెప్పారు. పార్టీ విషయంలో సిఎం ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని తెలిపారు. టిపిసిసి అధ్యక్షుడిగా తన రెండేళ్ల ప్రయాణం విజయవంతంగా పూర్తైందని, పదవిని బాధ్యతగా, సంతృప్తిగా నిర్వహించానని చెప్పారు. కార్యకర్తలకు భరోసా కల్పించి పార్టీకి బలాన్ని చేకూర్చామని, బూత్ స్థాయి వరకు కాంగ్రెస్‌ను బలోపేతం చేశామని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇన్‌చార్జిలు మీనాక్షి నటరాజన్, దీపా దాస్ మున్షీ సహకారంతో పార్టీని ముందుకు తీసుకెళ్లామని, చిన్న చిన్న ఇబ్బందులను సులభంగా అధిగమించామని పేర్కొన్నారు. ఈ నెలాఖరు లోపు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సొసైటీ నియామకాల్లో మండల అధ్యక్షుల నిర్ణయానికే ప్రాధాన్యం ఇచ్చామని, కార్యకర్తల విషయంలో ఎమ్మెల్యేల నుంచి కొంత ఇబ్బంది ఎదురైనా మండల అధ్యక్షుల అభిప్రాయానికి విలువ ఇచ్చామని చెప్పారు. ఎఐసిసి నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే టికెట్ల విషయంలో డిసిసి అధ్యక్షుల అభిప్రాయం కీలకమని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పిఎసిలో ఎమ్మెల్యే టికెట్‌పై చర్చకు ముందే సంబంధిత డిసిసి అధ్యక్షుడి అభిప్రాయాన్ని తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకునే వారు తప్పనిసరిగా డిసిసి అధ్యక్షుడిని కలవాల్సి ఉంటుందన్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలోనూ డిసిసి అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. ఎఐసిసి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో కొత్త విధానాన్ని అమలు చేశామని, ఢిల్లీ నుంచి పరిశీలకులను పంపించి క్షేత్రస్థాయిలో సమీక్షించిన తర్వాతే డిసిసి అధ్యక్షులను ప్రకటించామని మహేష్‌కుమార్ గౌడ్ వివరించారు. డీలిమిటేషన్ లేకుంటే తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో 17 సీట్లను కాంగ్రెస్ గెలుచుకునేలా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎఐసిసి ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని బూత్ స్థాయి వరకు తీసుకెళ్లామని చెప్పారు. తెలంగాణలో కుల సర్వేతో నిజమైన సామాజిక న్యాయానికి పునాది పడిందని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల సర్వే అంశాన్ని తొక్కిపెట్టడం దురదృష్టకరమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దేశవ్యాప్తంగా కుల సర్వేను అమలు చేస్తామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో 57 శాతం వరకు బిసిలు విజయం సాధించారని, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పరంగా బిసిలకు 50 శాతం సీట్లు కేటాయించామని తెలిపారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. బిసి మంత్రిని తొలగించిన సమయంలో తాను కూడా బాధపడ్డానని మహేష్ కుమార్ చెప్పారు. కొండా సురేఖపై చర్యలు ఎఐసిసి నిర్ణయం మేరకే తీసుకున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎఐసిసి నిర్ణయించిందన్నారు.

# టిపిసిసి అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి..




### మహిళా కాంగ్రెస్ అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాన్య కార్యకర్త స్థాయి నుంచి టిపిసిసి అధ్యక్షుడిగా ఎదిగి, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో మహేష్‌కుమార్ గౌడ్ కీలకంగా వ్యవహరించారని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కొనియాడారు. టిపిసిసి అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం గాంధీభవన్‌లో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్‌లో కార్యకర్తలకు నూతన ఉత్సాహం వచ్చిందని, పార్టీ మరింత బలోపేతమైందని స్వర్ణ అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని విస్తరించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మహిళా కాంగ్రెస్ తరపున ఆయనకు ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.రాబోయే రోజుల్లో మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించాలని ఎర్రబెల్లి స్వర్ణ ఆకాంక్షించారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

## కెటిఆర్ వ్యవహార శైలిపై దళితులు తిరగబడతారు! : బల్మూర్ వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళితుల పట్ల కెటిఆర్ వ్యవహరిస్తున్న తీరు పై తెలంగాణలోని దళిత సమాజం త్వరలోనే స్పందిస్తుందని ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ హెచ్చరించారు. దళితుల పట్ల 'దొర అహంకారంతో' వ్యవహరిస్తున్న కెటిఆర్.. తన వైఖరిని మార్చుకోవాలని, తెలంగాణ సమాజానికి, దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ వ్యవహారశైలి ఒక కులానికే మచ్చ తెచ్చేలా ఉందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ప్రాంగణంలో దళిత స్పీకర్‌ను అవమానించిన బిఆర్‌ఎస్ నేతలు, సభలో క్షమాపణ చెప్పాలని కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. మరోవైపు కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళిత సంఘాలు డప్పు దండోరా నిర్వహించినప్పుడు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం ద్వా రా దళితులను అవమానించారని విమర్శించారు. ఈ ఘటనలతో బిఆర్‌ఎస్ దళిత వ్యతిరేక పార్టీగా మారిపోయిందని ఆరోపించారు. కెటిఆర్‌పిఎ,పిఆర్‌ఒల వ్యవహారశైలిపైనా బల్మూర్ వెంకట్ తీవ్రంగా మండిపడ్డారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌పై ఉపయోగించిన భాషనే కెటిఆర్ పిఎ,పిఆర్‌ఒలు కూడా ఉపయోగించారని ఆరోపించారు. పోలీసుల పట్ల కూడా వారు అనుచితంగా వ్యవహరించారని, విధి నిర్వహణలో ఉన్న పోలీసులను దూషించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. కెటిఆర్ ప్రవర్తనను చూసి సిగ్గు అనిపిస్తోంది. దళితుల పట్ల దొర అహంకారంతో వ్యవహరిస్తున్నారు. ఒక కులానికి మచ్చ తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కెటిఆర్ చేసిన తప్పుకు ఆ కులం మొత్తం తలదించుకోవాల్సిన పరిస్థితి రావద్దు అని బల్మూర్ వెంకట్ వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే బిఆర్‌ఎస్ నేతలు మాత్రం మీడియా దృష్టిని ఆకర్షించేందుకు హడావుడి చేస్తున్నారని విమర్శించారు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించడం సరికాదన్నారు. పోలీసులు తమ విధులను నిర్వర్తిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. తాను గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో దాడిలో పక్కటెముకలు విరిగినా పోలీసులపై ఎప్పుడూ దూషణలకు దిగలేదని బల్మూర్ వెంకట్ తెలిపారు. కెటిఆర్ ఇప్పటికైనా తన వ్యవహారశైలిని మార్చుకోవాలని, ఆయన పిఎ, పిఆర్‌ఒలు కూడా ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలని సూచించారు. కెటిఆర్ వ్యవహారశైలిపై దళితులు త్వరలోనే స్పందిస్తారని ఆయన స్పష్టం చేశారు.

# షూటింగ్‌లో తెలంగాణ పోలీసుల జోరు




- రాష్ట్ర, సౌత్‌జోన్ పోటీల్లో 15 పతకాలు..
- 6 స్వర్ణాలు, 4 రజతాలు, 5 కాంస్యాలు
- విజేతలను అభినందించిన డిజిపి సి.వి.ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విధి నిర్వహణలోనే కాదు.. క్రీడారంగంలోనూ తెలంగాణ పోలీసులు సత్తా చాటుతున్నారు. షూటింగ్ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ రాష్ట్ర, సౌత్‌జోన్ స్థాయి పోటీల్లో ఏకంగా 15 పతకాలు కొల్లగొట్టారు. ఇందులో 6 స్వర్ణాలు, 4 రజతాలు, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన పోలీసు షూటర్లను మంగళవారం డిజిపి కార్యాలయంలో డిజిపి సి.వి. ఆనంద్ అభినందించారు. క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పోలీసు శాఖకు పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. రానున్న జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జూన్ 20 నుంచి 28 వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ, శాట్జ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 12వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్–2026లో తెలంగాణ పోలీసు షూటర్లు 4 స్వర్ణాలు, 3 రజతాలు, 4 కాంస్యాలతో మొత్తం 11 పతకాలు సాధించారు. 13వ బెటాలియన్ టిజిఎస్‌పికి చెందిన జి.నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల పిస్టల్‌లో స్వర్ణం, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రజత పతకాలు సాధించారు. డిజి టెక్నికల్ సర్వీసెస్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎ.ప్రసన్నకుమార్ 50 మీటర్ల పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణం, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో కాంస్య పతకం దక్కించుకున్నారు. ఫ్యూచర్‌సిటీకి చెందిన ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్ బాబు రజతం, కాంస్య పతకాలు సాధించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న వాసీ వి. సువర్ణ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో స్వర్ణం సాధించారు. సిఎస్‌డబ్ల్యూ హైదరాబాద్‌కు చెందిన సిఐ బి.శంకర్ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8వరకు కేరళలోని తిరువనంతపురంలో జరిగిన 17వ సౌత్‌జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్–2026 లో తెలంగాణ పోలీసు షూటర్లు మరో నాలుగు పతకాలు సాధించారు. ఇందులో 2 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకం ఉన్నాయి. 3వ బెటాలియన్ టిజిఎస్‌పికి చెందిన జి. నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో రెండు స్వర్ణాలు, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్‌లో రజతం సాధించారు. ఫ్యూచర్‌సిటీ ఐటి సెల్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్‌బాబు కాంస్య పతకం దక్కించుకున్నారు. పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను ఐజి (పి అండ్ ఎల్) గజరావు భూపాల్, స్పోర్ట్స్ డిఎస్‌పి రామారావుతో పాటు పలువురు పోలీసు అధికారులు అభినందించారు.

## రాష్ట్ర సాధనలో ఉద్యోగులు, విద్యావేత్తల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యోగులు, మేధావులు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు పోషించిన పాత్ర అత్యంత కీలకమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. 'ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ రచించిన 'సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినం' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. .లక్ష్మణ్ , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతం రావు,ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్, తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ శ్రీవర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధి సుధాకర్ గాంధే పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ నేటి తరం (జెన్‌జీ, జెన్‌ఆల్ఫా) తెలంగాణ విముక్తి పోరాట చరిత్రను తప్పక తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.1947 ఆగస్టు 15 న యావత్ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం నిరంకుశ పాలనలోనే బందీగా మిగిలిపోయిందన్నారు.

# బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు వేయాలి

- అసెంబ్లీ ప్రాంగణ ఘటనపై సిసిటివి ఫుటేజీతో విచారణ జరపాలి..
- ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేత ఇందిరాశోభన్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో నిరసన సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులు, ఇతర అధికారుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్ డిమాండ్ చేశారు. ప్రజలు తమ ఓటుతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులే చట్టసభల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే ఉపేక్షించరాదని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనకు సంబంధించిన సిసిటివి ఫుటేజీలు, వీడియోలను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆమె ఎన్నికల సంఘాన్ని కోరారు. బాధ్యులుగా తేలిన ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే వారిపై అనర్హత వేటు వేసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించడం ఓటు హక్కును దుర్వినియోగం చేయడమేనని ఆమె పేర్కొన్నారు.

### మహిళా పోలీసుల ముందే అనుచిత ప్రవర్తన..

ఈ నెల 7న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్‌ఎస్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన పేరుతో అసెంబ్లీ ప్రాంగణంలో అనుచితంగా వ్యవహరించారని ఇందిరాశోభన్ ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసుల సమక్షంలో టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిరసనకు దిగడం సభ్య సమాజం తలదించుకునే చర్యగా అభివర్ణించారు. పోలీసు అధికారుల కాలర్లు పట్టుకుని దాడికి యత్నించారని ఆరోపిస్తూ, చట్టాలను అమలు చేసే పోలీసుల పట్ల, ముఖ్యంగా మహిళా అధికారుల పట్ల ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు.

### రాజ్యాంగ విలువలకు విరుద్ధం..

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే ఆ నిరసన ఇతరుల గౌరవానికి, మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఉండకూడదని ఇందిరాశోభన్ అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 21 స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనవారే రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ప్రవర్తించడం ఆందోళనకరమన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సిసిటివి దృశ్యాలను పరిశీలిస్తే ఘటనకు సంబంధించిన వాస్తవాలు స్పష్టమవుతాయని ఇందిరాశోభన్ పేర్కొన్నారు. వీడియో ఆధారాలతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన, ఎన్నికల పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలు, మహిళల గౌరవం, చట్టసభల ప్రతిష్ఠను కాపాడేలా ఎన్నికల సంఘం కఠిన నిర్ణయం తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇందిరాశోభన్‌తో పాటు కాంగ్రెస్ మహిళా నాయకులు రేణుక గౌడ్, రజని, జోత్స్న తదితరులు ఎన్నికల సంఘాన్ని కలిసిన వారిలో ఉన్నారు.

## శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని, పోలీస్ స్టేషన్లలోనే దాడులకు తెగబడే స్థాయికి కాంగ్రెస్ పాలన చేరిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. తెలంగాణ సిఎంగా రెండు సార్లు పనిచేసిన ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ ఇంటిపై కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది మందితో దాడి చేయించిందన్నారు. ఢిల్లీలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్ర పోలీసు వ్యవస్థను నమ్ముకుంటే న్యాయం జరగబోదని ప్రజలకు, తమకు పూర్తిగా అర్థమైందని, అందుకే ఈ దాడులు,పోలీసుల తీరుపైన న్యాయ స్థానాలను ఆశ్రయిస్తున్నామని వివరించారు. కోర్టుల్లో తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్న పూర్తి విశ్వాసం తమకు ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం..

**రైతులకు కిట్ల పంపిణీ : కె. సురేంద్రమోహన్**



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్రమోహన్ తెలిపారు. రైతులు పండించిన సేంద్రియ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా అధిక ఆదా యం పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' 107వ ఎపిసోడ్ మంగళవారం ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులకు సురేంద్రమోహన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతు ప్రకాష్ నాయక్ తన విజయగాథను ఇతర రైతులతో పంచుకున్నారు.సేంద్రియ రైతుల ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా అందించేందుకు 'టీజీ ఆర్గానిక్స్' యాప్ రూ పొందించినట్లు సురేంద్రమోహన్ తెలిపారు. రైతులు దళారీ వ్యవస్థకు దూరంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(లు)గా ఏర్పడి సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటే ఆదాయం పెరుగుతుందన్నారు. ఎఫ్‌పిఒల బలోపేతానికి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్‌ఎంఎన్‌ఎఫ్ ద్వారా గ్రామస్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లతో సేంద్రి య వ్యవసాయంపై శిక్షణ, భూసార పరీక్షలు, బయో రిసోర్స్ సెంటర్ల ఏర్పా టు, ఘనజీవామృతం, బీజామృతం, జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ సంచాలకులు డా.బి. గోపి తెలిపారు. ఇది లా ఉండగా, ఖరీఫ్‌లో 7 వరి సన్న రకాలు సాగు చేసిన రైతులు బోనస్ పొందేందుకు విత్తనాల కొనుగోలు వివరాలను డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. సొంత విత్తనాలు వినియోగించిన రైతులు స్వీయ ధ్రువీకరణతో సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో పంటల విస్తీర్ణ వివరాలను నమోదు చేయించుకోవాలని, తప్పులు ఉంటే 72 గంటల్లో సరిచేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఎపి మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని మృతి

**విశాఖపట్నం/ఏలూరు :** మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) 56 విశాఖలో మంగళవారం ఉదయం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఏడు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఆయన ఏలూరు కేంద్రంగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. ఆళ్ల నాని ఆకస్మిక మృతి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నేతలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇటు కార్యకర్తలను, అభిమానులను తీవ్రంగా కలచివేసింది. అనేక మంది రాజకీయ నేతలు ఆళ్ల నాని కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రికి ఆళ్ల నాని భౌతికకాయాన్ని ఏలూరులోని శ్రీరామ్ నగర్ 10వ రోడ్డులో గల స్వగృహానికి తరలించారు. బుధవారం రాజకీయ నేతలు, కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం ఆళ్ల నాని భౌతిక కాయాన్ని స్వగృహం వద్ద ఉంచుతారు. 17వ తేదీ గురువారం ఆయన భౌతిక కాయానికి ఏలూరులోనే అంత్యక్రియలు జరగనున్నాయి.

### వైఎస్ అనుచరుడిగా... ఏలూరు ఎమ్మెల్యేగా విజయాలు...

యుక్త వయసులోనే రాజకీయ ఆరంగేట్రం చేసిన ఆళ్ల నాని 1994లో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా కాగడా గుర్తుపై పోటీ చేసి 5,300 పై చిలుకు ఓట్లు సాధించారు. ఆళ్ల నాని ఉత్సాహాన్ని గమనించిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి సీటు కేటాయించగా టిడిపి నేత అంబికా కృష్ణపై పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయినప్పటికీ ఆళ్ల నాని పట్టు విడవకుండా అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారంలో పాలుపంచుకున్నారు. 2004 లో రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఆళ్ల నానికి మరో అవకాశం కల్పించడంతో తొలిసారిగా ఏలూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కోట్లాది రూపాయలు నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు. ఏలూరు మున్సిపాలిటీని 2005వ సంవత్సరంలో కార్పొరేషన్‌గా చేయించి... కేంద్ర నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా కార్పొరేషన్‌కు వచ్చేలా కృషి చేశారు. 2009 ఎన్నికల్లో ఆళ్ల నాని విజ యం సాధించి వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. వైఎస్సార్ మరణానంతరం ఆయన కుమారుడు వైఎస్ జగన్ అడుగుజాడల్లో నడవడం మొదలుపెట్టారు. 2014లో వైసిపి తరపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అటుతర్వాత 2019లో అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు ఎమ్మెల్యేగా గెలిచి... జగన్ హయాంలో ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా 2022 వరకు బాధ్యతలు నిర్వర్తించారు.



కరోనా మహమ్మారి సమయంలో ఆరోగ్య శాఖ మంత్రిగా విశేష సేవలందించారు. తర్వాత 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తదనంతరం వైసిపి కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆళ్ల నాని ఊహించని విధంగా ఫిబ్రవరి 2025లో తెలుగుదేశం పార్టీలో చేరారు. అయితే తర్వాత అత్యధిక సమయం విశాఖపట్నంలోని నివాసంలో ఉంటూ వచ్చిన ఆళ్ల నాని ఏలూరు నియోజకవర్గ ప్రజలకు దూరం కావడంతో పాటు ఎటువంటి అధికారిక పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొనలేదు. కేవలం ఆయన ఏలూరు వచ్చినప్పుడే తన అనుచరులు, అభిమానులు కలిసి వెళ్లేవారు.

## మెకానికల్ విద్యార్థులకు కెరీర్ దిశా నిర్దేశం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మెకానికల్ ఇంజినీరింగ్‌లో మారుతున్న సాంకేతిక ధోరణులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుంటే మెరుగైన కెరీర్ అవకాశాలు పొందవచ్చని వక్తలు సూచించారు. అనురాగ్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్వర్యంలో కెరీర్ అవకాశాల ధోరణులు, భవిష్యత్ పరిధి అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. థర్మేక్స్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వి.ఆర్ ఇంజినీరింగ్ సర్వీసెస్ నిర్వాహకుడు వి.వెంకటేశ్వరరావు ముఖ్య వక్తగా పాల్గొని తొలి సంవత్సరం విద్యార్థులకు మెకానికల్ రంగంలోని అభివృద్ధి చెందుతున్న ధోరణులు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా.కె.శ్రీనివాస చలపతి, విభాగాధిపతి డా.టి.కృష్ణయ్య, డా.సి.స్రవంతి, కె.సందీప్‌కుమార్, జిసిహెచ్ గంగారావు, టిఎన్ రవికాంత్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా.వి.విజయకుమార్, ఉపకులపతి డా.అర్చన మంత్రి, అనురాగ్ యూనివర్సిటీ యాజమాన్యానికి థర్మేక్స్ విద్యార్థి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



## గణేష్ నిమజ్జనానికి విద్యుత్ వైర్ల ముప్పు

### స్పందించిన ట్రాఫిక్ సిఐ శివశంకర్

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ నుంచి మల్కారం, అరుంధతి నగర్, మీదుగా బిట్స్ పిలానికి వెళ్లే మార్గంలో గణేష్ నిమజ్జన ఊరేగింపులకు విద్యుత్ వైర్లు పెద్ద ముప్పుగా పరిణమించాయి. రహదారిపై విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో వేలాడుతుండటంతో, నిమజ్జనానికి తీసుకెళ్లే ఎత్తైన విగ్రహాలకు ఈ వైర్లు తగిలి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ తీవ్ర సమస్యపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్పందిస్తూ, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యుత్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, వైర్ల ఎత్తును పెంచాలని విద్యుత్ శాఖాధికారులను కోరారు. సమాచారం అందుకున్న జవహర్ నగర్ ట్రాఫిక్ సిఐ శివశంకర్ తన సిబ్బందితో కలిసి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, నాయకులు నరేందర్, విక్రమ్, వంశీ, మహేష్, కే.మహేష్, పవన్, కృష్ణ, జాఫర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చర్లపల్లిలో గణనాథుడికి పూజలు


**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి చర్లపల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్, సీనియర్ రాష్ట్ర టిడిపి నాయకులు రుద్రగోని రాంచందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ప్రజలకు, నిర్వాహకులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రుద్రగోని వెంకటేష్‌గౌడ్, విజయ సింహారెడ్డి, రాకేష్, సందీప్, శివతేజ,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీలకు 20న ఎంపిక

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 20న ఎంపిక చేయనున్నట్లు నిర్వాహక కార్యదర్శి స్టాన్లీ జోన్స్, కూరపాటి రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధ్రువపత్రాలతో తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల హకీంపేట్లో రాజశేఖర్ కు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. అండర్ 14, 16 విభాగాల్లో షార్ట్ పుట్, త్రోబాల్, అండర్ 18లో లాంగ్జంప్, హైజంప్, అండర్ 20లో లాంగ్, హైజంప్, త్రిపుల్జాంప్, పురుష, స్త్రీ అభ్యర్థులు 20న ఉదయం 7గంటలకు హాజరుకావాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఈ నెల 26, 27న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలు హన్మకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో పాల్గొంటారన్నారు.

## జలమండలి రీడర్ కిరణ్ కుటుంబానికి మాధవరం కృష్ణారావు అండ

**ప్రజాపక్షం /కూకట్‌పల్లి :** జలమండలిలో రీడర్‌గా పనిచేస్తున్న కిరణ్ మృతి పట్ల కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కిరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన సొంత నిధుల నుంచి రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అన్ని విధాలు గా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఉన్న ఉద్యోగాలను కూడా తొలగించే పరిస్థితి తీసుకువచ్చారని విమర్శించారు. ఉద్యోగం కోల్పోతాననే ఆందోళనతో కిరణ్ తీవ్ర మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. హైదరాబాద్ మహానగర జలమండలిలో సుమారు 5వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారిలో 673మంది రీడర్లను తొలగించేందుకు ఆదేశాలు జారీ చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 23ఏళ్లుగా నిబద్ధతతో విధులు నిర్వహించిన కిరణ్ కుటుంబ పోషణపై ఆందోళనకు గురయ్యారని తెలిపారు. ఎన్నికల సమయంలో జలమండలి ఉద్యోగుల జీతాలను రూ.19,500కు పెంచుతామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీని అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించడం సరికాదని విమర్శించారు. జలమండలి కాంట్రాక్టు ఉద్యోగులకు ఎండీ అశోక్ రెడ్డి తక్షణమే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రక్షణ కల్పించకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు జలమండలి కార్యాలయాల ముట్టడి చేపడతామని హెచ్చరించారు. కిరణ్ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బిక్షపతి, సీనియర్ నాయకుడు రాములు, తదితరులు పాల్గొన్నారు.



# పోటెత్తిన భక్తులు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ పంచముఖ సంకటహర గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. 70 అడుగుల పంచముఖ సంకటహరి ఆశీర్వాదం పొందేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నా రు. ఉదయం నుంచి రాత్రి వరకు వీవీఐపీలతో పాటు భక్తులు వస్తుండటంతో ఖైరతాబాద్, లక్డీకాపూల్, సచివాలయం, సైఫాబాద్, ట్యాంక్‌బండ్ ప్రాంతాలు కిక్కిరిసి పోతున్నాయి. బారికేడ్ల ద్వారా మహాగణపతిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు నుంచి వచ్చేవారు గేట్ దాటిన అనంతరం ఏర్పా టు చేసిన బారికేడ్ల ద్వారా గణపతి చెంతకు చేరుకుంటారు. రాజ్ భవన్ చౌరస్తా నుంచి వచ్చేవారు వార్డ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్‌లోకి ప్రవేశించి గణపతి చెంతకు చేరుకుంటారు. ప్రభుత్వ ముద్రణాలయం వైపు నుంచి వచ్చే భక్తులు అక్కడ ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా గణపతి వద్దకు చేరుకునేలా ఏర్పాటు చేశారు. మహాగణపతిని లక్షలు భక్తులు దర్శించుకునే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టుగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. వందలాది మంది పోలీసులు మహాగణపతి చెంతన విధులు నిర్వహిస్తున్నారు. డిసిపి స్థాయి అధికారి నిరంతర పర్యవేక్షణలో నిఘా కొనసాగుతోంది. సుమారు 170 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. వీరికి తోడు గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు బందోబస్తు విధుల్లో ఉంటున్నారు.



## ధాన్యం కొనుగోలులో అప్రమత్తత అవసరం

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జిల్లాలో ఏర్పాటు చేయనున్న 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ ఒకటో తేదీ నాటికి ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదన పు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మంచి నీరు, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలు, తూకం, గన్నీ బ్యాగులు తదితర ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. ఖరీఫ్ 26–27 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణపై జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుగుణబాయి. పౌరసరఫరాల జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, మార్కెటింగ్ అధికారి రియాజ్, ఎస్‌డబ్ల్యుసి మేనేజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనానికి జిపిఎస్ ట్రాకింగ్ సదుపాయం తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జికి అవసరమైన శిక్షణ ముందుగానే అందించాలని ఆదేశించారు. ధాన్యం నిలువలు, నిర్వహణకు అవసరమైన ఇంటర్మీడియట్ గోదాములను గుర్తించి సిద్ధంగా ఉండే ఏర్పాటు చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా, నిర్ణీత వ్యవధిలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా జరిగేలా చూడటంతో పా టు రైతులకు ధాన్యాన్ని అమ్మిన 48గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో చెల్లింపు లు జరిగేలా చూడాలన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

## టిపిసిసి చీఫ్‌కు అభినందనల వెల్లువ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ గాంధీభవన్‌లో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మార్యద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం,ప్రజా సమస్యలపై కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించారు. మేముల మహేష్ గౌడ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని వేముల మహేష్ గౌడ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం ధర్మకర్త మెరుగు నరేష్ గౌడ్,ఎదులాబాద్ గ్రామ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బింగి రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.



## వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండొద్దు

### వెల్‌నెస్ సెంటర్ తనిఖీలో డిఎంహెచ్ఓ డా.ఆనంద్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ఉద్యోగులు, జర్నలిస్టులకు ఆరోగ్య పథకం ద్వారా లభించే వైద్య సేవల్లో ఎలాంటి అంతరా యం లేకుండా ఉండేందుకు అవసరమైన విషయాల్లో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఆనంద్ సూచించారు. మంగళవారం కూకట్‌పల్లిలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రిఫరల్ కేసుల వివరాలు, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదవుతున్న రోగుల వివరాలు, వారికందిస్తున్న వైద్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, దంత వైద్య సేవలు ఏ మేరకు కొనసాగుతున్నాయన్న విషయాలను పరిశీలించారు. అత్యవసర విభాగంలో రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ప్రక్రియలను చూసిన ఆయన రోగులకు అవసరమైన వైద్యం ఏ మాత్రం జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు.


## యాదగిరి మృతికి చైర్మన్ జాం రవి సంతాపం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుడు, ట్రాక్టర్ డ్రైవర్ యాదగిరి మృతి పట్ల మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ వెంకటగోపాల్‌లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ అద్రాస్‌పల్లికి చెందిన మున్సిపల్ కార్మికుడు యాదగిరి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇట్టి విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జాం రవి యాదగిరి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. బాధిత కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి కుటుంబీకులకు రూ.21వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరంమున్సిపల్ కార్మికుడిగా యాదగిరి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.

## ప్రజా ప్రయోజన స్థలాలను కాజేస్తూ షెట్టర్లు, షెడ్లు నిర్మాణాలు

### ఫిర్యాదులు అందినా పట్టించుకోని సర్కిల్ అధికారులు

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట ఇందిరమ్మ కాలనీ కాళీ జాగాల్లో మహిళా మండలి ముసుగులో తిష్టవేసిన కొందరు వ్యక్తులు ప్రజాప్రయోజన స్థలంలో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతూ అద్దె వసూళ్ల దందా కొనసాగుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా వుండే ఓ మహిళా మండలి సభ్యురాలు ఏకంగా తొమ్మిది నిర్మాణాలు చేపట్టి ఒక్కో షెడ్డుకు ఒక్కో రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు,సర్కిల్ అధికారులకు పాలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బౌరంపేటలో నిరుపేదల కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీ పేరుతో సుమారు 93 బ్లాక్ నిర్మించింది. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం ఒక్కో బ్లాక్ నిర్మాణానికి కొంత స్థలాన్ని కేటాయించిన అధికారులు ప్రజాప్రయోజనాల కోసం కొంత స్థలాన్ని వదిలేశారు,అట్టి స్థలంలో అంగన్వాడీ కేంద్రాలు, వాటర్ ట్యాంక్, ప్రజలకు ఉపయోగ పడే సేఫ్టిక్ ట్యాంక్, ఆట స్థలాలు, గుడి,బడి తదితర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. నిరుపేదల మూసుగులో ఇందిరమ్మ కాలనీలో చేరిన కొందరు వ్యక్తులు కాళీ స్థలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడు తూ అద్దె వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో ప్రజాప్రయోజనం కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమిస్తూ ఇస్టానుసారంగా షెట్టర్లు, షెడ్లు ఏర్పాటు చేస్తూ అద్దె వసూళ్లు చేస్తున్నారని మహిళా మండలి ముసుగులో అరుణ అనే మహిళ తొమ్మి షెట్టర్లు నిర్మించి అద్దె వసూళ్లు చేస్తున్నట్లు దుండిగల్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోవడంలేదని మహిళలు ఇందిరమ్మ కాలనీలో ఆందోళనకు దిగారు. నిరుపేదలు చిన్న నిర్మాణాన్ని చేపడితే కూల్చివేతలు పేరుతో హడావిడి చేసే అధికారులు పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చెపడుతూ అద్దె వసూళ్ల దందా కొనసాగిస్తున్న మౌనం వీడడం లేదని ఆందోళనకు దిగారు. బతుకమ్మ స్థలం అంటూ కొన్ని నిర్మాణాలను మాత్రమే కూల్చివేసిన అధికారులు, ప్రజాప్రయోజన స్థలం లో నిర్మించిన అక్రమ నిర్మాణాల జోలికి వెళ్ళడం లేదను అక్రమ నిర్మాణాలు తొలగించక పోతే దుండిగల్ సర్కిల్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని అధికారులను హెచ్చరించారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రోడ్డు, భద్రత, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యల్లో భాగంగా 31వ తేదీ నుడి 12వ తేదీ వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ మల్లేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌సి చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో నీరజ్‌శర్మ,హెచ్‌బి కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో బుచ్చయ్య అనే వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వీరిద్దరిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. నిందితులిద్దరికి 2 వేల రూపాయలు జరిమానా, రెండు వారాల జైలు శిక్ష విధించారు

## ఘనంగా గణనాథుని నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కూరగాయల అలంకరణలో శాకాంబరి గణపతి ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి శాకాంబరి అలంకరణ, ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల కూరగాయలతో గణనాథుడిని ముస్తాబు చేసిన తీరు అద్భుతంగా ముదురు రంగు వంకాయలు, తాజాగా ఉండే క్యారెట్లు, పచ్చిమిర్చి, టమోటాలు, కాకరకాయలను మాలలుగా అల్లి స్వామివారికి అలంకరించారు.





## చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు నిందితుల అరెస్టు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు నిందితులను నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం గత ఆదివారం మధ్యాహ్నం నేరేడ్‌మెట్ శివ నగర్ ప్రాంతంలో నడుచుకొంటూ వెళుతుండగా ఆకస్మికంగా వెనుక నుండి బైకుపై వచ్చిన ఆగంతకులు తన మెడలోంచి బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారంటూ బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంఘటనాస్థలిలో ఉన్న సిసిటివి కెమెరాల ఫుటేజి, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారాంగా నిందితులుగా గుర్తించిన రిహాన్ అహ్మద్, మహ్మద్ సోను, ఆసింలను అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి విచారణతో నిందితుల నుండి 7.10 గ్రాముల మెల్ట్ చేసిన బంగారం, చోరీకి వినియోగించిన బైకు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.



## ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : కమిషనర్ సంచిత్ గంగ్వార్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గణేష్ నిమజ్జనంలో భక్తులకు, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట పెద్ద చెరువులో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను మల్కాజ్‌గిరి ట్రాపిక్1 డిసిపి రాహుల్‌రెడ్డి, మల్కాజ్‌గిరి డిసిపి శ్రీధర్‌రెడ్డి, కీసర సర్కిల్ డిప్యూటి కమిషనర్ రామలింగంలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని చెరువుల్లో నీరు సరిగా లేదని శామీర్‌పేట చెరువులో ఎక్కువగా నీళ్లు ఉండటం వలన శామీర్‌పేట చుట్టు పక్కల గ్రామాలతో పాటు నగరం నుంచి భారీగా వినాయకులు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం ఉందన్నారు. నిమజ్జనాలకు తరలివచ్చే భక్తులకు, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిరంతరంగా విద్యుత్ ఉండేటట్లు చూడాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టాలని, వైద్య సదుపాయాలు, పార్కింగ్, భక్తులకు తాగునీరు, అత్యవసర వేళల్లో ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే అంబులెన్స్, ఫైర్ ఇంజన్‌లు, అందుబాటులో ఉండేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, తిరుమలగిరి ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు, అల్వాల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు జానకిరాములు, కొండ నర్సింహారెడ్డి, ఎంఎంసి ఇఇ లక్ష్మ ణ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మట్టి వినాయకులనే పూజిద్దాం

### పిఎసి అరికెపూడి గాంధీ

**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** ప్రతి ఒక్కరు మట్టి వినాయకులనే పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిఎసి అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వివేకానందనగర్‌లోని ఆయన నివాసంలో తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు కలిసి గాంధీని శాలువాతో సత్కరించి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లోని సకల విఘ్నాలు తొలగిపోయి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంపై శ్రీ వినాయకుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. మన సంసృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా భక్తితో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను కూడా చాటుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్ పరిశీలించిన కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఇవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, అదనపు కలెక్టర్ వెంకటచారి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం గోడౌన్ సీల్ ను తెరిచి ఇవిఎంలను,బ్యాలెట్ యూనిట్లు.ఎన్నికలసామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణంగా పరిశీలించారు. సిసి కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు ,ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాట్టిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ స్వర్ణలత ,తహసీల్దార్ లక్ష్మి నారాయణ , నెహమత్‌హాలీ ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గోన్నారు.




**అభివృద్ధి పనుల పర్యవేక్షణ :**

**కొడంగల్ :** పలు అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి పర్యవేక్షించారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని ధర్మపూర్ గ్రామాని సంబంధించిన తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న నీటీ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని చెరువు కుంటలోని ఉన్న బోర్ ను వినియోగించి గ్రామానికి తాగునీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఈఈరవి కుమార్, సంబంధిత అధికారులను కలెక్టర్ అదేశించారు. బోర్ నుంచి నీటిని గ్రామానికి సక్రమంగా సరఫరా చేసేలా అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్లాలని సూచించారు. ప్రజలకు తాగునీరు కొరత లేకుండా అధికారులు ,నిరంతరం పర్యవేక్షించాలని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం రైతులు తమ పొలాలకు వెళ్ళడానికి ఇబ్బదిగా ఉన్నందున నక్షబాట బిటి రోడ్డు వేయించవలసిందిగా రైతులు కోరారు. అనంతరం అంగడి రాయిచూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని హాజరు పట్టిక రిజిస్టర్ ,స్టాక్ రిజిస్టార్‌తో పాటు మందులు ,ఇతర వైద్య సామగ్రి నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలెక్టర్ పరామర్శించి ,ఆరోగ్య పరిస్థితి అందుతున్న వైద్య సేవలు ,మందుల అభ్యాత తదితర వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డిపిఓ జయసుధ , తహసీల్దార్ రామ్మోహన్ ,ఎంపిడిఓ ఉషశ్రీ ,సర్పంచు సౌభగ్యల,ఈఈరవికుమార్ లు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/దౌల్తాబాద్:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్ఐ వేణుకుమార్ తెలిపిన విరాలు ప్రకారం ఏకకాలంలో మూడు వానాలు పట్టుకున్నారు. టాస్కోఫోర్స్ సిబ్బంది సెప్టెంబర్ 13వ తేదీన టాస్క్‌ఫార్స్ సిబ్బంది . దాదులు జరపగా మూడు వానానాలలో పట్టుకున్నారు. ఇట్టి వాహనాలలో ఉన్న594 ప్యాకెట్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇట్టి వాహనాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు.



**గొంతు కోసి హత్య :** దౌల్తాబాద్ మండల పరిధిలోని యంకి గ్రామానికి చెందిన బోడి బుజ్జప్ప అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. కుమారుడు మాదవ్ ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
16-09-2026
www.prajapaksham.in

‘ అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే ప్రయత్నం ప్రారంభించారు. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బలక్ష్మిగా రశ్మిక మందన్న నటిస్తున్నారు. ’

రీల్

# ‘ఎంఎస్ సుబ్బలక్ష్మి’గా రష్మిక



అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే ప్రయత్నం ప్రారంభించారు. నిర్మాతలు అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్ సంయుక్తంగా ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బలక్ష్మి గా రశ్మిక మందన్న నటిస్తున్నారు. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి 110వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ను ప్రకటించారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీ వేదికగా ఈ చిత్ర అనౌన్స్ మెంట్ ఘనంగా చేశారు.తన నట ప్రతిభతో దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్న హీరోయిన్ రశ్మిక మందన్న ఎంఎస్ సుబ్బలక్ష్మి పాత్రకు ప్రాణం పోసి, ఆ పాత్రలో జీవించబోతున్నారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ అనౌన్స్‌మెంట్ సంగీత ప్రియుల్లో ఆనందాన్ని నింపుతోంది. వరల్డ్ క్లాస్ మేకింగ్, హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

## ‘కమల రెడ్డి’గా రమ్యకృష్ణ



మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా ‘డేవిడ్ రెడ్డి’. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్‌పై వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా డేవిడ్ రెడ్డి సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మారియా ర్యాబోషప్క హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో నటి రమ్యకృష్ణ ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇందులో రమ్యకృష్ణ పాత్ర పేరు కమల రెడ్డి. నటి రమ్యకృష్ణ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ‘డేవిడ్ రెడ్డి‘ సినిమా నుంచి ఆమె బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో రమ్యకృష్ణ కమల రెడ్డి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. ఈ పోస్టర్ లో ఆమె ఖడ్గంతో శత్రువులను తుదముట్టించి తన ఆసనంపై కూర్చుని ఫెరోషియస్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు. రమ్యకృష్ణ కెరీర్ లో కమల రెడ్డి పాత్ర ఒక ఐకానిక్ క్యారెక్టర్ గా గుర్తుండిపోనుంది. మంచు మనోజ్, మరియా ర్యబోషప్క, రమ్యకృష్ణ, ఆర్. పార్తీబన్, కాంచన, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డిఒపి ఆచార్య వేణు, మ్యూజిక్ రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొట్టు రవికుమార్.

## ‘ఫ్యామిలీ ప్యాక్’తో వస్తున్న శ్రీవిష్ణు




కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు తనకు బాగా సూటయ్యే కథలను ఎంచుకుంటూ తన అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తుంటారు. తాజాగా మరో ఆసక్తికరమైన ఎంటర్‌టైనర్‌తో వస్తున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో‘ ఫ్యామిలీ ప్యాక్’ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కుతోంది. నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తుండగా, అనిల్ యెర్నేని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ‘సామజవరగమన’ తర్వాత శ్రీ విష్ణు, రామ్ అబ్బరాజు కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. రామ్ అబ్బరాజు గత బ్లాక్‌బస్టర్ నారి నారి నడుమ మురారి’లో శ్రీ విష్ణు క్యామియో రోల్‌లో కనిపించారు. ఈ సినిమాలో శ్రీ విష్ణు సరసన సాక్షి మధోల్కర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ‘ఫ్యామిలీ ప్యాక్’ అనే హ్యూమరస్ టైటిల్‌తోనే సినిమా ఎలాంటి ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించబోతుందో ప్రజెంట్ చేశారు. ఫస్ట్ లుక్‌లో శ్రీ విష్ణు కలర్ ఫుల్ మల్టీ స్టోరీ ఇంటీరియర్‌లోపై నుంచి కిందికి పడుతూ కనిపిస్తున్నారు. చేతులు చాచి, షాక్ అయిన ఎక్స్‌ప్రెషన్‌తో ఆయన కనిపిస్తుండగా.. వివిధ అంతస్తుల్లో నరేష్ వీకే, అభిరామి, సాక్షి మధోల్కర్ సహా పలువురు కుటుంబ సభ్యులు నిలబడి కింద జరుగుతున్న వింత పరిస్థితిని చూస్తున్నారు. చుట్టూ ఎగురుతున్న కరెన్సీ నోట్లు పోస్టర్‌లోని హ్యూమర్‌ని మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రానికి జె. యువరాజ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. అనిల్ పసాల ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. రచయితలు భాను భోగవరపు, నందు సావరిగాన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ‘ఫ్యామిలీ ప్యాక్’ పండగ సీజన్‌లో ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు వచ్చే ఏడాది సంక్రాంతికి సిద్ధమవుతోంది.

## 25న ‘ప్రేమనే ఊరిలో’ విడుదల



మహా రత్న ప్రొడక్షన్స్, ఎస్‌కె పిక్చర్స్, వనిల్లా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం ‘ప్రేమనే ఊరిలో’. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేయగా అందరిలోనూ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసింది. అలాగే తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ పొందాయి. 25న ఈ సినిమా థియేటర్స్ లో విడుదలకు సిద్ధమైంది. కెజిఎఫ్ , కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందించిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాశారు. ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు. సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## ‘లీసా’కు మణిశర్మ సంగీతం




ఓం సాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘లీసా’. విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభావంతురాలైన నటి అనన్య నాగళ్ల ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. జవహర్ పవార్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని విధంగా రెండు భిన్నమైన జోనర్లను సరికొత్త పద్ధతిలో మేళవించి ‘లీసా’ కథను రూపొందించారు. తాజాగా ఈ సినిమా టీమ్ లో జాయిన్ అయ్యారు మెలొడీ బ్రహ్మ మణిశర్మ. స్క్రిప్ట్ విని ఇంప్రెస్ అయిన మణిశర్మ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వ బాధ్యతలు వహించేందుకు ముందుకొచ్చారు. ఆయన మ్యూజిక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సతీష్ రెడ్డి మాసం ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు స్క్రీన్‌ప్లే సమకూర్చి, సహ నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. ‘ఎస్సార్ కళ్యాణమండపం’ దర్శకుడు శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. పులి రాకేష్ గౌడ్ కె.నరసింహులు, బనద్ల శ్రీపతి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ‘లీసా’ సినిమా నవంబర్ లో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.అనన్య నాగళ్ల, అల్లాల రవిరెడ్డి గారు, సుమన్, మూసా అలీ ఖాన్, రత్నాకర్ రెడ్డి, జబర్దస్త్ సత్యశ్రీ, గడ్డం నవీన్, ఆకెళ్ల, రవిరెడ్డి, స్వప్న చౌదరి, గోపీ కార్తికేయ, సుజాత, సుజి, మానస, శ్యామ్, వెన్ని, జాను వర్మ, కనకం వెంకట్, బేబీ ట్వింకిల్, హనుశ్రీ తదితరులు నటిస్తున్నారు.

## హాస్యభరితంగా ‘అనుమాన పక్షి’



డిజె టిల్లు’తో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన విమల్ కృష్ణ.. మరో ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘అనుమాన పక్షి’. రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా హ్యూమర్, క్యారెక్టర్స్, కథనంలో పూర్తిగా డిఫరెంట్ గా ఉండబోతోంది. చిలక ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా 18న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో హీరో సిద్ధు జొన్నలగడ్డ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ప్రతి విషయాన్నీ అతిగా ఆలోచించే సన్నీ.. తన చుట్టూ జరిగే దాదాపు ప్రతిదాంట్లోనూ ఏదో అనుమానాస్పదమైన విషయం ఉందని భావిస్తుంటాడు. కశ్మీర్ వెళ్లిన తర్వాత ఓ అమ్మాయిని కలుసుకుంటాడు. ఆమెతో పరిచయం క్రమంగా ప్రేమగా మారుతుంది. మరోవైపు ఓ పోలీస్ ఆఫీసర్ సన్నీని వెంటాడటం మొదలుపెడతాడు. అసలు కశ్మీర్‌లో ఏం జరిగింది? ఆ పోలీస్ సన్నీని ఎందుకు వెంటాడుతున్నాడు? అనేదే కథలో కీలకాంశం.అజయ్, రాశి, ప్రిన్స్ సిసిల్, అనన్యా, చరిత్, బ్రహ్మాజీ తదితరులు తమ పాత్రల్లో ఆకట్టుకున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సునీల్ కుమార్ నామా, శ్రీచరణ్ పాకాల తన సంగీతం, . జెకె మూర్తి ఆర్ట్ డైరెక్టర్‌గా, చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు!

- కేసులు ఉపసంహరించుకుంటే 37 మందికి వెంటనే అదనపు ఎస్‌పిలుగా ప్రమోషన్లు
- సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా: డిజిపి సి.వి. ఆనంద్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిఎస్‌పిల పదోన్నతుల వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. కోర్టు కేసులతో పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం కలుగుతున్న నేపథ్యంలో పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డిఎస్‌పిలకు డిజిపి సి.వి. ఆనంద్ సూచించారు. సమస్య పరిష్కారానికి తాను ముందుండి చొరవ తీసుకుంటానని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ మూడు బ్యాచ్‌లకు చెందిన 37 మంది డిఎస్‌పిలకు అదనపు ఎస్‌పిలుగా పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే పదోన్నతుల విషయంలో కొందరు అధికారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ప్రక్రియ కొంతకాలంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో డిజిపి సి.వి. ఆనంద్ స్వయంగా చొరవ తీసుకుని డిజిపి కార్యాలయంలో ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు అధికారులకు వారం రోజుల సమయం ఇచ్చారు.

### ‘కేసులు వేసుకుని నష్టపోవద్దు’..

కోర్టు కేసుల కారణంగానే పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదని డిజిపి వివరించారు. కేసులు వేసుకుని నష్టపోవద్దు. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు అని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్‌పి ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిజిపితో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు తాము కోర్టుల్లో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డిజిపికి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన ఆయా బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిఎస్‌పిల నుంచి అదనపు ఎస్‌పిలుగా పదోన్నతుల అంశం పరిష్కార దిశగా కదిలింది. డిజిపి సి.వి. ఆనంద్ ప్రత్యేక చొరవతో సమస్యకు పరిష్కారం లభించే అవకాశాలు ఏర్పడటంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతుల ప్రక్రియ త్వరగా పూర్తయితే అర్హులైన అధికారులకు ప్రయోజనం కలగడంతో పాటు పోలీసు శాఖలో ఉన్నతస్థాయి ఖాళీల భర్తీకి కూడా మార్గం సుగమం కానుంది.

# లొంగిపోయిన మావోయిస్టు సుశీలా రాణి

5రూ.లక్షల చెక్కు
25రూ. వేల తక్షణ ఆర్థిక సాయం



ప్రజాపక్షం/నిజామాబాద్: మావోయిస్టు కమిటీ సభ్యురాలు నక్క సుశీలా అలియాస్ రాణి అలియాస్ లత లలిత రేలా జ్యోతి అలియాస్ మాధవి అలియాస్ శ్వేత నిజామాబాద్ పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. నక్కసుశీల అలియాస్ రాణి లొంగిపోవటం మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ అని సిపి పేర్కొన్నారు. ఈ మేరకు సిపి సాయిచైతన్య మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మావోయిస్టు ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యురాలు, డీవీసీ ఛత్తీస్‌గడ్ ఏరియాసభ్యురాలైన నక్క సుశీలా బోధన్‌లోని శక్కర్‌నగర్ స్వస్థలం కాగా ఆమె తండ్రి నిజాంషుగర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్ పని చేసే వారని అక్టోబర్ 2005లో ఆయన గుండెపోటుతో మరణించారన్నారు. సుశీలా చిన్నప్పుడే తల్లి కమల అనారోగ్యంతో మృతి చెందింది. సుశీల 1985లో హైదరాబాద్‌లోని నారాయణగూడలో మాడపాటి హన్మంతరావు బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న తరుణంలో ఆమెకు బంధువైన సురేంద్ర ద్వారా దివంగత రామ్మోహన్‌రావు పరిచయమయ్యారు. ఆయన సిపిఐ ఎంఎల్‌పిడబ్ల్యు సిద్ధాంతాలు కలిగి ఉండటంతో సుశీల ఆకర్షితురాలైంది. ఆమె 1990లో నల్గొండ జిల్లా కమిటీ ఎసిఎం అయిన సుంకర రామ్మోహన్‌రావు వివాహం చేసుకున్నారు. ఫిబ్రవరి 1992లో సిపిఐఎంఎల్ పిడబ్ల్యులో చేరారు. 2001లో నల్లమల్ల అడవిలో జరిగిన ఎదురు కాల్పుల్లో రామ్మోహన్‌రావు మరణించారు. ఆ తర్వాత 2004లో ఆమె ఎస్‌సిఎం సామలును వివాహం చేసుకున్నారు. ఛత్తీస్‌గడ్ అటవీ ప్రాంతంలో 2006లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆయన మరణించారన్నారు. తెలంగాణకు చెందిన అజ్ఞాత మావోయిస్టు కార్యకర్తలందరూ జనజీవన స్రవంతిలో చేరాలని ప్రభుత్వం చేసిన సూచన మేరకు నక్క సుశీలా సైతం జనజీవన స్రవంతిలో కలిసినట్లు సిపి వెల్లడించారు. 5 రూ.లక్షల చెక్కు, 25 రూ.వేల తక్షణ ఆర్థిక సాయమందించినట్లు తెలిపారు.

## 2 లక్షల ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. పేదల కోసం రెండు కోట్ల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంలో భాగంగా, తెలుగు రాష్ట్రాలకు ఐదు లక్షల ఇళ్లను కేటాయించారు. గతంలో తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీ ఈ పథకాన్ని తిరస్కరించడం వల్ల ‘ప్రధాన మంత్రి ఆవాస్ యోజన’ ప్రారంభమైనప్పటి నుండి రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఇళ్లు కేటాయించబడలేదు. అయితే, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, ప్రస్తుత ప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు, ఈ పథకం కింద తెలంగాణలో రెండు లక్షల ఇళ్లను నిర్మించనున్నారు. అదే విధంగా 2019–24 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు 1,78,000 ఇళ్లు కేటాయించగా, అందులో కేవలం 42,000 ఇళ్లు మాత్రమే నిర్మితమయ్యాయి, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, తాజాగా రాష్ట్రానికి మరో 1,22,000 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిని రెండు నుండి మూడు సంవత్సరాల వ్యవధిలో పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ‘ప్రధాన మంత్రి ఆవాస్ యోజన’ పథకం కింద, ప్రతి లబ్ధిదారునికి కేంద్రం నుండి రూ. 1.20 లక్షల ఆర్థిక సహాయం లభిస్తుంది. ఇతర పథకాలతో కలిపి వారికి మొత్తం రూ. 1.70 లక్షల నుండి రూ. 1.80 లక్షల వరకు ప్రయోజనాలు అందుతాయి. ‘స్వచ్ఛ భారత్ అభియాన్’ పథకం కింద, ఇంటి నిర్మాణంతో పాటు మరుగుదొడ్డి నిర్మాణానికి లబ్ధిదారులకు అదనంగా రూ. 12,000 లభిస్తాయి. పేదలకు మరింత సహాయం చేయడానికి, కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి అనేక చర్యలు చేపట్టింది. ఇటీవల, కేంద్రం ఈ పథకానికి సంబంధించిన అర్హత ప్రమాణాలను సడలించింది. దీని ప్రకారం, కుటుంబ నెలవారీ ఆదాయం రూ. 15,000 కంటే తక్కువగా ఉండాలి; ఇంతకుముందు ఈ పరిమితి రూ. 10,000గా ఉండేది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే వ్యక్తి బైక్ లేదా రిఫ్రిజిరేటర్ వంటి వ్యక్తిగత వస్తువులను కలిగి ఉండటం వల్ల అనర్హులు కారని కేంద్రం స్పష్టం చేసింది. దీనివల్ల దిగువ తరగతి వర్గాలలోని చాలా మందికి ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. సామాన్య ప్రజలకు సౌకర్యం కల్పించడానికి ప్రవేశపెట్టిన స్వీయ సర్వే సదుపాయంతో పాటు, లబ్ధిదారులను ఎంపిక చేసే జియోట్యాగింగ్ ప్రక్రియను ‘ఆవాస్ ప్లస్’ యాప్ ద్వారా నిర్వహిస్తున్నారు. కొత్తగా మంజూరైన ఇళ్లన్నింటినీ, అలాగే నిర్మాణంలో ఉన్న పాత ఇళ్లను రాబోయే రెండు నుంచి మూడు సంవత్సరాలలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## చరిత్ర వెలికితీయాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళల చరిత్రను వెలుగులోకి తీసుకురావాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో ‘తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంమహిళల పాత్ర’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రచయిత డాక్టర్ శ్రీదేవి , రచయిత కొండపల్లి నిహారిక, ఆరుట్ల సుశీలమ్మ, ఎఐటియుసి జాతీయ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి , తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, కోశాధికారి రావి ప్రతిభ, అవదేశ్ రాణి, రచయిత విమల, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, కార్యదర్శి పైమిదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సాయుధ పోరాట కాలంలో స్త్రీలు బయటకు రావడమే ఒక వీరోచిత ఘట్టమని పేర్కొన్నారు. అవిద్య, మూఢ నమ్మకాలు, వివక్ష, సామాజిక ఆంక్షలను అధిగమించి మహిళలు ఆయుధ శిక్షణ తీసుకోవడంతో పాటు కొరియర్లుగా, ఆరోగ్య సేవకులుగా, ప్రచారకులుగా పనిచేశారని తెలిపారు. వీరబైరాన్‌పల్లి, మల్లారెడ్డిగూడెం వంటి ప్రాంతాల్లో మహిళలు సమూహాలుగా రజాకార్లను ఎదిరించి పోరాడారని చెప్పారు. కాసర్ల కమలమ్మ, కట్కూరి సుశీలమ్మ, కొండవీటి ఇందిరమ్మ, కొమ్మిడి సుగుణమ్మ, గంగసాని ఆండాలమ్మ, చకిలం లలితాదేవి, మంగళపల్లి రాములమ్మ తదితర మహిళల సాహసగాథలు కూడా వెలుగులోకి రావాల్సి ఉందన్నారు. గంగసాని ఆండాలమ్మ మహారాష్ట్రకు వెళ్లి ఉద్యమానికి అవసరమైన ఆయుధాలను సేకరించారని, కొమ్మిడి సుగుణమ్మ కొరియర్‌గా ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొన్నారని వివరించారు. అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా పోరాట యోధుల జయంతి, వర్ధంతులను వారి స్వగ్రామాల్లో నిర్వహించి వారి చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రీదేవి సూచించారు. నిహారిక మాట్లాడుతూ మహిళలు ఆకాశంలో సగం కాదని, ఆకాశమే మహిళలని, వారు తలచుకుంటే సాధించలేనిది ఏమి లేదన్నారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అవదేశ్ రాణి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగా సాయుధ పోరాటంలో ముస్లిం మహిళల పాత్రం అనిర్వచనీయమన్నారు. విమల మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఏలాంటి సంబంధం లేని బిజెపి నేతలు ఆ చరిత్రను వక్రీకరిస్తూ సభలు , సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఈ వక్రీకరణను కమ్యూనిస్టు పార్టీలన్ని ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. ప్రేమ్ పావని అధ్యక్షోపన్యాసం చేస్తూ తెలంగాణ సాయుధ పోరాటం జరిగి 78 ఏళ్లు గడిచినా భూమి, విముక్తి కోసం ప్రజలు ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నామన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చరిత్రలో అనాదిగా మహిళలకు అన్యాయం జరుగుతూనే ఉందని, చరిత్రలో పురుషుల కథనాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు చేసిన త్యాగాలు, వీరోచిత పోరాటాలు చరిత్రలో తగిన స్థాయిలో నమోదు కాలేదన్నారు. ‘హిస్ స్టోరీ’తో పాటు ‘హర్ స్టోరీ’ కూడా చరిత్రలో భాగం అయ్యేలా మహళలు కృషి చేయాలన్నారు. జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు చూపిన పోరాట స్ఫూర్తి, త్యాగం మరవలేనిన్నారు. నిజాం, రజాకార్లు, దొరల గూండాలు మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడినా వెరవకుండా వీరోచితంగా పోరాడారన్నారు. ఉద్యమంలో పాల్గొన్న పురుషులను తమ కడుపులో పెట్టుకుని బిడ్డల్లా కాపాడుకుంటూ, సహచరులుగా, కూతుర్లుగా, తల్లులుగా మహిళలు అందించిన సహకారం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మహిళల త్యాగాలు మరవలేవన్నారు. పల్లెలపై తెగబడిన రజకార్లు, పోలీసులను చేతికిందిన వస్తువునే ఆయుధంగా చేసుకుని ఎదురొడ్డి నిలిచిన వీరమాతలని కొనియడారు. తులత సదస్సుకు సదస్సుకు ఛాయాదేవి స్వాగతం పలికారు.

## యుద్ధం చేయగలం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలను ప్రతిఘటించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో జరిగే యుద్ధాలలో అమెరికా కృత్రిమ ఉపగ్రహాలకు నష్టం కలిగించడానికి, వాటి కార్యకలాపాలను అడ్డుకోవడానికి రష్యా–చైనా దేశాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని, కొత్త మార్గాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు.అంతరిక్ష సైనిక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని యోచిస్తున్నట్లు అమెరికా సీనియర్ సైనిక అధికారులు గతంలోనే ప్రకటనలు చేశారు. అమెరికా రక్షణకు ట్రంప్ ఒక గోల్డెన్ డోమ్ ప్రాజెక్టును కూడా ప్రకటించారు. అమెరికా అంతరిక్ష ఆయుధశక్తి పాత్రను నొక్కి చెబుతూ గత ఏడాది ఆయన ఒక ఉత్తర్వు విడుదల చేశారు.అమెరికా వద్ద ఇన్నాళ్ళుగా రహస్యంగా ఉన్న ఈ కొత్త సామర్థ్యాన్ని ఇప్పుడు ఎందుకు బహిరంగంగా ప్రకటించారన్న విషయంపై మీంక్ స్పందించలేదు.చైనా,రష్యాలు తమ సొంత అంతరిక్ష ఆయుధాలను అభివృద్ధి చేస్తున్నాయని ఎయిర్–స్పేస్ ఫోర్సెస్ మ్యాగజైన్ ప్రకటించింది.ఎక్స్–37 బి, గోల్డెన్ డోమ్ వంటి వ్యవస్థలద్వారా మరింత సమగ్రమైన అంతరిక్ష ఆయుధ వ్యవస్థను అమెరికా నిర్మిస్తోంది. కాగా బాహ్య అంతరిక్షాన్ని ఆయుధమయం చేయడాన్ని చైనా విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి గ్వో జియాకున్ తీవ్రంగా ఖండించారు.అంతరిక్షాన్ని యుద్ధభూమిగా మార్చడాన్ని, అంతరిక్షంలో లాంటి ఆయుధ పోటీనైనా చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అంతరిక్షంలో ఆయుధ పోటీ ప్రారంభించే ఉద్దేశం చైనాకు లేదని స్పష్టం చేశారు. బాహ్య అతరిక్షాన్ని శాంతిమండలంగా ఉంచాలని చైనా నిరంతరం వాదిస్తోందని,అక్కడి భద్రతను కాపాడేందుకు కృషిచేస్తూ వస్తోందని అన్నారు. ట్రాయ్ మీంక్ చేసిన బహిరంగ ప్రకటనను చైనా సైనిక వ్యవహారాల నిపుణుడు సాంగ్ జోంగ్ పింగ్ తీవ్రంగా విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆయుధ నిల్వలన్నీ తగ్గిపోయాయని ప్రపంచానికి బహిర్గతమైన తరుణంలో నిరంతరాయంగా తన సైనిక ఆధిపత్యాన్ని ప్రకటించుకోవడంకోసమే అమెరికా ఈ తాజా ప్రకటన చేసిందని సాంగ్ జోంగ్ పింగ్ విమర్శించారు. ఇప్పటివరకూ అమెరికా ఈ విషయంలో రహస్య విధానం అమలు చేసిందని, ఇప్పుడు సైనిక ఆధిపత్యాన్ని ప్రదర్శించడంకోసమే ఈ ప్రకటన చేసిందని విమర్శించారు. అదేవిధంగా చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ, అంతరిక్ష ఆయుధాల విస్తరణ,బాహ్య అంతరిక్షంలో యుద్ధ సన్నాహాలను అమెరికా మానుకోవాలని కోరినట్లు ఎఎఫ్‌పి పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com